20-12Pg1exHNMWJQE 1 ONG_20-12Pg1exHNMWJQE.qxd 19/Dec/25 11:29 PM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

మీ నమ్మకమే మా తరగని సంపద
కపిల్ చిట్స్
KAPIL GROUP
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-12-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 319 పేజీలు: 12 వెల: 6.50

## నల్లమల్ల సాగర్‌కు
# సహకరించండి

### కరవు పీడిత ప్రాంతాలకు గోదావరి జలాలు
### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సిఎం వినతి
### పూర్వోదయతో గ్రోత్ ఇంజిన్‌గా ఎపి.. చేయూతనివ్వండి
### రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు ప్రోత్సాహకాలివ్వండి
### వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని చంద్రబాబు విజ్ఞప్తి



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్ప గుచ్ఛం అందచేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని కరువు పీడిత ప్రాంతాలకు గోదావరి వరద జలాలను తరలించుకునేలా పోలవరం - నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు సహకారం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఏపీ చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేసారు. ఈ మేరకు కేంద్రమంత్రికి విజ్ఞాపన పత్రం ముఖ్యమంత్రి స్వయంగా అందించారు. ఢిల్లీ పర్యటనల్లో భాగంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను చంద్రబాబు కలుసుకున్నారు. ఈ భేటీలో గంటకు పైగా రాష్ట్రానికి చెందిన పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి నదికి వచ్చే వరద జలాల్లో 200 టీఎంసీల నీటిని పోలవరం ఆనకట్ట నుంచి నీటి కొరత ఉన్న ప్రాంతాలకు తరలించటమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రంలో కరవు నివారణ సాధ్యపడుతుందని వివరించారు. మూడు దశలుగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు అయ్యే వ్యయాన్ని వివరిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రికి అందించిన లేఖలో తెలిపారు. ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ఇప్పటికే జలహారతి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. దీనికి సంబంధించి ప్రాథమిక ప్రాజెక్టు రిపోర్టును కూడా కేంద్ర జలశక్తి శాఖకు సమర్పించినట్టు తెలిపారు. దీనికి ఆమోదం తెలిపిన వెంటనే డీపీఆర్‌ను సమర్పిస్తామని చెప్పారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రుణ సహకారం అందించిన తరహాలోనే ఈ ప్రాజెక్టుకు కూడా కేంద్రం చేయూత అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ ప్రాజెక్టు ద్వారా కరవు పీడిత ప్రాంతాలైన ప్రకాశం, రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు సాగు, తాగునీరు అందుతుందని పేర్కొన్నారు. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక మంత్రికి చంద్రబాబు విజ్ఞప్తి చేసారు. దేశంలోని తూర్పు ప్రాంత రాష్ట్రాల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే పూర్వోదయ పథకం వికసిత్ భారత లక్ష్యాన్ని చేరుకునేందుకు, జాతీయ ఆర్థికవ్యవస్థకు చోదకశక్తిగా నిలుస్తుందని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల కనెక్టివిటీ, సాగునీటి పారుదల వ్యవస్థల ఆధునీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామిక కారిడార్లు, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల నిర్మాణం, విద్య వైద్య రంగాల సదుపాయాల కల్పనకోసం పూర్వోదయ పథకం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. >>2

## రాజమండ్రిలో మంత్రి లోకేష్

### ఆదికవి నన్నయ్య వర్శిటీ నూతన భవనాలు ప్రారంభం
### అనంతరం విద్యార్థులతో మంత్రి మాటామంతీ



శుక్రవారం రాజమహేంద్రవరంలో నన్నయ్య వర్సిటీలో ఆయన విగ్రహానికి పుష్పమాలవేసి ప్రణమిల్లుతున్న లోకేష్

**రాజమహేంద్రవరం, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ఆర్ట్స్ కాలేజీలో కార్యక్రమం అనంతరం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ రాజమండ్రిలోని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీని సందర్శించారు. వర్సిటీలో రూ.34కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను ప్రారంభించారు. ముందుగా వర్సిటీ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మంజీరా బ్లాక్ పేరుతో నూతనంగా నిర్మించిన ఎగ్జామినేషన్ బిల్డింగ్, గౌతమి బ్లాక్ పేరుతో నిర్మించిన కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇంద్రావతి బ్లాక్ పేరుతో నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ స్టడీస్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ వై.మేఘా స్వరూప్, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.ప్రసన్నశ్రీ, ఆదికవి నన్నయ్య వర్సిటీ ఆర్ట్స్ >>2

### క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టులకు
## ప్రోత్సాహకాలు
### ఏడు కంపెనీలకు అనుమతి
### ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ, డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ప్రాజెక్టులు ఏర్పాటు చేసే సంస్థలకు భారీ ప్రోత్సాహకాలను ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. క్వాంటమ్ కంప్యూటింగ్‌రంగానికి చెందిన కంపెనీలకు ఇచ్చే అనుమతులు, ప్రోత్సాహకాలను నిర్దేశిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల్లో భాగంగా మొత్తం 7 కంపెనీలకు అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. క్యూపీఏఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు కోసం అనుమతి లభించింది. ఇందుకోసం 2,500 చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. నోస్ట్రడామస్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు క్వాంటమ్ హార్డ్‌వేర్ సదుపాయాలను ఈ >>2



### బెట్టింగ్ యాప్ కేసు..
# ఇడి కొరడా
### సినీ ప్రముఖులు, మాజీ క్రికెటర్ల ఆస్తులు జప్తు

**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** అక్రమ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈకేసులో భాగంగా భారత మాజీ క్రికెటర్లు యువరాజ్‌సింగ్, రాబిన్ ఊతప్పతో పాటు ప్రముఖ నటుడు సోనూ సూద్, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి ఆస్తులను అటాచ్ చేసినట్లు శుక్రవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో నటి నేహాశర్మ, మోడల్ ఊర్వశీ రౌతేలా తల్లి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రాల ఆస్తులు కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఇడి తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జప్తు చేసిన ఆస్తుల్లో యువరాజ్ సింగ్‌కు చెందిన రూ.2.5 కోట్లు, సోనూ సూద్‌కు చెందిన రూ.1 కోటి, మిమీ చక్రవర్తికి చెందిన రూ.59 లక్షలు, నేహా శర్మకు చెందిన >>2

# పరకామణిలో ప్రక్షాళన

### మానవ ప్రమేయాన్ని తగ్గించండి
### ఎఐని విరివిగా వినియోగించండి
### భక్తుల మనోభావాలను దెబ్బతీయకండి
### 8వారాల్లోపు ముసాయిదా రూపొందించండి
### టిటిడి అధికారులకు హైకోర్టు ఆదేశం
### తదుపరి విచారణ 26కు వాయిదా





**విజయవాడ.డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కానుకల లెక్కింపుపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించాలని టీటీడీని ఆదేశించింది. ఏఐ, అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని సూచించింది. దొంగతనాలను అరికట్టేందుకు రెండు దశల్లో సంస్కరణలు చేపట్టాలని తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేసింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపులో భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కానుకలను వర్గీకరించడంతో పాటు విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐని ఉపయోగించాలని సూచించింది. విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని పేర్కొంది. దీనిపై 8 వారాల్లోపు ముసాయిదా రూపొందించి సమర్పించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

ఇప్పటికే తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన హుండీ కానుకల లెక్కింపు కేంద్రం పరకామణిలో దొంగతనం కేసు విచారణలో భాగంగా హైకోర్టు కీలక వ్యాఖ్యలు, సూచనలు చేసింది విరాళాల లెక్కింపులో అవకతకవలు అత్యంత తీవ్రమైనవిగా పేర్కొంది. ఇది కోట్ల మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా అభిప్రాయపడింది. పరకామణిలో జరిగిన నేరం దొంగతనం కంటే మించిందనే భావనను వ్యక్తం చేసింది. భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసే ఇలాంటి ఘటనలను ఎంత మాత్రం ఉపేక్షించలేమని స్పష్టం చేసింది. హైకోర్టులో ఈ కేసు విచారణలో భాగంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. సందర్భంగా హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురైతే కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మనుషుల ప్రమేయాన్ని తగ్గించి, యంత్రాలు, ఏఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో ఇలాంటి చోరీ ఘటనలు తరచూ జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు పాత విధానాన్ని అనుసరించడం సరి కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. విరాళాల లెక్కింపు,భద్రత, పర్యవేక్షణ వంటి >>2



## బంగ్లాదేశ్‌లో మళ్లీ అల్లర్లు

### ఓ హిందూపై దాడి, సజీవ దహనం
### రంగంలోకి సైన్యం, హింసకు తావులేదు: యూనస్ ప్రభుత్వం

9లో

### గోదావరి వాటర్ ప్రాజెక్టుకు
# నేడు శ్రీకారం

### రాష్ట్ర వ్యాప్తంగా 5 ఉమ్మడి జిల్లాల్లో 5ప్రాజెక్టులు
### అంచనా వ్యయం రూ.7,910 కోట్లు
### అమరజీవి జలధారగా నామకరణం
### పెరవలిలో శంకుస్థాపన చేయనున్న డి.సిఎం





**విజయవాడ, డిసెంబరు 19 ప్రభాతవార్త:** తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని దీక్షబూని ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును ప్రతి ఒక్కరూ నిత్యం తలచుకొనేలా చేస్తోంది కూటమి ప్రభుత్వం. గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాకు ఉద్దేశించిన జె.జె.ఎం.వాటర్ గ్రిడ్ పథకానికి అమరజీవి జలధార అని నామకరణం చేశారు. ప్రతి మనిషి జీవితంలో ఉరుకుల పరుగులన్నీ అన్నపానీయాల గురించే ఉంటాయి. నేను..నా కుటుంబం..వారికి మూడు పూటలా పట్టెడన్నం, స్వచ్ఛమైన నీరు అందించాలనే తపన ప్రతి మనిషికి ఉంటుంది. ఉండాలి. కానీ..నేను, నా కుటుంబం అనే దగ్గరే ఆగిపోకుండా..సమాజం, నా ప్రజలు, నా రాష్ట్రం, నా భాష అని గళమెత్తి, తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని చివరి శ్వాస వరకు పోరాడిన మహనీయులు శ్రీ పొట్టి శ్రీరాములు గారు పేరును ప్రతి ఒక్కరూ తలచుకొనేలా చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ నిర్ణయించారు. అన్నపానీయాలు మాని, 56 రోజులపాటు మండుతున్న కడుపు, ఎండిపోయిన డొక్కకు బంకమట్టి రాసుకుని పోరాడిన మహనీయుడు పొట్టిశ్రీరాములు. అలాంటి మహా మనిషి త్యాగానికి నివాళిగా అమరజీవి జలధార అని ఖరారు చేశారు.


**అమరజీవి జలధార పోస్టర్ విడుదల**

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన పనులకు శనివారం ఉదయం నిడదవోలు నియోజకవర్గం >>2

### ఫిబ్రవరి 23 నుంచి
## ఇంటర్ పరీక్షలు



**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్ టైమ్ టైబుల్ వచ్చేసింది. ఏపీ ఇంటర్మీడియట్ బోర్డు శుక్రవారం ఇంటర్ ఇగ్జామ్స్‌కి సంబంధించి షెడ్యూల్‌ను విడుదల చేసింది. 2026 ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చ్ 24వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పరీక్షలు జరగనున్నాయి. 2026 ఫిబ్రవరి 24వ తేదీ నుంచి మార్చ్ 23వ తేదీ వరకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు జరుగ నున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు. షెడ్యూలు విడుదల చేసింది. ఇక గతంలో విడుదల చేసిన పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేసింది ఇంటర్ బోర్డు. రెండు పరీక్షల తేదీలను మార్చింది. మ్యాథ్స్ పేపర్2ఏ, సివిక్స్ పేపర్2ను మార్చి 4న నిర్వహి స్తామని ప్రకటించింది. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్ 1,లాజిక్ పేపర్ 1 మార్చి 21న ఉంటా యని వెల్లడించింది.



### అల్జీమర్, కేన్సర్ చికిత్సలో
## కొత్త ఆవిష్కరణ
### భారత శాస్త్రవేత్తల ఘనత

**బెంగళూరు, డిసెంబరు 19:** అల్జీమర్స్, పార్కిన్సన్స్, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సలో సరికొత్త ఆవిష్కరణకు భారత శాస్త్రవేత్తలు మార్గం సుగమం చేశారు. కణాలు తమను తాము శుభ్రం చేసుకునే ఆటోఫేజీ అనే కీలక ప్రక్రియలో ఇప్పటివరకు తెలియని ఒక కొత్త అంశాన్ని గుర్తించారు. బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (జెఎన్‌సిఎఎస్ఆర్) పరిశోధకులు ఈ ఘనత సాధించారు. శరీరంలోని కణాలు దెబ్బ తిన్న భాగాలను, అనవసర వ్యర్థాలను తొలగించుకునే సహజ ప్రక్రియనే >>2

# శ్రీశైలంలో సిఇసి జ్ఞానేష్





శుక్రవారం శ్రీశైలంలో మీడియా సమావేశంలో సిఇసి జ్ఞానేష్ కుమార్

**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబరు19,ప్రభాతవార్త:** శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామివారి దర్శనం చేసుకోవడం తనకు తన కుటుంబానికి లభించిన గొప్ప అదృష్టమని భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అన్నారు. శుక్రవారంనాడు సతి సమేతంగా దర్శనం అనంతరం భ్రమరాంబ అతిథి గృహంలో పాత్రికేయుల సమావేశంలో మాటా_డారు. ముందుగా అతిథి గృహం వద్ద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, జిల్లా ఎస్పి సునీల్ షెరాన్, జెసి కొల్లాబత్తుల కారీ_క్, శ్రీశైలదేవస్థానం ఇఓ ఎం.శ్రీనివాసరావు తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తదుపరి జ్ఞానేష్‌కుమార్ మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానంలో శివశక్తుల దర్శనం తనకు, తన కుటుంబానికి మరపురాని అనుభూతిగా నిలుస్తుందని పేర్కన్నారు.




స్పీకర్ ఓంబిర్లా ఇచ్చిన తేనేటి విందులో ప్రధాని మోడీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్, వయనాడ్ ఎంపి ప్రియాంక

## మోడీ-ప్రియాంక ముచ్చట్లు

9లో

### వనమూలికలతో అలర్జీ సమస్యలు తగ్గాయి
### విబిజి రామ్‌జి బిల్లు ఆమోదం తీరు అభ్యంతరకరం
### ప్రధాని మోడీతో వయనాడ్ ఎంపీ మాటామంతీ



క్వాంటం వ్యాలీలో సంస్థలు (నమూనా చిత్రం)

# ప్రోత్సాహకాలు

>> సంస్థ కల్పిస్తుంది. ఈ సంస్థకు ఏపీఐఐసీ ద్వారా ఏకంగా 5 ఎకరాల భూమిని కేటాయించారు. అది కూడా మార్కెట్ ధరపై 70 శాతం భారీ రాయితీతో ఇవ్వనున్నారు. అలాగే క్యూబిటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు కూడా ఏపీఐఐసీ ద్వారా 2.5 ఎకరాల భూమిని కేటాయించారు. వీరికి కూడా మార్కెట్ ధరలో 70 శాతం రాయితీ వర్తిస్తుంది. ఫార్టీటూ (42) టెక్నాలజీ ఇన్నోవేషన్స్ సంస్థ ఏర్పాటు చేసే ప్రాజెక్టుకు క్వాంటమ్ పాలసీ కింద ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ఓకే చెప్పారు. సంస్థ నిర్వహించే టెస్ట్ బెడ్‌ల కోసం 2 వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించారు. సెంటెల్లా సైంటిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు క్వాంటమ్ పాలసీ కింద అర్హత ఉన్న అన్ని ప్రోత్సాహకాలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

**క్యూక్లేవోయెన్స్ క్వాంటమ్ ల్యాబ్స్:** సంస్థ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రాథమిక అనుమతులు మంజూరు చేశారు. చివరిగా ఏక్యూవీలో సైబ్రానెక్స్ టెక్నాలజీస్ అండ్ కన్సల్టెన్సీ సంస్థ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. అయితే, ఈ సంస్థకు ఇచ్చే ప్రోత్సాహకాల విషయంలో ఐటీ శాఖకు ఒక మెలిక పెట్టారు. నేషనల్ క్వాంటమ్ మిషన్ ఇచ్చే గ్రాంట్‌తో పోల్చి చూసి, దానికి అనుగుణంగా సిఫార్సు చేయాలని ఐటీ శాఖను ప్రభుత్వం ఆదేశించింది.ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలకు ప్రతిఫలంగా ఆయా కంపెనీల్లో ప్రభుత్వానికి వాటా దక్కేలా కొత్త విధానాన్ని తెచ్చారు.రతన్ టాటా ఇన్నోవేషన్ హబ ఈ మొత్తం వ్యవహారంలో కీలక పాత్ర పోషించనుంది. ప్రభుత్వం ప్రోత్సాహకాలు చెల్లించే రోజున, సదరు సంస్థ విలువ ఎంత ఉందో లెక్కగడతారు. ఆ విలువ ఆధారంగా, రాష్ట్ర క్వాంటమ్ మిషన్‌కు ఆయా కంపెనీల్లో ఈక్విటీ (వాటా) కేటాయించాలి. అంటే పరోక్షంగా ప్రభుత్వమే ఆయా కంపెనీల్లో పెట్టుబడిదారుగా మారుతుందన్నమాట. క్వాంటమ్ ఎకోసిస్టమ్ అభివృద్ధి కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, ఖిహబ్ అండ్ స్పోక్స్ ఖి నమూనాలో పని చేస్తుంది. క్వాంటమ్ స్టార్టప్‌లకు అవసరమైన సలహాలు, మార్గదర్శకత్వం, నిధులు సమకూర్చడంలో ఈ హబ్ కీలకంగా వ్యవహరిస్తుంది. ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీ కింద కంపెనీలను ఆకర్షించేందుకు ప్రభుత్వం భారీ ఆఫర్లను ప్రకటించింది. సంస్థలు పెట్టే మూలధన పెట్టుబడిలో గరిష్ఠంగా 75 శాతానికి మించకుండా ప్రోత్సాహకాలు ఇస్తారు. ఇది స్టార్టప్‌లకు, కొత్తగా వచ్చే కంపెనీలకు పెద్ద ప్రోత్సాహంగా ఉంది.ఉద్యోగాల కల్పనే ప్రధాన ఎజెండాగా ఈ పాలసీని రూపొందించారు. సంస్థ కల్పించే ఒక్కో ఉద్యోగానికి 100 చదరపు అడుగుల చొప్పున ఆఫీస్ స్పేస్‌ను ప్రభుత్వమే కేటాయిస్తుంది.

# ప్రజాసేవలోనే ఉండండి

## శాంతిభద్రతలపై దృష్టి సారించాలి

## కూటమి నేతలతో సమన్వయం చేసుకోవాలి

## జనసేన ఎమ్మెల్యేలతో డి.సిఎం పవన్

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజల సమస్యల పరిష్కారం విషయంలో శాసన సభ్యులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశించారు.ప్రజలు తమ పరిధిలో ఎదురవుతున్న ఇబ్బందులు.తమ గ్రామాలు, పట్టణాల అవసరతల కోసం వచ్చినప్పుడు వారికి మాటలు చెప్పి పంపడం సరికాదన్నారు.ఏవ్వరి సమస్యనైనా వెంటనే పరిష్కరించాలన్నారు.ఎంఎల్‌ఎలు తమ పరిధిలో నియోజకవర్గ గ్రామాలపై అవగాహనతో పాటు,ఎప్పటికప్పుడు వారికి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసే దిశలో ఉండాలన్నారు.అధికార యంత్రాంగంపై పట్టు ఉండాలన్నారు.శాంతి భద్రతలపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు.కూటమి పక్షాల నేతలు,కార్యకర్తలతో మంచి సంబంధాలు ఉండాలన్నారు.వారి ఇబ్బందులను తెలుసుకోవాలన్నారు.జనసేన ప్రతినిధులంటే స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. మంగళవారం పార్టీ ఎమ్మెల్యేలతో వన్ టూవన్ సమావేశాలు నిర్వహిస్తున్నారు ఇప్పటివరకూ నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, ఆన్ గోయింగ్ ప్రాజెక్ట్స్ వివరాలు, నియోజక వర్గంలో ఉన్న సమస్యలతోపాటు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చర్చిస్తున్నారు. ఈ రోజు తొమ్మిది మంది ఎమ్మెల్యేలతో సమావేశం అయ్యారు.,మండలి బుద్ధ ప్రసాద్ తో వన్ టూ వన్ సమావేశం ప్రారంభించారు. దేవ వరప్రసాద్, లోకం నాగ మాధవి, గిడ్డి సత్యనారాయణ, పంతం నానాజీ, సిహెచ్ వంశీ కృష్ణ, నిమ్మక జయకృష్ణ, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు విజయ్ కుమార్ లతో వన్ టూ వన్ సమావేశం ఉంటుంది.

# నేడు శ్రీకారం

>> పెరవలి గ్రామంలో పవన్ కళ్యాణ్ శంకుస్థాపన చేయనున్నారు. అమరజీవి జలధార్త పోస్టర్‌ను ఉప ముఖ్యమంత్రి శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు.

**ప్రాజెక్ట్ వివరాలు :** రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5 ఉమ్మడి జిల్లాల పరిధిలో ఐదు ప్రాజెక్టులు చేపడుతున్నారు.ఉమ్మడి ప్రకాశం, చిత్తూరు, పల్నాడు, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి. **మొత్తం ప్రాజెక్టు విలువ :** రూ. 7,910 కోట్లు, వచ్చే 30 ఏళ్లలో 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చడం లక్ష్యం. ఇప్పటికే ప్రకాశం జిల్లాకు సంబంధించిన పనులకు మార్కాపురంలో శంకుస్థాపన చేశారు.

**రేపటి శంకుస్థాపన వివరాలు :** పశ్చిమ గోదావరి జిల్లా, తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో రెండు ప్రాజెక్టులు. 23 నియోజకవర్గాల పరిది లో 68 లక్షల మంది దాహార్తి తీర్చనుంది.రెండు ప్రాజెక్టుల మొత్తం విలువ రూ. 3,050 కోట్లు, **ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా :** రూ. 1400కోట్లు, **ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా :** రూ.1,650 కోట్లు.

# పరకామణిలో ప్రక్షాళన

>> అంశాల్లో ఏఐ ఆధారిత వ్యవస్థలను అమలు చేస్తే మానవ తప్పిదాలు, అక్రమాలకు తావు ఉండదని న్యాయస్థానం సూచించింది. లెక్కింపు సమయంలో ప్రత్యేక టేబుళ్లను ఏర్పాటు చేయాలని స్పష్టమైన విధి విధానాలు ఉండాలని ఆదేశించింది. విరాళాల లెక్కింపులో భక్తులను ఎందుకు భాగస్వాములను చేయకూడదని ప్రశ్నించింది. భక్తుల సమక్షంలో లెక్కింపు జరిగితే పారదర్శకత పెరుగుతుందని నమ్మకం మరింత బలపడుతుందని అభిప్రాయపడింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు విజిలెన్స్ వ్యవస్థను పూర్తిగా ఆధునికీకరించాలని సూచించింది. తప్పు జరిగిన వెంటనే అప్రమత్తమయ్యే స్మార్ట్ విజిలెన్స్ టెక్నాలజీ వంటివి తీసుకురావాలని రియల్ టైం మానిటరింగ్ వ్యవస్థ అమలు చేయాలని సూచనలు చేసింది. కానుకల లెక్కింపునకు సేవాభావంతో వచ్చిన భక్తులను సోదాలు చేయడం, దొంగల్లా అవమానించడం తగదని పేర్కొంది. కానుకలు లెక్కింపునకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇకఏప్రిల్ 2023లో టీటీడీకి చెందిన ఒక మఠం ఉద్యోగి సి.వి. రవికుమార్ పరకామణి హాల్‌లో సుమారు 900 అమెరికన్ డాలర్లను దొంగిలిస్తూ విజిలెన్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఈ దొంగతనం కేసులో విచారణ జరపకుండానే, నిందితుడు రవికుమార్ తిరుపతి చెన్నైలోని తనకున్న 7 ఆస్తులను టీటీడీకి విరాళంగా ఇచ్చేలా సెప్టెంబర్ 2023లో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదిర్చారు. ఈ రాజీ వెనుక ఉన్న అక్రమాలపై ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు సీఐడీ, ఏసీబీ దర్యాప్తు చేపట్టాయి. రెండు సంస్థలకు కేసు నమోదు చేసి, పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారుడైన మాజీ ఏవీఎస్ఓ వై. సతీష్ కుమార్ గత నెల 13వ తేదీన అనంతపురం జిల్లాలో రైల్వే ట్రాక్‌పై మరణించి కనిపించారు. ఇది ఆత్మహత్యగా భావించినప్పటికీ, దీనిపై హైకోర్టు సమగ్ర విచారణకు ఆదేశించింది. పోస్టుమార్టం నివేదికను సమర్పించాలని కోరింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ అధికారులు టీటీడీ మాజీ ఛైర్మన్లు వై.వి. సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డిలను ప్రశ్నించారు. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

# బెట్టింగ్ యాప్ కేసు.. ఇడి కొరడా

>> రూ.1.26 కోట్లు, రాబిన్ ఊతప్పకు చెందిన రూ.8.26 లక్షలు, ఊర్వశీ రౌతేలా తల్లికి చెందిన రూ.2.02 కోట్ల ఆస్తులు ఉన్నాయి. విదేశాల్లో రిజిస్టర్ అయిన 1ఎక్స్‌బెట్ అనే అక్రమ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.1000 కోట్లకు పైగా మనీలాండరింగ్ జరిగినట్లు ఇడి గుర్తించింది. ఈ కేసులో గతంలోనే ఈ సెలబ్రిటీలందరినీ ఇడి విచారించింది. వారి ఆస్తులను అక్రమ సంపాదనగా (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్) పరిగణించి తాజా చర్యలు తీసుకుంది. ఇదే కేసులో గతంలో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాలకు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఇడి అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈసొమ్ములన్నీ కూడా విదేశీ డొల్లకంపెనీల మార్గంలో వీరికి అందినట్లు తేలింది. కేవలం అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలద్వారా చేకూరిన సొమ్మునుంచే వీరికి లబ్దిజరిగిందని ఈడీ నిర్ధారించింది.

# కేన్సర్ చికిత్సలో కొత్త ఆవిష్కరణ

>> ఆటోఫేజీ అంటారు. ఈ ప్రక్రియ సరిగ్గా జరగనప్పుడు కణాల్లో వ్యర్థాలు పేరుకుపోయి అల్జీమర్స్, హంటింగ్టన్స్ వంటి నాడీ సంబంధిత వ్యాధులు వస్తాయి. ముఖ్యంగా ఎక్కువ కాలం జీవించే నాడీ కణాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. క్యాన్సర్ విషయంలో ఆటోఫేజీ రెండు రకాలుగా పనిచేస్తుంది. వ్యాధి ప్రారంభదశలో కణాల్లోని వ్యర్థాలను తొలగించి క్యాన్సర్ రాకుండా అడ్డుకుంటుంది. అయితే, క్యాన్సర్ కణాలు పెరిగాక, అవే ఈ ప్రక్రియను తమ మనుగడ కోసం వాడుకుంటాయి. అందుకే ఈ ప్రక్రియను నియంత్రించడంపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. జేఎన్‌సీఏఎస్ఆర్ ప్రొఫెసర్ రవి మంజితియా నేతృత్వంలోని బృందం, కణాల్లోని అణువులను ఉపరితలానికి చేరవేస్తాయని భావించే ఎక్సోసిస్ట్ కాంప్లెక్స్ అనే ప్రోటీన్ల బృందానికి ఆటోఫేజీలో కూడా ముఖ్యపాత్ర ఉందని గుర్తించారు. ఈ బృందంలోని 8 ప్రోటీన్లలో 7 కలిసి, కణాల్లోని చెత్తను చుట్టివేయడానికి అవసరమైన ఆటోఫాగోజోములు తయారీకి సహాయపడతాయని గుర్తించారు. ఈ ప్రోటీన్లు లోపిస్తే, ఆటోఫేజీ ప్రక్రియ ఆగిపోతుందని తేల్చారు. ఈస్ట్ కణాలపై జరిపిన ఈ పరిశోధన ఫలితాలు వైద్య రంగంలో కొత్త చికిత్సల అభివృద్ధికి దోహదపడతాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలు ప్రఖ్యాత ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో ప్రచురించారు.

# రాజమండ్రిలో మంత్రి లోకేష్

>> అండ్ కామర్స్ విభాగం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.జ్యోతిర్మయి, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయ నిర్మల, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఇంజనీరింగ్ విభాగం ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగం ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

**ఆర్ట్స్ కాలేజీలో పలు నూతన భవనాలు ప్రారంభం:** మంత్రి నారా లోకేష్ రాజమహేంద్రవరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కాలేజీలో వివిధ విభాగాలకు సంబంధించి నూతనంగా నిర్మించిన పలు భవనాలను లాంఛనంగా ప్రారంభించారు. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజ్ మెయిన్ గేట్ వద్ద కాలేజీ లోగోను ఆవిష్కరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. హైగ్లో ల్యాబ్ ఆన్ వీల్స్ సైన్స్ ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. విద్యార్థులతో సంభాషించారు. అనంతరం ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ హబ్‌ను ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పలు ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాల్ ఆఫ్ ఫేమ్‌లో సంతకం చేశారు. అనంతరం కాలేజీలో వందేమాతరం మూవ్ మెంట్ మెమోరియల్‌ను మంత్రి ఆవిష్కరించారు. వందేమాతరం ఉద్యమానికి ప్రతీకగా సైన్స్ బ్లాక్ వద్ద వందేమాతరం పార్క్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఉద్యమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ పాత్రను విద్యార్థులు వివరించారు. విదేశీ విద్యార్థుల పరిశోధనల కోసం నూతనంగా నిర్మించిన సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. సీవీ రామన్ ఇంటర్నేషనల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ తో ఇంటరాక్ట్ అయ్యారు. అరకు కాఫీ కేఫ్‌ను సందర్శించారు. అనంతరం జాతీయ, రాష్ట్ర స్థాయిలో వివిధ క్రీడల్లో రాణించిన కళాశాల విద్యార్థులను అభినందించారు. అనంతరం కాలేజీ లైబ్రరీని సందర్శించారు. రేర్ బుక్స్‌ను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా "సమ్ మెడిటేషన్స్ ఆఫ్ మార్కుస్ అర్లియస్ ఆంటోనినస్ ప్రజెంటేషన్' పుస్తకాన్ని మంత్రి లోకేష్ కు బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి గవర్నమెంట్ కాలేజీ (అటానమస్) ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్ గుప్తా, జేసీ వై.మేఘా స్వరూప్, రాజమండ్రి ఆర్టీఐహెచ్ నోడల్ ఆఫీసర్ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నిర్మలతో సమావేశమైన సిఎం చంద్రబాబు, మంత్రి పయ్యావుల

# నల్లమల్ల సాగర్‌కు సహకరించండి

>> తద్వారా ఆయా గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన ఆర్థిక అవకాశాలను అందిస్తుందని స్పష్టం చేసారు. విద్య, నైపుణ్యాకల్పన, వ్యవసాయం, ఎంఎస్ఎంఈ, హౌసింగ్, రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల లాంటి కీలకమైన రంగాల్లో పూర్వోదయ నిధులు అందించి ఏపీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ పథకం కింద ప్రాధాన్యతా క్రమంలో చేపట్టే ప్రాజెక్టులకు పాలనాపరమైన నిబంధనల్ని సరళీకృతం చేయాలని, రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా వీటిని వినియోగించుకునేలా వెసులుబాటు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు.

**సాస్కీతో ఎపికి చేయూత..** సాస్కీ కింద మంజూరైన వివిధ ప్రాజెక్టులను సత్వరం చేపట్టాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞాపన లేఖలో పేర్కొన్నారు. విశాఖలో యూనిటీ మాల్ నిర్మాణం, అఖండ గోదావరి కింద చేపట్టిన హావ్ లాక్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు, గండికోట పర్యాటక ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో మూడు వర్కింగ్ విమెన్ హాస్టళ్ల నిర్మాణాల పూర్తికి నిధులివ్వాలన్నారు. సాస్కీకింద రెండో విడత నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న ఆంధ్రప్రదేశ్ లాంటి రాష్ట్రంలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి సాస్కీ పథకం కింద నిధులు కీలమని పేర్కొన్నారు. వీటితో పాటు సాగునీటి ప్రాజెక్టులు, రాష్ట్ర, జిల్లా రహదారుల నిర్మాణం, ఎంఎస్ఎంఈ పార్కులు, హౌసింగ్, వైద్యారోగ్య మౌలిక సదుపాయాల కల్పనకు అదనపు నిధులు మంజూరు చేయాలన్నారు. 2025- 26 ఆర్థిక సంవత్సరంలో ఈ పనులకు గానూ రూ.10,054 కోట్లు సాస్కీ కింద మంజూరు చేయాలని కోరారు. రాయలసీమకు హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్యాకేజీకి ఆర్థిక సాయం అందించాలని కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమ జిల్లాల్లో ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉన్న 18 పంటలను సాగు చేస్తున్నట్టు వివరించారు. ఈ ప్రాంతంలోని ఎనిమిది జిల్లాల్లో విస్తరించిన 93 ఉద్యానవన క్లస్టర్లు ప్రత్యక్షంగా పరోక్షంగా 33.7 లక్షల మంది రైతులకు ప్రయోజనం కల్పిస్తాయని స్పష్టంచేసారు. ఎగుమతులు చేసేందుకు వీలుగా ఉద్యాన ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఈ ప్రాంతంలో పండుతున్నాయని సిఎం తెలిపారు. ప్రస్తుతం ఉన్న 8.48 లక్షల హెక్టార్ల హార్టికల్చర్ సాగును 2029 నాటికి 12.28 లక్షల హెక్టార్లకు విస్తరించాలని నిర్ణయించినట్టు సీఎం పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో నీటి వనరులను మెరుగుపర్చటంతో పాటు ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతికి వీలుగా రోడ్డు, రైలు, ఓడరేవులు, ఎయిర్ కార్గో సహా లాజిస్టిక్స్ పార్కుల లాంటి సౌకర్యాలు కల్పించాల్సి ఉందని స్పష్టం చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు వచ్చే మూడేళ్లలో రూ.41 వేల కోట్ల ఆర్థిక సహకారం అవసరమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర 2047 విజన్‌లకు అనుగుణంగా రైతుల వార్షికాదాయం రూ.2 లక్షల నుంచి 3.5 లక్షలకు పెరుగుతుందని స్పష్టం చేసారు. ఈ సానుకూల అంశాలను దృష్టిలో ఉంచుకుని 2026-27 కేంద్ర బడ్జెట్‌లో రాయలసీమ హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్యాకేజీని ప్రకటించాలని కేంద్ర ఆర్థిక మంత్రిని సీఎం చంద్రబాబు కోరారు.

# అమిత్‌షాతో చంద్రబాబు భేటీ



**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** చంద్రబాబు పరిపాలనలో ఏపీ సమగ్రాభివృద్ధి సాధిస్తుందని,ఇందుకు కేంద్ర సహకారం ఉంటుందని కేంద్ర మంత్రి అమిత్‌షా స్పష్టం చేసారు రాష్ట్రాన్ని సాంకేతికంగా సీఎం ముందుకు తీసుకుని వెళ్ళడం హర్షదాయకమన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు న్యూఢిల్లీ పర్యటన బిజీ బిజీగా సాగుతోంది. శుక్రవారం రాత్రి కేంద్రం హోం శాఖ మంత్రి అమిత్ షాతో సీఎం చంద్రబాబు బేటీ అయ్యారు. తాజ్ ప్యాలెస్ హోటల్‌లో అమిత్ షాతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పురోగతిని ఈ సందర్భంగా అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించారు. ఇటీవల విశాఖపట్నం వేదికగా నిర్వహించిన పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు పెద్ద ఎత్తున సానుకూల స్పందన వచ్చిందని అమిత్ షాకు సీఎం వివరించారు. అలాగే రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై సైతం వీరు ప్రస్తావించినట్లు సమాచారం. అనంతరం క్రెడాయ్ నేషనల్ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు.

# గడ్కరీతో ముఖ్యమంత్రి సమావేశం

**విజయవాడ,డిసెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరాతి నగరాన్ని దేశంలోని వేర్వేరు నగరాలతో అనుసంధానించేలా జాతీయ రహదారుల నెట్వర్క్ ను కలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.జాతీయ రహదారి నెట్వర్క్ ను బలోపేతం చేయటంలో నితిన్ గడ్కరీ కృషిని కొనియాడిన ముఖ్యమంత్రి చంద్రబాబు. వివిధ ప్రాంతాల కనెక్టివిటీతో పాటు ఆర్థిక ప్రగతికి సూచికగా జాతీయ రహదారులు నిలిచాయని పేర్కొన్న ముఖ్యమంత్రిజగ్రీన్ ఫీల్డ్ నగరంగా అభివృద్ధి అవుతున్న అమరావతిని జాతీయ రహదారులతో ప్రత్యక్ష, పరోక్ష నెట్వర్క్ ఏర్పాటు చేయాలని కోరిన సీఎం.కృష్ణానదిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 6 లేన్ల ఐకానిక్ వంతెన నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని కోరిన సీఎం.6 లేన్ల ఐకానిక్ కేబుల్ స్టేడ్ వంతెన మూలపాడు వద్ద మూడు కీలకమైన జాతీయ రహదారులతో అమరావతిని అనుసంధాని




స్తుందని తెలిపిన సీఎం.విజయవాడ హైదరాబాద్, చెన్నై కోల్ కతా సహా తీరప్రాంత రోడ్ కారిడార్ తో అమరావతిని ఈ వంతెన అనుసంధానిస్తుందన్న ముఖ్యమంత్రి.హైదరాబాద్ నుంచి అమరావతి వరకూ ప్రతిపాదిత గ్రీన్ ఫీల్డ్ హైవే హైస్పీడ్ యాక్సెస్ కలిగిస్తుందన్న ముఖ్యమంత్రి.నగరాల మధ్య కనెక్టివిటీతో పాటు ప్రజలకు ప్రయాణ సమయాన్ని కూడా గణనీయంగా తగ్గిస్తుందని స్పష్టం చేసిన సీఎం.అమరావతిని జాతీయ రహదారి గ్రిడ్‌లో మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మారుస్తుందని వెల్లడి. ఒక ప్రధాన నదిపై నిర్మించే ఈ 6 లేన్ ఐకానిక్ బ్రిడ్జిని జాతీయ రహదారుల సంస్థ చేపట్టేలా చూడాలని కేంద్ర మంత్రిని కోరిన ముఖ్యమంత్రి.ఆంధ్రప్రదేశ్ రాజధానికి కీలకమైన ప్రాజెక్టుగా 6 లేన్ల ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణానికి పూర్తి సహకారం అందించాలని కేంద్ర మంత్రి గడ్కరీకి విజ్ఞప్తి సీఎం చంద్రబాబు చేసారు.

## వారం - వర్జ్యం

20-12-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం
హేమంత ఋతువు, శుక్లపక్షం
అమావాస్య ఉ.7.13
మూల రా.1.21, మూల కార్తె
వర్జ్యం : మ.12.21-2.07
దు.ఉ.8.45-9.31,
మ.12.28-1.13
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ సభ్యులతో దేవాలయ దర్శన భాగ్యమునకు అస్కారము ఉన్నది. మిత్రుల కలయిక.స్వల్ప ధనలాభం పొందుతారు.

**వృషభం:** చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. మిత్రుల కలయిక.

**మిథునం:** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు.గృహనిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం:** నూతన పరిశ్రమలు వ్యాపారాలు ప్రారంభిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. వస్త్రలాభం.

**సింహం:** ఎంత సాధించినా ఇంకా సాధించాలనే ధోరణి అప్రశాంతతకు గురి చేస్తుంది. కొన్ని అవకాశాలు అప్రయత్నంగా కలిసివస్తాయి.

**కన్య :** భూముల విషయంలో నెలకొన్న వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. నూతన ఒప్పందాలలో జాగ్రత్తలు పాటించండి.

**తుల :** జీవిత భాగస్వామి సహాయం అందుకుంటారు. సన్నిహితుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు.

**వృశ్చికం:** చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు. గృహనిర్మాణ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కళలు, రాజకీయ రంగాల వారికి పదువులు లభిస్తాయి.

**మకరం:** నూతన పెట్టుబడులతో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం చెప్పదగిన సూచన. ప్రయాణాలు.

**కుంభం:** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు లభిస్తాయి. వస్త్రలాభం.

**మీనం:** వాక్చాతుర్యంతో ఎదుటివారిని ఆకట్టుకొని పనులు పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం పొందుతారు.ఇంటా బయటా అనుకూలం.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆల్మట్టి ఎత్తు పెంచనివ్వొద్దు

## కర్ణాటక ప్రభుత్వ చర్యలను అడ్డుకోండి

## పోలవరం-నల్లమల సాగర్‌కు అనుమతిలివ్వండి

## జల్‌జీవన్‌మిషన్‌కింద ఎపికి రూ.1000కోట్లు అదనంగా ఇవ్వండి

## పిఎంకెఎస్‌వై ఆర్‌ఆర్‌ఆర్ స్కీంకు తక్షణం నిధులు విడుదల చేయండి

## కేంద్ర జల్ శక్తిమంత్రి సీ.ఆర్.పాటిల్‌కు సిఎం చంద్రబాబు వినతి

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించి అనేక పెండింగ్ సాగునీటి పథకాలు, నూతన స్కిములు ప్రతిపాదనపై కీలకంగా చర్చించారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా పాటిల్‌ను కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలన్నారు, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు.ఆంధ్రప్రదేశ్‌కు నీటి భద్రత అత్యంత కీలక అంశమన్నారు. రాష్ట్రంలో సాగునీటితాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రాజెక్టులపై కేంద్ర-రాష్ట్ర సమన్వయం మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం కలిగించేలా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తును పెంచాలని భావిస్తోందని, దీనికి సంబంధించి భూసేకరణకు కూడా సిద్ధమైందని సీఎం అన్నారు.

ఈ విషయంలో కేంద్రం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని సీఎం కేంద్రమంత్రిని కోరారు.అయితే ఈ వివాదం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున కర్నాటక ప్రభుత్వం దీనిపై ముందుకు వెళ్లకుండా కేంద్ర ప్రభుత్వం నిలువరించాలని పాటిల్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.

జల్ జీవన్ మిషం2025-26 ఆర్థిక సంవత్సరానికి అమలు కోసం రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి పాటిల్‌కు విన్నవించారు.జల్ జీవన్ మిషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని, దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని సీఎం కోరారు. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎంకెఎస్‌వై ఆర్ఆర్ఆర్)పథకం కింద చెరువులు, కాలువల పునరుద్ధరణకు రాష్ట్రం ప్రతిపాదనలు సిద్ధం చేసిందని పాటిల్ దృష్టికి సీఎం తీసుకువచ్చారు. ఈ పథకానికి సంబంధించి కేంద్రం వాటా నిధులు వెంటనే విడుదల చేస్తే గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సామర్థ్యం గణనీయంగా పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఈ పథకం పరిధిలో తాము ప్రతిపాదనలు చేసామ న్నారు.వీటిని ఆమోదించడంపాటు నిధులు విడుదల చేయాల న్నారు. అందుకు కేంద్ర మంత్రి పాటిల్ సుముఖతను వ్యక్తం చేసారు.

**పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు సంబంధించి పెండింగ్ అంశాలకు అనుమతులు ఇవ్వండి:** పోలవరం జాతీయ ప్రాజెక్టులో వివిధ పనులకు సంబంధించి పెండింగులో ఉన్న అనుమతులు వెంటనే వచ్చేలా చూడాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.రెండో దశ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులపై త్వరలోనే పూర్తి నివేదిక కేంద్రానికి సమర్పిస్తామని చెప్పారు.వంశధార నది వివాద ట్రిబ్యునల్ వివాదం పరిష్కరించాలన్నారు,వంశధార నది వివాదానికి సంబంధించి ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుల అమలు ఇంకా పూర్తిగా జరగడం లేదని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. నేరడి బ్యారేజ్ నిర్మాణం శ్రీకాకుళం జిల్లాలోని కరువు ప్రాంతాల నీటి అవసరాలకు అత్యవసరమని తెలిపారు. దీనికి అనుమతులు మంజూరు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ హక్కులకు భంగం కలగకుండా, ట్రిబ్యునల్ నిర్ణయాల అమలుకు కేంద్రం స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరారు. ఈ అంశంపై తక్షణమే కేంద్ర జోక్యం చేసుకోవాలన్నారు.



శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి సిఆర్‌పాటిల్‌తో సిఎం సమావేశం

20-12Pg3exHMNWJQEKCRTL 3 O_20-12Pg3exHMNWJQEKCRTL.qxd 19/Dec/25 11:49 PM Page 1





కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,కేంద్రమంత్రులు రామ్మోహననాయుడు.పెమ్మసాని చంద్రశేఖర్

# దుగరాజపట్నాన్ని నేషనల్ మెగా షిప్ బిల్డింగ్ క్లస్టర్‌గా ఆమోదించండి

**ఏపిలో నౌకాశ్రయాలు, నౌకానిర్మాణ రంగ అభివృద్ధికి సహకరించండి**

**కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌కు సీఎం వినతి**

**విజయవాడ డిసెంబర్ 19, ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర సాయంపై సోనోవాల్‌తో చర్చించిన సీఎం చంద్రబాబుదేశంలో నౌకాశ్రయాలు, నౌకా నిర్మాణ రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు కృతజ్ఞతలు సీఎం చంద్రబాబు తెలిపారుచిప్ టు షిప్" విజన్‌కు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాలని వినతి. దుగరాజపట్నంలో నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్, షిప్ రిపేర్ క్లస్టర్ అభివృద్ధికి సహకరిం చాలి సీఎం చంద్రబ ాబు అభ్యర్థించారు. దుగ రాజపట్నంలో నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్ షిప్ రిపేర్ క్లస్టర్ ఏర్పాటు కోసం పూర్తి సన్నద్ధంగా ఉన్నాం. ఈ ప్రాజెక్టు కోసం 3,488 ఎకరాల భూమి సమకూర్చేందుకు అంగీకారంప్రాజెక్టుకు సంబంధించిన టెక్నో- ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్ట్ ( టీ ఈ ఎఫ్ ఆర్) సిద్ధమైంది.నౌక నిర్మాణానికి అనుబంధ ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, కామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో సమగ్ర క్లస్టర్‌గా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లో పేర్కొన్న అంశాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యత.దుగరాజపట్నాన్ని నేషనల్ మెగా షిప్‌బిల్డింగ్ క్లస్టర్‌గా త్వరితగతిన ఆమోదించాలని కేంద్రాన్ని కోరిన సీఎం.ఫిషింగ్ హార్బర్లకు కేంద్రం సాయం చేయాలి ఫేజ్-1లో చేపట్టిన నాలుగు ఫిషింగ్ హార్బర్లకు అదనపు నిధులు కేటాయించాలని కోరిన ముఖ్యమంత్రిమత్స్య కారుల జీవనోపాధి మెరుగుదల కోసం ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టామన్న సీఎం ఫేజ్-1లో జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లను రూ.1361.49 కోట్లతో చేపట్టామని వివరించిన ముఖ్యమంత్రి జువ్వలదిన్నె హార్బర్‌కు మాత్రమే కేంద్రం నుంచి రూ.138.29 కోట్లు మంజూరు అయ్యాయని వెల్లడి.ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.782.29 కోట్లు ఖర్చు చేసిందని వివరించిన సీఎం.మిగిలిన మూడు హార్బర్లకు కేంద్ర సాయం ఇంకా అందలేదు. ఫేజ్-1 పూర్తి కోసం ఇంకా రూ.440.91 కోట్లు అవసరం ఉంది.

ప్రకాశం జిల్లా ఓడరేవు ఫిషింగ్ హార్బర్ నిర్మాణానికి సాగరమాల పథకం కింద రూ.150 కోట్లు మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి. మొత్తం మీద రూ.590.91 కోట్లు కేంద్రం నుంచి సహాయంగా అందాల్సి ఉందని సీఎం చంద్రబాబు తెలియజేసారు.



నితిన్ నబీన్‌కు సిఎం చంద్రబాబు అభినందనలు

## బిజెపి జాతీయ నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో సిఎం చంద్రబాబు భేటీ

**విజయవాడ 19,ప్రభాతవార్త ప్రతినిధి:** బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో ఏపీ సీఎం చంద్రబాబు ఢిల్లీలో భేటీ అయ్యారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన నాయకత్వంలో బీజేపీ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ భేటీ అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం శరవేగంగా పురోగమిస్తోంది. ఈ ప్రయాణంలో మేమంతా కలిసికట్టుగా పనిచేశాం. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తాం అని స్పష్టం చేశారు. నితిన్ నబీన్‌ను యువకుడు, ఉత్సాహవంతుడిగా అభివర్ణించిన చంద్రబాబు, ఆయన వరుస విజయాలతో ముందుకు సాగుతున్నారని ప్రశంసించార. "ప్రధాని మోదీ భారతదేశ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తంగా నిలబెట్టారు. రైట్ టైమ్, రైట్ లీడర్, రైట్ డెసిషన్.. ఇదే నరేంద్ర మోదీ. అలాంటి కీలకమైన పార్టీకి నితిన్ నబీన్ బాధ్యతలు చేపట్టడం శుభపరిణామం.

## జగన్ అసూయ పడుతున్నారు, ఆయనకు అన్ని ఎదురుదెబ్బలే : సిఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత జగన్ కోటి సంతకాల వ్యూహం బెడిసి కొట్టిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.కేవలం తాను చేయలేని అభివృద్ధి పనుల మనం చేయడం చూసి జగన్ అసూయ పడుతున్నారన్నారు.ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బిజీబిజీగా గడుపుతున్నారు. పలువురు కేంద్రమంత్రులను కలుస్తూ రాష్ట్రానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు, పలు అంశాలపై చర్చిస్తున్నారు. అలాగే కూటమి ఎంపీలతోనూ సీఎం సమావేశమయ్యారు. కూటమి ఎంపీలకు ఏపీ సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. సుమారు 40 నిమిషాల పాటు ఎంపీలతో చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఎక్కువ ఎదురుదెబ్బలే తగులుతున్నాయని అన్నారు.ఒక్క వైద్య కళాశాలలు పీపీపీ వ్యవహారం మాత్రమే వాళ్లకి దొరికిందని తెలిపారు. ఆ విషయంలో కూడా ప్రజలు వాళ్లకి అవకాశం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని చూశారని.. అది కూడా విఫలమే అయ్యిందని తెలిపారు.ఢిల్లీ స్థాయిలో కూడా పీపీపీ విధానంపై అధ్యయనం చేయాలని ఎంపీలను సీఎం కోరారు. ప్రస్తుతం ఢిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో పీపీపీ పద్ధతిలో ఆసుపత్రులు నడుస్తున్న విషయాన్ని ముఖ్యమంత్రికి పలువురు ఎంపీలు వివరించారు."మనకి గుర్తింపు పెరుగుతున్న కొద్దీ మనపై బాధ్యత ఎక్కువ అవుతుంద్ధి అని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందని ఎంపీల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# సుపరిపాలనకు మార్గదర్శి వాజ్‌పేయి

## మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్



**శ్రీకాకుళం, డిసెంబరు 19 ప్రభాతవార్త** దేశాభివృద్ధికి, సుపరిపాలనకు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి మార్గదర్శకుడని రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్ కొనియాడారు. శ్రీకాకుళం నగరం సూర్యమహాల్ కూడలిలో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని వారు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ వాజ్‌పేయి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు, స్వర్ణ చతుర్భుజి వంటి రవాణా వ్యవస్థల ఆధునీకరణే నేటి భారత్ పురోగతికి బలమైన పునాదులని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లోనే ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీతి, నిజాయితీతో కూడిన పాలనను అందిస్తున్నాయని, సుపరిపాలన ద్వారానే సామాన్యుడికి సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు. వైద్య విద్యను సామాన్యుడికి చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ (ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం) విధానానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రులు స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా తక్కువ సమయంలోనే ఎక్కువ వైద్య కళాశాలలను నిర్మించి, రాష్ట్రంలో డాక్టర్ల కొరతను తీర్చవచ్చని తెలిపారు. కళాశాలల నిర్వహణలో ప్రైవేటు భాగస్వామ్యం ఉన్నప్పటికీ, యాజమాన్య హక్కులు, సీట్ల కేటాయింపుపై పూర్తి నియంత్రణ ప్రభుత్వానికే ఉంటుందని వారు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రక్రియ సాగుతోందని, పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించే క్రమంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రులు పునరుద్ఘాటించారు.

## కలిమిశ్రీకి ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారం



**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి, ఆధునిక తెలుగు నిఘంటుకర్త ఖిమహామహోపాధ్యాయఖి ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కలిమిశ్రీకి అందజేస్తున్నట్లు అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 13 వేల అచ్చ తెలుగు పదాలను పొందుపరిచిన శీహరి నిఘంటువు ద్వారా తెలుగు భాషకు పట్టం కట్టిన వ్యాకరణ సార్వభౌముడు ఆచార్య రవ్వా శ్రీహరి. తెలుగులో 50 గ్రంథాలు, సంస్కృతంలో 25 గ్రంథాలు రాసిన ఉభయ భాషా ప్రవీణుడి పేరుతో ఇస్తున్న పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ద్వారా సాహితీరంగంలో మూడున్నర దశాబ్దాలుగా విరామమెరుగని సేవలందిస్తున్న కలిమిశ్రీకి ఇవ్వనున్నారు. ఆర్థికబలం లేకపోయినా, కలిమిశ్రీ అలసిపోని అనుభవ బలంతో కసితో, కృషితో, కష్టంతో సంపాదించిన సొంత సొమ్ముతో మల్లెతీగ సాహిత్య సంస్థ ద్వారా రెండు దశాబ్దాలుగా సాహిత్యసేవా కార్యక్రమాలె నిరాటంకంగా నడుపుతున్నారు. కొత్తతరం కవుల్ని తయారు చేసే వందలాది కార్యక్రమాలు చేస్తూ సాహితీరంగంలో కృషి చేస్తున్నారు. కలిమిశ్రీ ఇటీవల విజయవాడలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించి తెలుగుకు వెలుగు అవసరమని, మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ సదస్సు ద్వారా మరోసారి గుర్తు చేశారు.ఈ అవార్డును 21న ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ బందరురోడ్డులోగల ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య సాంస్కృతిక కార్యక్రమంలో అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ నగర మేయర్ శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి త్రి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సుప్రసిద్ధ రచయిత డా.యం.ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య హాజరు కానున్నారు.

## విజయవాడ నుంచి విశాఖపట్నం విమాన సర్వీసు రద్దు!

**విజయవాడ,డిసెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాన్ని చివరి నిమిషంలో రద్దు చేశారు. టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. విమానం బయలుదేరడానికి ముందు నిర్వహించే తనిఖీల్లో పైలట్ సాంకేతిక లోపాన్ని గుర్తించారు. దీంతో ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, విమానాన్ని తిరిగి ర్యాంప్ వద్దకు తీసుకువచ్చారు. అనంతరం, ముందుజాగ్రత్త చర్యగా విమాన సర్వీసును పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రతినిధి తెలిపారు.



కేంద్ర పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పూరీతో సీఎం చంద్రబాబు

## బిపిసిఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్టు శంకుస్థాపనకు రండి!

**- కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్‌కు సిఎం ఆహ్వానం**

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవ ార్తప్రతినిధి:** కేంద్ర పెట్రోలియం, న్యాచురల్ గ్యాస్ శాఖ మంత్రి హర్దీప్ ఎస్ పూరీని ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా కలిసారు.ఈ సందర్భంగా నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ ప్రాజెక్ట్ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఆయనను సీఎం కోరారు. రూ. 96,862 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే అతిపెద్ద సమగ్ర ఇంధన ప్రాజెక్టులలో ఒకటిగా నిలుస్తుందని పేర్కొన్న సీఎం ఈ ప్రాజెక్ట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 6,000 ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు అందించినట్టు వెల్లడి ప్రాజెక్ట్‌కు సంబంధించిన పబ్లిక్ హియరింగ్ విజయవంతంగా పూర్తయ్యింది... పర్యావరణ అనుమతులు కూడా త్వరలోనే రానున్నాయి. ప్రాజెక్ట్ అన్ని దశల్లో వేగంగా ముందుకు సాగుతోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉద్యోగావకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక వృద్ధికి గణనీయమైన తోడ్పాటు లభించనుంది అని సీఎం చంద్రబాబు వివరించారు.

## లోకేశ్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో విచారణకు హాజరైన గోరంట్ల మాధవ్

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాత"వార్తప్రతినిధి:** వైసీపీ నేత, హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ఈరోజు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. మంత్రి నారా లోకేశ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యల కేసులో పోలీసులు ఆయనను ప్రశ్నించారు. విచారణ అనంతరం, తదుపరి విచారణకు సహకరించాలని సూచిస్తూ సీఆర్పీసీ 41ఏ కింద నోటీసులు జారీ చేసి పంపించారు. కేసు వివరాల్లోకి వెళితే... కొన్ని రోజుల క్రితం వైసీపీ అధినేత జగన్ రాప్తాడు పర్యటన సందర్భంగా పోలీసులు సరైన భద్రత కల్పించలేదని గోరంట్ల మాధవ్ ఆరోపించారు. ఈ క్రమంలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన మంత్రి నారా లోకేశ్‌పై తీవ్రమైన, అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన టీడీపీ నేతలు, తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీడీపీ నేతల ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు, గోరంట్ల మాధవ్‌పై కేసు నమోదు చేశారు. ఈ కేసులో భాగంగానే ఇవాళ ఆయనను విచారణకు పిలిపించారు. పోలీసులు ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసుకుని, కేసు దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని నోటీసులు అందించారు.

# తిరుమల సమాచారం

## టోకెన్ ఉన్నవారికే వైకుంఠ దర్శనాలు



**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** వైఖానస ఆగమోక్తంగా పూజలందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో తొలిమూడు రోజులు దర్శన టోకెన్లు కలిగిన భక్తులనే అనుమతిస్తారు. ఇందుకుగాను ఇప్పటికే టిటిడి ఆన్‌లైన్‌లో ఇ డిప్ విధానంలో 1.76లక్షల టోకెన్లు భక్తులకు జారీచేసింది. ఈ టోకెన్లు అందుకున్న భక్తులను తొలిరోజు 70వేలమందికి, రెండవరోజు 55వేలమంది, మూడవరోజు 50వేలమందివరకు భక్తులకు వైకుంఠదర్శనాలు చేయించనుంది. ఇప్పటికే తిరుమలలో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. పదిరోజుల వైకుంఠద్వార దర్శనాల్లో సామాన్యభక్తులకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఇప్పటికే టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ప్రకటించారు. జనవరి 2నుండి 8వతేదీ వరకు ఏడురోజులు టోకన్లు ,టిక్కెట్లు లేకున్నా భక్తులు తిరుమలకు వస్తే వారిని వైకుంఠమ్ 2 క్యాకాంప్లెక్స్ నుండి ఆలయంలోనికి అనుమతించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంకా జనవరి 2నుండి 8వరకు ఎస్ఇడి రోజుకు 15వేల టిక్కెట్లు, శ్రీవాణి రోజుకు వెయ్యిటిక్కెట్లు ఆన్‌లైన్‌లో జారీచేశారు. ఇక తిరుమల,తిరుపతి,చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు జనవరి 6,7,8తేదీలకు రోజుకు ఐదువేల టోకన్లు ఆన్‌లైన్‌లో 27నుండి జారీచేయడం జరుగుతుంది. డిసెంబర్ 30వతేదీ నుండి జనవరి 8వరకు పదిరోజులు పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టోకెన్లు జారీని నిలుపుదలచేశారు. ఆన్‌లైన్‌లో స్థానికులకుకూడా కుటుంబసభ్యులకు 1+3 విధానంలో టోకెన్లు నమోదు చేసుకోవడానికి టిటిడి అవకాశం కల్పించింది.ప్రోటోకాల్ ప్రముఖులు స్వయంగా నేరుగా వస్తేనే వైకుంఠద్వార దర్శనాలు కల్పిస్తారు.

## జనవరిలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటా

**- శ్రీవారిసేవలో కిదాంబి శ్రీకాంత్**

**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** రాబోయే నూతన ఆంగ్ల సంవత్సరం 2026 జనవరిలో ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి టోర్నమెంట్ పోటీల్లో తాను పాల్గొంటున్నట్లు భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ తెలిపారు. రాబోయే రోజుల్లో విజయవాడలో జరగనున్న బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కూడా పాల్గొంటున్నానన్నారు. తాను పోటీల్లో పాల్గొనడానికి ముందుగా కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందుకోవడం సంతోషంగా ఉందన్నారు. కుటుంబసభ్యులతో కలసి శుక్రవారం ఉదయం తిరుమలకు వచ్చిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ ఉదయం నైవేద్యవిరామ సమయంలో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి శ్రీవారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనంచేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## హిందూ దేవాలయాలకు రాయితీపై మైక్‌సెట్, గొడుగులు, శేషవస్త్రం



**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ ప్రసిద్ధిచెందిన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం సనాతన హిందూ ధర్మప్రచారంలో భాగంగా హిందువుల ఆలయాలకు రాయితీపై పలు రకాల వస్తువులను అందిస్తుంది. ఆలయాల్లో వేకువజామున నుండి రాత్రివరకు జరిగే పూజా విశేషాలు, భక్తిసంగీత పాటలు వినిపించేందుకు,భజనలు నిర్వహించేందుకు అవసరమైన మైక్‌సెట్,ఉత్సవమూర్తుల విగ్రహాలు ఊరేగింపుకు గొడుగులు, శేషవస్త్రంతో బాటు రాతి, పంచలోహ విగ్రహాలను రాయితీపై అందించేందుకు సిద్ధమైంది. ఇందుకు ఆయా దేవాలయాల నిర్వాహకులు, కమిటీలు నిబంధనల మేరకు డిడి తీసి తమ దరఖాస్తులను కార్యనిర్వహణాధికారి(ఇఒ),టిటిడి పరిపాలన భవనం, కెటిరోడ్డు, తిరుపతి-517501 చిరునామాకు పంపాలి. ఆలయాలకు మైక్‌సెట్ కొనుగోలుకు 25వేల రూతపాయలు వ్యయం అవుతుండగా ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎస్‌సి,ఎస్‌టిలకు 90శాతం రాయితీ మినహాయించి 2,500 రూపాయలు డిడి తీసి పంపాల్సి ఉంటుంది. ఇతరులకు 50శాతం రాయితీ మినహాయించి 12,500 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఆలయాలకు అవసరమైన గొడుగులకోసం కేటగిరిలతో సంబంధంలేకుండా అర్హులైన దరఖాస్తుదారులకు 14,500 రూపాయలు విలువ చేసే గొడుగులను50శాతం రాయితీతో 7,250 రూపాయలకే టిటిడి అందిస్తుంది. ఇందుకోసం ఆలయ కమిటీ దరఖాస్తుపత్రం ,సంబంధిత ప్రాంతంలోని తహశీల్దార్ /దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్‌తో సదరు శాఖ సిఫార్సులేఖ, దరఖాస్తుదారు ఆధార్‌కార్డ్, ఆలయ ఫోటోను జతచేసి దరఖాస్తు చేయాలి. సంబంధిత పత్రాలతో బాటు రాయితీ మినహాయించి 7,250 రూపాయలకు డిడిని జతచేసి పంపాలి. అలాగే శేషవస్త్రం దేవాలయాలకు ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం ఆలయ అభ్యర్థన లేఖను కార్యనిర్వహణాధికారి,తిరుపతి పేరుతో దరఖాస్తుచేయాలి. ఆలయ ఫోటోను జతచేయాలి.ఇక శ్రీవేంకటేశ్వరస్వామి,పద్మావతిఅమ్మవారి రాతి పంచలోహవిగ్రహాలు కోసం ఐదు అడుగులు,అంతకంటే తక్కువ ఎత్తులో ఉన్న విగ్రహాలను ఉచితంగా అందిస్తారు. మిగిలిన దేవతా విగ్రహాలకు 75శాతం సబ్సిడీపై కేవలం 25శాతం ధరను చెల్లిస్తే వివిధ వర్గాల వారికి అందిస్తారు. ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల్లో ఎస్సీ,ఎస్టీ వర్గాల వారికి ఉచితంగా రాతి విగ్రహాలను అందిస్తారు. పంచలోహ విగ్రహాలను ఎస్సీఎస్టీల వారికి 90శాతం రాయితీతో, ఇతరులకు 75శాతం రాయితీతో అందిస్తారు. దరఖాస్తుదారులు ఖచ్చితంగా స్థానిక తహశీల్దార్/ అసిస్టెంట్ కమిషనర్ నుండి సదరు దేవాదాయశాఖ తాజా సిఫార్సులేఖ,ఆలయ బ్లూప్రింట్‌ను ఏ4 సైజులో, అవసరమైన విగ్రహాల డ్రాయింగ్ ,ఒరిజినల్ ఆలయ ఫోటో, దరఖాస్తు దారు ఆధార్ కార్డును జతచేయాలి. విద్యాసంస్థలకు సరస్వతీదేవి విగ్రహాన్ని 50శాతం సబ్సిడీతో, మఠాలు, ట్రస్టులకు,ఆశ్రమాలకు వివిధ దేవతామూర్తుల విగ్రహాలను 50శాతం రాయితీతో అందిస్తారు.

# మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్పు దుర్మార్గం

**- గాంధీ, అంబేడ్కర్ పేర్లు లేకుండా బిజెపి కుట్ర - తిరుపతిలో కాంగ్రెస్ వినూత్న నిరసన**





**తిరుపతి,డిసెంబర్ 19ప్రభాత వార్తప్రతినిధి:** గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులకు అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మార్పు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ హామీ చట్టం పేరు మార్చడాన్ని తిరుపతి జిల్లా కేంద్రంలోని గాంధీవిగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు గౌడపేరుచిట్టిబాబు, తమటం వెంకటనరసింహులు, సుప్రజ,శివబాలాజీ, నాగరాజుయాదవ్, మహేశ్, ఆమూరి కృష్ణమూర్తి, శివకుమార్, తవన్‌కల్యాన్, వినోద్‌కుమార్, నరేంద్రబాబు,శోభరాజ్ తదితరులు నోటికి నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్నరీతిలో శుక్రవారం నిరసన తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికార బలంతో మహాత్మాగాంధీ, అంబేద్కర్ పేర్లను కనబడనీయకుండా చేయడానికి కుట్రలు చేస్తోందని విమర్శించారు. బిజెపి అప్రజాస్వామికి పాలన చూడలేక పోతున్నామంటూ కళ్ళకు నల్లరిబ్బన్లుతో తీవ్రంగా నిరసన తెలియజేశారు. 2005లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రారంభించారని తెలిపారు.

చట్టంద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో నైపుణ్యంలేని వయోజనులందరికీ ప్రతి గ్రామీణ కుటుంబంలో పని కల్పించి వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఎంతో లబ్ధిపొందుతోందన్నారు. వందపనిదినాలు కనీసవేతనంగా చట్టపరమైన హామీ ఇవ్వబడిందన్నారు. ప్రధాన మోదీకి కాంగ్రెస్‌పై కోపమా లేక మహాత్మాగాంధీ మీద కోపమా తెలియడంలేదని, హఠాత్తుగా ఈ చట్టానికి గాంధీ పేరు తొలగించి రాముడు పేరు వచ్చేలా పేరు మార్చడం ఏ మాత్రం సమర్థనీయం కాదన్నారు. ఇది దేశద్రోహమని మండిపడ్డారు.

# కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి భేటీ

**- ప్రాచీన చారిత్రక కట్టడాలు మ్యూజియంలను అభివృద్ధి చేయండి..**

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లోని ప్రాచీన చారిత్రక కట్టడాలు మ్యూజియంలను అభివృద్ధి చేయమని .కేంద్ర పురావస్తు శాఖ పరిధిలో పనిచేస్తున్న క్యాజువల్ లేబర్ సమస్యలను పరిష్కరించాలని, 8 నెలల జీతాలు చెల్లించాలని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తో అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి భేటీ సందర్భంలో కోరారు. కేంద్ర మంత్రి నివాసంలో ఆయన కార్యాలయంలో కలిసి ఆంధ్రప్రదేశ్ లోని కేంద్ర పురావస్తు శాఖ అమరావతి సర్కిల్ పరిధిలో క్యాజువల్ లేబర్ 8 నెలలుగా జీతాలు లేక వారు పడుతున్న బాధలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు గతంలోనే క్యాట్ ఆదేశాలు ఉన్నా విధులకు రావద్దంటూ అమరావతి సర్కిల్ ఉన్నతాధికారులు వేధిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు సమగ్ర వివరాలతో ఒక వినతి పత్రాన్ని కేంద్రమంత్రికి ఇచ్చారు



ఇటీవల ఆంధ్రప్రదేశ్ లోని నాగార్జున కొండ ఐలాండ్ మ్యూజియంకు ఐదు గ్యాలరీల ఉడెన్ ఫ్లోరింగ్ కు 40 లక్షలు, త్రీడి డిజిటలైజేషన్ యాంటిక్యూటివ్స్ (50 ) డిస్నే గ్యాలరీస్ కి రూపాయలు 6,25,000 మరియు ఏ ఎస్ ఐ అమరావతి మ్యూజియంకు త్రీడి డిజిటలైజేషన్ యాంటిక్యూటివ్స్ (50 ) డిస్నే కు 6,25,000 అదనపు నిధులను మంజూరి చేసినందుకు కేంద్రమంత్రి కి కృతజ్ఞతలు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు తెలిపారు.ఈ సందర్భంగా ఢిల్లీలో డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ అమరావతి సర్కిల్ లో పనిచేస్తున్న 150 మంది క్యాజువల్ లేబర్ కు త్వరలో జీతాలు చెల్లించే విధంగా కృషి చేస్తానని, వారికి డ్యూటీ లో ఏ ఇబ్బంది లేకుండా ఉండే విధంగా ఉన్నతాధికారులకు ఆదేశాల ఇస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రాచీన పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఏఎస్ఐ అమరావతి సర్కిల్ క్యాజువల్ లేబర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి వెంకటరత్నం ఉన్నారు.

వార్త

తమకు తెలినిదానిని తెలుసనే విధంగా వ్యవహరించేవారు, తమకు తెలిసిన విషయాల్ని గురించి కూడా తెలీనివారుగా పరిగణించబడతారు.

-తిరువళ్లువార్

# చలిపంజాకు పొగమంచు అదనం!

తెలుగు రాష్ట్రాల్లో చలి పంజా విసురుతోంది. ఊహించని రీతిలో అల్లూరి జిల్లా డుంబ్రిగూడలో తాజాగా 3.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జనంబయటకు రాలేని పరిస్థితి. బయటికొచ్చినా ఆయా ప్రాంతాల్లో పొగమంచుతో దారితెన్నూ కానరాని దుస్థితి. వాహనాలకు దిక్కుతోచక ఎక్కడికక్కడ ఆగిపోతున్నాయి. పొడి వాతావరణం, కనిష్ట ఉష్ణోగ్రతలతో తెలుగు రాష్ట్రాలు సతమతమవుతున్నాయనే చెప్పాలి. పర్యావరణ ఉష్ణోగ్రతలు ప్రమాదకర పరిస్థితిల్లో ఉన్నకారణంగా సీజనల్ జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం కన్పడుతోంది. రానున్న ఐదు రోజుల్లో వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కన్నా తక్కువగా రెండు డిగ్రీల సెంటీగ్రేడ్ నుంచి 3వరకు తగ్గేఅవకాశం బహు ఎక్కువ. జ్వర తీవ్రతలే కాదు జ్వరాల లక్షణాలు కూడా విభిన్నంగా ఉంటాయని ప్రజారోగ్యశాఖ అంచనా వేస్తోంది. అధిక జ్వరంతోపాటు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చర్మం లేదా పెదవులు నీలి రంగులోకి మారడం, కఫంలో రక్తం, ప్రవర్తనలో ఏమాత్రం తేడాలున్నా వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని హెచ్చరించారు. విషజ్వరాలను పసికట్టాలంటే డాక్టర్ల సంప్రదించడం తప్పనిసరి. తెలంగాణలోని ఆసిఫాబాద్‌లో 5.7 డిగ్రీ సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత చూపిస్తోంది. అన్ని ప్రాంతాల్లోనూ సాయంత్రం 5.30కే చలిగాలులు జనాన్ని ఇబ్బంది పెడ్తున్నాయి. మరుసటి రోజు ఉదయం 7 నుంచి 7.30 గంటల దాకా పొగమంచు వీడటం లేదు. చలితీవ్రత అధికంగానే ఉంటోంది. ఇది శీతాకాలపు సీజనే. కానీ గతంలో కన్నా అత్యంత ప్రమాదకరంగా శీతగాలులు, పొగమంచు జనజీవితానికి అడ్డుపడటమొక్కటే ప్రత్యేకించి చెప్పుకోవాలి. డిసెంబరు మధ్యకాలం నుంచి శివరాత్రి వరకు చలిపంజా విసురుతూనే ఉంటుంది. అదీ తెలుసు. కానీ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అపస్మారకం తప్పదు. ఉత్తర భారతం మరింత భిన్నంగా ఉంటుంది. పొగమంచు కమ్ముతుంది. మంచు దుప్పటి కప్పినట్లుంటుంది. ఇలాంటి పరిస్థితులే భారత దక్షిణాఫ్రికాల మధ్య జరుగాల్సిన నాలుగోటి20ని ఆడకుండా చేశాయి. పొగమంచు ప్రతికూల వాతావరణం కాగా ఆ మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేశారు. ఇలా మంచుకురిసే వేళలో కూడా ఆ మ్యాచ్‌ను వీక్షించడం కోసం ఎంతో మంది వీక్షకులు ఎదురు చూశారు. కానీ వారి ఆశ నెరవేరలేదు. క్షేమంగా ఇంటికి చేరారు. శీతలగాలుల ప్రభావం రైళ్లలో శీతల కంపార్టుమెంట్ల టికెట్లకు గిరాకీ తగ్గిందంటే నమ్మాల్సిందే. అందుకే ఆ శాఖ తమ రైళ్లలో ఎసి కోచ్‌లను తగ్గించింది. ఉత్తరాదిలో ప్రధానంగా ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో పారిశ్రామిక ప్రాంతాలు, నగరాలు, పట్టణాల్లో సైతం పొగమంచు విపరీతంగా కురుస్తోంది. అధిక పీడనంతోపాటు తూర్పుగాలులు, వెస్ట్రన్ డిస్ట్రబెన్స్ బలహీనంగా ఉండటమే పొగమంచుకు కారణమని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక ఢిల్లీ కాలుష్యం సంగతి సరేసరి. చర్విత చర్వణంగా చెప్పుకోవాల్సిందే. కాలుష్యం, పొగమంచుకు ఇండియా గేట్ సైతం ఎక్కడుందో కానరానంతగా ఉంది. అత్యంత దారుణంగా వాయుకాలుష్యంతోపాటు దట్టమైన పొగమంచు రాజధానిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తాజాగా ప్రభుత్వం గ్రాఫ్ 4 చర్యలను తీసుకుంటోంది. ప్రైవేట్ ప్రభుత్వ ఉద్యోగులు 50 శాతం మంది మాత్రమే ఆఫీసు విధులకు హాజరైతే చాలు. ఒకవేళ తక్కిన ఉద్యోగులంతా ఇంటి నుంచే ఉద్యోగం చేయవచ్చు. 5వ తరగతిలోపు విద్యార్థినీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులకు అనుమతి. పొల్యూషన్ సర్టిఫికెట్ ఉన్న వాహనదారులకే పెట్రోలు విక్రయం. అదే గనుక లేకుంటే 'నో' పెట్రోల్, నో డ్రైవింగ్. కాలుష్య ఆంక్షల కారణంగా ఎవరైనా కార్మికులు ఉపాధి కోల్పోతే వారికి వారి వారి బ్యాంకు ఖాతాలలోకి నేరుగా నిధులు బదలీచేయాలని ఢిల్లీ ప్రభుత్వానికి కోర్టు ఆదేశించింది. బాధిత కార్మికులు 2.5 లక్షల మంది ఉన్నారు. వారిలో ఏడువేల మంది మాత్రమే గుర్తించబడ్డారు. వారికి నగదు బదలీ జరుగుతుంది. మిగిలిన వారి పరిస్థితిని బట్టి తక్షణ సహాయం అందచేయాల్సి ఉంటుంది. ఢిల్లీలో వాయు ప్రమాణాలు పాటించక అధ్వాన్నంగా మారిన కాలం చెల్లిన వాహనాలను నిలిపివేయాల్సి ఉంటుంది. బిఎస్ 4 ప్రమాణాల కన్నా తక్కువ స్థాయిలో ఉండే వాహనాలపై చర్యలు తప్పవు. ఢిల్లీలో పొగమంచు కాలుష్యాలను తగ్గించుకునేందుకు దాదాపుగా బీజింగ్ మోడల్‌ను ఆశ్రయించాలని ఢిల్లీ పాలకులు నిర్ణయానికొచ్చారు. ఒకప్పుడు చైనా రాజధాని బీజింగ్‌ను 'పొగమంచుకే కీలకం'గా భావించేవారు. ఈ మధ్యనే చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ ఢిల్లీ సందర్శించినప్పుడు ఈ అంశంపై ప్రస్తావిస్తూ ఢిల్లీ కాలుష్య కట్టడికి చైనాను అనుసరించడం మంచిదని, అవసరమైతే చైనా సహాయం కోసం సంప్రదించవచ్చునని ఆఫర్ ఇచ్చి వెళ్లారు. ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి ఎక్యూ 447గా ఉంది. ఇది ప్రమాదకరమైన హెచ్చరికే. ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6నిబంధనలను కఠినంగా అమలు జరిగితే స్వచ్ఛమైన గాలిని ఆహ్వానించినట్లే! చైనాలో చేపట్టిన సంస్కరణలు అన్నిచోట్లా సాధ్యం కాకపోవచ్చు. కానీ ఢిల్లీలో పరిశ్రమలను వేరే సురక్షితప్రాంతానికి తరలిస్తే తప్ప ఢిల్లీ వాతావరణం స్వచ్ఛత పొందే అవకాశం లేదని కాలుష్యశాఖ అభిప్రాయపడినా ఆ విషయాలను సూటిగా ప్రభుత్వానికి నివేదించలేని పరిస్థితి. కానీ పరిశ్రమల తరలింపు తప్పదు. బీజింగ్‌లో అతిభారీ పరిశ్రమలనే తరలించి కాలుష్య నివారణకు తోడ్పడినప్పుడు ఢిల్లీకి ఎందుకు సాధ్యంకాదు. ఢిల్లీ ప్రభుత్వ ఓ స్థిర నిర్ణయానికి కట్టుబడి ఉంటే కాలుష్యానికి సంకెళ్లు వేయనూవచ్చు. లేదా నియంత్రించనూవచ్చు.



ఏదైతే శారీరకంగా గానీ, మానసికంగా కానీ, ఆధ్యాత్మికంగా కానీ నిన్ను బలహీనుణ్ణి చేస్తుందో, దానిని వెంటనే విషంలాగా పరిత్యజించు.

స్వామి వివేకానంద



డబ్బు ఎంత మంచి సేవకుడో అంత చెడ్డ యజమాని, డబ్బు తగినంత లేనప్పుడు కాదు, ఉన్నప్పుడే పొదుపు గురించి ఆలోచించటం వివేకం.

థామస్ జఫర్సన్

# ప్రజావాక్కు



## సరిహద్దుల స్పష్టత అవసరం

తెలంగాణ రాష్ట్రంలోప్రసిద్ధి చెందినపుణ్యక్షేత్రాలలో కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం ఒకటి. నిత్యం వేలాది మంది భక్తులు దర్శనార్థం వచ్చేవారు కాగా, పండుగలు, శనివారాలు, ప్రత్యేక సందర్భాల్లో లక్షలసంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. ఈవిపరీతమైనరద్దీ కారణంగా భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం, వాహనాల పార్కింగ్, భద్రతా చర్యలుచేపట్టడం ఆలయ నిర్వాహకులకు పెద్ద సవాల్‌గా మారింది. ఈ పరిస్థితుల్లో ఆలయ అభివృద్ధికోసం అదనపు భూమిఅవసరమన్న అంశం చర్చనీయాంశమైంది. ఇటీవలకొండగట్టు ఆలయ సరిహద్దులపై తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు సంయుక్త సర్వే నిర్వహించాలన్న నిర్ణయం సరైనదిశలో వేసిన అడుగుగా భావించవచ్చు. దీంతో భవిష్యత్తు లో తలెత్తే వివాదాలకు కూడా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## చుట్టుముట్టిన సర్ వివాదం

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జరుగబోతున్న ఎన్నికల వేళ ఈ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు సర్ వివాదం ఒకవైపు చుట్టుముట్టిన నేపథ్యంకూడా ఈ ఎన్నికలలో చూడొచ్చు. పశ్చిమ బెంగాల్‌లో 58 లక్షల ఓట్లు సర్ పేరుతో తొలగించడానికి ప్రయత్నం జరుగుతుంది. దేశ వ్యాప్తంగా 10 కోట్ల ఓట్లు కోసుకునిపోతున్నాయి. అని స్వరాజ్ అభియాన్ లాంటి సంస్థ సభ్యుడు యోగేంద్ర యాదవ్ స్పష్టం చేస్తున్నాడు. ఇప్పుడు ప్రాంతీయ భావాలు బలంగా ఉన్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు లాంటి రాష్ట్రాలు అందుకు అవకాశం ఇస్తాయా అన్నదే ప్రశ్న.

- భారత అవినాష్, జనగాం

## ఔషధ పరిశ్రమలో భద్రత ముఖ్యం

రసాయన ఔషధపరిశ్రమలు, కర్మాగారాలలో పకడ్బందీగా భద్రత ప్రమాణాలు పాటించాలి. రసాయన ఔషధ పరిశ్రమలలో ఇటీవల తరచూ ప్రమాదాలు సంభవిస్తుండటంతోప్రాణనష్టం జరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. కార్మికులకు నిరంతరం భద్రతాపరమైన అంశాలపై శిక్షణ కార్యక్రమాలు, మాక్ డ్రిల్స్ నిర్వహించాలి. కార్మికుల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి.

-కె. సతీష్, భూపాల్ పల్లి జిల్లా

## మౌలిక సదుపాయాలు కల్పించాలి

భారతదేశ విద్యా విధానంలో పరిశోధనను పెంపొందించాల్సిన అవసరం చాలాముఖ్యమైంది. కోట్లాదిమంది విద్యార్థులు, లక్షల పాఠశాలలు, కోటిమందికి దగ్గరగా ఉన్న ఉపాధ్యాయులు ఉన్న ఈ పెద్ద వ్యవస్థలో, విద్యార్థులలో జిజ్ఞాస, శాస్త్రీయ దృక్పథం, విశ్లేషణాత్మక ఆలోచనలు పెంచడం లక్ష్యం కావాలి. చదువు అంటేకేవలం పాఠ్యపుస్తకాలు చదివి, పరీక్షలు రాయడం కాదు, ఎలాంటి ప్రశ్నలు అడగాలి?'ఈఅంశాన్ని ఎలా పరిశోధించాలి?' అనే ఆలోచనలను ప్రోత్సహించాలి. దీనికి అనుగుణంగా పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులలో ప్రశ్నించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలి. పరిశీలించడానికి అవసరమైన సదుపాయాలను కల్పించాలి. ఉన్నత స్థాయిలోనే కాకుండా, పాఠశాల స్థాయి నుంచేఉపాధ్యాయులు పరిశోధనాధోరణులను అలవర్చుకోవాలి. తరగతి గదిలో చిన్న చిన్న పరిశోధనా పనులు (ప్రాజెక్టులు) నిర్వహించడం ద్వారా విద్యార్థుల జిజ్ఞాసను పెంచవచ్చు. 'ఈ విషయం ఎందుకు జరిగింది?' అనే ప్రశ్నించే గుణమే సమాజాన్ని, అభివృద్ధిని ముందుకు నడిపిస్తుంది. పరిశోధన పెరగడానికి మౌలిక సదుపాయాల విస్తరణ ప్రధానం.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉప సర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించాలి

సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు మెంబర్, ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సర్పంచ్‌తో పాటుగా ఉప సర్పంచ్‌కు కూడా కొన్ని హక్కులు, బాధ్యతలు ఇవ్వాలి. తెలంగాణా రాష్ట్ర పంచాయతీ రాజ్ సంస్థ కొన్ని విధులు ఉప సర్పంచ్‌కు కూడా కలిపించాలి. ప్రజాస్వామ్య భారత దేశంలో గ్రామ స్థాయిలో ఉపసర్పంచ్‌కు కూడా బాధ్యత ఉండాలి. గ్రామలే దేశానికి పట్టు కొమ్మలు అని మహాత్మా గాంధీ గారి మాట నిలబెట్టాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## చెరువుల పట్ల నిర్లక్ష్యం చూపవద్దు

నీరే మనుగడకు ప్రాణాధారం. ప్రతి చుక్క అమూల్యం. అటువంటి చెరువులను పూడ్చి వేస్తూ ప్రమాదకరమైన స్థలంలో ఇల్లు నిర్మించడం ప్రమాదకరమని తెలిసినా ప్రభుత్వం వాటిపై చర్యలు తీసుకోకపోవడం, పేద ప్రజలకు అటువంటి స్థలాలపై అవగాహన లేక అక్కడే నివాసం ఉండటం, వర్షాకాలంలో ఆ ఊర్లు నీట మునిగి ఎన్నో విపత్తులకు గురవ్వడం, ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరుగుతుంది. తరిగిపోతున్న చెరువులను రక్షించడం మనందరి బాధ్యత.

-కాల్వ నిఖిత, సిద్ధిపేట

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# ప్రజాచైతన్యమే పరిష్కారం

ఈ పరిస్థితుల్లో పార్టీల్లోనే ఉండి ఏళ్లతరబడి పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. కూడు, గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతామని అన్నట్లుగా ఉంది రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నేతల వైఖరి. శిక్షణాతరగతులు అంటారు. రాస్తారోకోలు అంటారు. ఛలో కార్యక్రమాలు అంటారు. సమావేశాలకు, సభలకు జనాన్ని తరలించుకురావాలంటారు. తీరా ఎన్నికల్లో, ఏదైన పదవుల ఎంపిక విషయంలో ఈ ఫిరాయింపుదారుల్లో, నియోరిచ్ కుబేరులో ప్రత్యక్షమై పదవులను తన్నుకుపోతున్నారు. పైకి ఏమనకపోయినా జీతభత్యం లేని ఈ సేవలు ఇంకెన్నాళ్లనే కార్యకర్తలు కూడా ఉన్నారు. అందుకే కొన్ని పార్టీల్లో కింది స్థాయి నాయకులు తగ్గిపోతున్నారు. అయితే ఏనాటికైనా తమ సేవలు గుర్తించకపోతారా, ఏదో ఒక పదవి రాకుండాపోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూ ఇళ్లు ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

దామెర్ల సాయిబాబ

పాలకులు వ్యాపారులైతే ప్రజలు బికారులవుతారనే చాణక్యనీతిని విస్మరించలేం. ప్రజాసంక్షేమంపై తీవ్ర దుష్ప్రభావాలు చూపుతాయని ఆనాడే చాణక్యుడు హెచ్చరించారు. అప్పట్లో రాజులు కూడా వ్యాపార రంగాల్లో ప్రవేశిస్తే ప్రజలకు మేలు జరుగుతుందనే ప్రతిపాదనను చాణక్యుడు పూర్తిగా వ్యతిరేకిస్తూ అదే జరిగితే అందులో అక్రమాలకు, అవకతవకలకు ఎవరు అడ్డుపడతారని, మరెవరు నియంత్రిస్తారని అంటూ అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్నవాళ్లు వ్యాపారులైతే ప్రజలు బికారులు అవుతారని చాణక్యుడు స్పష్టం చేశారు. అది అప్పటికీ, ఇప్పటికీ అక్షరసత్యం. రాజులు పోయారు, రాజరికాలు అంతరించాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులే ప్రభువులు అయ్యారు. ప్రజారక్షణతోపాటు సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో ప్రవేశపెట్టి ప్రజా అవసరాలను తీర్చేందుకు, పర్యవేక్షించేందుకు నిబంధనలను, చట్టాలను రూపొందించుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత చాలాకాలం పాటు వ్యాపారాల్లో భాగస్వాములు అయ్యేవారు కాదు. కాంట్రాక్టులు, ముఖ్యంగా మద్యం వంటి వ్యాపారాలకు దూరంగా ఉండేవారు. వ్యాపారాల్లో కల్తీ, అవినీతి, అవకతవకలు జరిగితే అవి చుట్టుముట్టి తమ రాజకీయ జీవితానికి పరిసమాప్తం పలుకుతాయని భయం, జంకు ఉండేది. చట్టపరంగా కూడా మన రాజ్యాంగంలో కొన్ని నిబంధనలను రాజ్యాంగ నిర్మాతలు పొందుపరిచారు. కానీ పరిస్థితులు మారిపోయాయి. లాభసాటిగా ఉన్న వ్యాపారాల్లో పరోక్షంగానో, ప్రత్యేక్షంగానో కొందరు రాజకీయ నాయకులు భాగస్వాములవుతున్నారు. అసలు రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించే రాజకీయ నాయకులు కనుమరుగైపోయారు. ఎన్నికల వ్యయం కూడా అంచనాలకు మించి పెరిగిపోయింది. పెట్టుబడి, తిరిగి సంపాదన, మళ్లీ పెట్టుబడి సంపాదన అన్నట్లుగా రాజకీయాలు ఒక విషవలయంగా రూపాంతరం చెందాయి. పంచాయతీ ఎన్నికల నుండి పార్లమెంట్ ఎన్నికల వరకు డబ్బులు, మద్యం పంపిణి చేయకపోతే ఎన్నికల్లో పోటీ చేయలేని దురదృష్టపరిస్థితులు దాపురించాయి. ఈ నెలలో తెలంగాణ రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికలకు ఎన్ని వందల కోట్ల రూపాయలు వ్యయం చేశారో లెక్కలకే అందదు. మద్యం, డబ్బు, నీళ్లల్లా పారించారు. కొన్ని ప్రాంతాల్లో ఓటుకు ఐదువేల రూపాయలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. గ్రామస్థాయిలో సర్పంచ్ పదవికి లక్షలాది రూపాయలు వెచ్చించారంటే ఎన్నికల వ్యయం ఏ స్థాయికి చేరిందో అర్థమౌతుంది. సర్పంచ్ పదవులు వేలం వేసే పరిస్థితులు కూడా దాపురించాయి. తాము పెట్టిన డబ్బును తిరిగి సంపాదించుకునేందుకు ప్రయత్నించక మానరు. సర్పంచ్ స్థాయిలోనే లక్షలాది రూపాయలు వెచ్చిస్తుంటే ఇక ఎమ్మెల్యే, పార్లమెంటు, వందల కోట్లు వెచ్చించాల్సి వస్తుంది? అందుకోసం మళ్లీ వారు సంపాదించుకునేందుకు రకరకాల మార్గాల్లో అడుగులు వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలో పెరుగుతున్న అవినీతికి ప్రధాన కారణాల్లో ఇది ప్రధానమైంది. ఏ కుంభణాన్ని అయినా తీసుకోండి. పరోక్షంగానో, ప్రత్యక్షంగానో ఏదోఒక రాజకీయ నాయకుడికి సంబంధం ఉంటున్నది. అందులో కొన్ని మాత్రమే బయటకు వస్తున్నాయి. వెలుగు చూసిన కుంభకోణాల్లో కోట్లాది రూపాయలు ప్రజాధానాన్ని కొల్లగొట్టినట్లు బయటపడినా, బాధ్యులైన నేతలను జైళ్లకు పంపినా దోచుకున్న డబ్బును తిరిగి పూర్తిగా రాబట్టుకోలేకపోతున్నారు. రాజకీయ అవినీతిని నియంత్రించకుండా అవినీతిని రూపుమాపడం సాధ్యమయ్యే పనికాదు. ప్రజారోగ్యంపై దాడి చేస్తున్న కల్తీ భూతం గురించి అందరికి తెలిసిందే.

## ఒక్క మాట

పెట్రోల్‌నే తీసుకుందాం. ఎంత పెద్దఎత్తున కల్తీ జరుగుతుందో జగమెరిగిన సత్యం. పెట్రోల్‌లో కల్తీ వల్ల వినియోగదారుడికి జరుగుతున్న నష్టం గురించి అటుంచితే కాలుష్యం ఎంతగా వెదజల్లుతున్నదో, ఎన్ని కోట్లమంది ప్రజలఆరోగ్యాన్ని బలితీసుకుంటున్నదో అంచనాలకే అందవని వైద్యనిపుణులే అంగీకరిస్తున్నారు. దేశంలో ఆ పెట్రోలు పంపులు ఎవరివి?ఎవరి పేరున నడుస్తున్నాయి?వెనుక ఉన్న పెద్దలు ఎవరు? ఆయా ప్రాంతాల ప్రజలకు తెలియని విషయాలు ఏమీ కావు. అంతా బహిరంగ రహస్యమే. ఇక కాంట్రాక్టులు కోట్లాది రూపాయలు వ్యయంతో చేపడుతున్న పథకాల పనుల్లో కాంట్రాక్టర్లు ఎవరు? ఏ రాజకీయ నాయకుడికి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంబంధాలున్నాయి? తదితర విషయాలు అందరికి తెలిసినవే. చివరకు దేశ భవిష్యత్‌కు పునాదులు వేసే విద్యారంగంలో కూడా కొందరు రాజకీయ నాయకులు పత్యక్షంగానో పరోక్షంగానో ప్రవేశించడంతో పవిత్రమైన విద్యాబోధన కూడా వ్యాపారంగా రూపాంతరం చెందింది. అదిఇది అనికాదు. లాభసాటిగా ఏవ్యాపారం ఉందనుకొంటే అక్కడ కొందరు రాజకీయ నేతలు వాలిపోతున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ భాగోతంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. కోట్లాది రూపాయలు చేతులు మారినట్లు కేవలం ఆరోపణలే కాదు కేసులు కూడా నమోదయ్యాయి. ఇక ఈ చీప్ లిక్కర్ ప్రజల ఆరోగ్యాన్ని ఎంతగానో కబళిస్తున్నది. దేశవ్యాప్తంగా కోట్లాది మంది అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమై కృంగి, కృశించి అసువులు బాస్తున్నారు. అంతెందుకు కోట్లాది మందిభక్తుల ఇలవేల్పు తిరుమల వెంకన్న కూడా తప్పించుకోలేకపోయారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దర్యాప్తులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. డబ్బు సంపాదనలో పడి మరేమీ పట్టించుకోవడం లేదు. కేవలం వ్యాపారాలను కాపాడుకోవడం కోసం, విస్తరణ కోసం కొందరు నేతలు నైతికవిలువలకు తిలోదకాలు ఇస్తూ రాత్రికి రాత్రే పార్టీలు మారుస్తున్నారు. నిబంధనలను గాలికి వదిలి కప్పదాట్లకు పాల్పడుతున్నారు. వారికి కావలసింది వారి వ్యాపారాభివృద్ధే. నిబంధలను పక్కకు పెడుతున్నారు. పేర్లు రాసి వారిని ఇబ్బంది పెట్టడం ఎందుకు కానీ, పార్టీ అధికా రం కోల్పోగానే క్షణం ఆలోచించకుండా అధికారంలో ఉన్న పార్టీలోకి దూకేస్తున్నారు. పైగా నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాము ఈ కప్పదాట్లకు పాల్పడినట్లు చెప్పుకుంటు న్నారు. ఆయా పార్టీలు కూడా రెడ్‌కార్పెట్ పరిచి ఆహ్వా నించి అందలం ఎక్కిస్తున్నాయి. ఆపార్టీ ఈపార్టీ అని కాదు దాదాపు అన్ని పార్టీలదీ అదే పరిస్థితి. ఈపరిస్థితుల్లో పార్టీ ల్లోనే ఉండి ఏళ్లతరబడి పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతున్నది. కూడు, గుడ్డ అడక్కపోతే బిడ్డను సాకినట్లు సాకుతామని అన్నట్లుగా ఉంది రాజకీయ పార్టీలకు చెందిన కొందరు నేతల వైఖరి. శిక్షణాతరగతులు అంటారు. రాస్తారోకోలు అంటారు. ఛలో కార్యక్రమాలు అంటారు. సమావేశాలకు, సభలకు జనాన్ని తరలించుకురావాలని అంటారు. తీరా ఎన్నికల్లో, ఏదైన పదవుల ఎంపిక విషయంలో ఈ ఫిరాయింపుదారులో, నియోరిచ్ కుబేరులో ప్రత్యక్షమై పదవులను తన్నుకుపోతున్నారు. పైకి ఏమనకపోయినా జీతభత్యం లేని ఈ సేవలు ఇంకెన్నాళ్లనే కార్యకర్తలు కూడా ఉన్నారు. అందుకే కొన్ని పార్టీల్లో కింది స్థాయి నాయకులు తగ్గిపోతున్నారు. అయితే ఏనాటికైనా తమ సేవలు గుర్తించకపోతారా, ఏదో ఒక పదవి రాకుండా పోతుందా? అనే ఆశతో కొందరు ఈ రాజకీయ యజ్ఞంలో పోరాటం చేస్తూ ఇళ్లు, ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఎన్నికల వ్యయం పెరిగిపోవడానికి ప్రజలది కూడా బాధ్యత ఉందని చెప్పక తప్పదు. తమ భవిష్యత్‌కు బంగారు బాట వేసి తమ సమస్యలను పరిష్కరించి తమను అభివృద్ధి వైపు నడపాల్సిన నేతలను ఎన్నుకోవాల్సి ప్రజల్లో కొందరు ఓటును అంగడి సరుకులా అమ్ముకొంటున్నారు. ఎన్నికలకు ఎన్నికలకు ఈ దుస్సంస్కృతి పెరిగిపోతున్నది. ఆ పార్టీవారు డబ్బులు ఇచ్చారు మీరు ఎందుకు ఇవ్వరు అంటూ నిరసనలు తెలిపే స్థాయికి చేరుకొన్నది. మొన్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచిగా పోటీ చేసిన వ్యక్తి పదిలక్షల రూపాయల వరకు పంపిణీ చేశారు. అయినా ఓడిపోయారు. తన వద్ద డబ్బు తీసుకొన్నవారు తనకు ఓటు వేయలేదనే విషయం తెలిసిపోయింది, దీంతో ఆయన తన కుటుంబ సభ్యులతో పాటు కుంకుమ, దేవుని ఫోటో పట్టుకొని, ఇంటింటికి తిరుగుతూ ఓటు వేసి ఉంటే డబ్బులు ఇవ్వొద్దు, ఒక వేళ ఓటువేసి ఉంటే తన చేతిలో ఉన్న దేవుని ఫోటోకి బొట్టు పెట్టి చెప్పాల్సిందిగా అభ్యర్థించారు. చాలామంది ఓటు వేయని వారు తాము తీసుకొన్న డబ్బును దేవుని ఫోటో ముందు ఉంచారు. ఇంకొన్ని గ్రామాల్లో మరొక రకంగా వసూలు చేసుకొన్నారు. ఏదిఏమైనా రాజకీయాలు రానురాను కలుషితమైపోతున్నాయి. ప్రజాసేవ, నీతినిజాయితీ, నిస్వార్థం, నిష్పక్షపాత వైఖరి లాంటివి దూరమైపోతున్నాయి. ప్రజల్లో చైతన్యం వస్తే తప్ప ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చే అవకాశాలు కన్పించడంలేదు. ●

# మానవీయ కోణానికి సంఘీభావం

బి. మధుపాళి

ప్రపంచ మానవాళి పలు సమస్యల సంక్షోభాల్లో కూరుకుపోతున్నది. పేదరికం కోరలు చాస్తున్నది. అసమానతలు రాజ్యమేలుతున్నాయి. వివక్ష ఒళ్లు విరుస్తున్నది. అనారోగ్యాలు ఆగం చేస్తున్నాయి. ఆకలి కేకలు ప్రాణాలు తీస్తున్నాయి. యుద్ధాలు మారణహోమంలా సృష్టిస్తున్నాయి. కన్నీటి వరదలు పారుతున్నాయి. అంతర్గత సంక్షోభాలు అంతుచూస్తున్నాయి. సామాజిక న్యాయం సతుబడుతున్నది. ఆహార అభద్రత నరకం చూపిస్తున్నది. సమస్యలు ప్రపంచ మానవాళిని తరుముతున్నాయి. కుల, మత విభేదాల కాళ్లు కంపుకొడుతున్నది. మానవత్వం మంటగలుస్తున్నది. ప్రపంచవ్యాప్త 8.2 బిలియన్ల ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్న వేళ మానవీయ కోణాన్ని తట్టి లేపుతూ, అభాగ్యుల శ్రేయస్సుకు సంఘీభావం తెలుపవలసిన సందర్భం వచ్చిందని గుర్తు చేయడానికి ప్రతి ఏటా 20 డిసెంబర్ రోజున ప్రపంచ దేశాలు అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం (ఇంటర్నేషనల్ హూమన్ సాలిడారిటీ డే)" పాటించుట 2005 నుంచి ఆనవాయితీగా మారింది. మానవాళి ఉజ్వల భవిష్యత్తుకు పౌర సమాజ ఏకీకరణ" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించడం జరుగుతోంది. ప్రపంచమే ఓ అద్భుత వైవిధ్యతల నెలవు. సంస్కృతి వారసత్వాలకు అదో ఆదరువు. ప్రపంచ




దేశాలు, ప్రాంతాలు విలక్షణ జీవన విధానాలతో కొనసాగుతున్నాయి. మానవ సమాజం మానవీయతను ప్రదర్శిస్తూ పేదల పాలిట దైవాలుగా నిలిచి, ఆకలిని అంతం చేయడానికి తమ సహాయ సంఘీభావాలను తెలియజేయాల్సిన సమయం ఆసన్నమైనదని ఐరాస భావిస్తున్నది. అంతర్జాతీయ మానవ సంఘీభావ దినం వేదికగా భిన్నత్వ ప్రపంచాన్ని ఏకత్వ భావనతో చూడడం, ప్రభుత్వాలు మానవ సమస్యల పరిష్కారాలకు తగుచర్యలు తీసుకోవడం, మానవ ఏకీకరణ ప్రాధా న్యాలను అవగాహన పర్చడం, ఐరాస సుస్థిరాభివృద్ధిలక్ష్యాల సాధనకు సంఘీభావ ప్రదర్శనలు చేయడం, పేదరిక నిర్మూ లనకు ప్రతి ఒక్కరు కృషి చేయడం, సామాజిక న్యాయాలను కల్పించడం లాంటి అంశాలను చర్చించారు. పరమత సహనం, పరహిత సద్గుణాలు నేటి తక్షణ అవసరం అని ప్రచారం చేయాల్సిన శుభ సందర్భం. దయ, కరుణ భావాలను పెంచి పోషించడం, విశ్వమానవ ఐక్యతకు సంఘీభావాన్ని ప్రకటించడం కొనసాగాలి. విభేదాలు తాత్కాలికమైనవని, చర్చలతో సమస్యలకు పరిష్కారాలు దొరుకుతాయని, ప్రపంచ శాంతి శాశ్వతమని, ప్రజాశ్రేయస్సే మన నినాదం కావాలని కోరుకుంటేనే రేపటి తరం సుఖశాంతులతో మనగలుగుతుందని తెలుసుకొని మానవత్వ పంట పండించడానికి సహాయ, సలహా, సంఘీ భావాలను తెలియజేద్దాం. ప్రపంచ మానవ ఏకీకరణకు సంఘీభావ విత్తులు నాటుదాం. ●

# ఆర్థికాభివృద్ధికి అతివలే ఆలంబన

పుల్లూరు వేణుగోపాల్

కోటిమంది మహిళలను కోటీశ్వరులు చేయాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి మిషన్ 2025 చేపట్టింది. ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రుణాలు అందించి వారు వ్యాపారవేత్తలుగా ఎదగడానికి మార్గదర్శకత్వం నిర్దేశిస్తున్నది. తాము ఆర్థికంగా ఎదగడం కొరకు తీసుకున్న లోన్లను తిరిగి చెల్లించుటలో తొంబై ఎనిమిది శాతానికి పైగా మహిళలు ముందున్నారు. సూపర్ మార్కెట్‌లు, కుట్టు శిక్షణ కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, హస్తకళా ఉత్పత్తుల మార్కెటింగ్ ,పౌల్ట్రీ, పశుపోషణ లాంటి అనేక వ్యాపారాల్లో నేడు మహిళా సంఘాల సభ్యులు వ్యాపార రంగాల్లో దూసుకుపోతున్నారు. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించుట, అమ్మ ఆదర్శ పాఠశాల పనుల నిర్వహణ, పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టే బాధ్యతలు స్థానిక మహిళా సంఘాలకు అప్పజెప్పడంతో మహిళా సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాల ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడం జరుగుతున్నది. రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌లు, రైల్వేస్టేషన్లు, బస్‌స్టాండ్స్, ప్రభుత్వ హాస్పిటల్స్ తదితర ప్రాంతాల్లో మహిళా శక్తి క్యాంటీన్లు మహిళా సంఘాల ద్వారానే దిగ్విజయంగా లాభాల బాట నడుస్తున్నవి. నారాయణపేట, సంగారెడ్డిలలో జిల్లా మహిళా సమైక్యలు పెట్రోల్ బంకులు నిర్వహిస్తూ లాభాల బాటలో నడుస్తున్నవి. మహిళా సంఘాలు 1000 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్వహించి విద్యుత్ శాఖకు అమ్మేలా సోలార్ ఒప్పందాలు జరుగుతున్నాయి. మహిళా సంఘాలు ఆర్టీసీ బస్సులను కొని ఆర్టీసీకి లీజుకు ఇచ్చి బస్సులకు యజమానులుగా మారి లాభాలను గడిస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలు ఉత్పత్తి చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకోవడానికి రాజధాని నడిబొడ్డున మాదాపూర్లో మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేసి 106 దుకాణాల సముదాయాలు ఏర్పరిచి మహిళా సంఘాలకు కేటాయించడం జరిగినది. హైదరాబాద్‌లోని మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం డ్రైవింగ్‌లో శిక్షణ ఇప్పించి ఉమెన్‌కార్పొరేషన్ ద్వారా మహిళలకు ఆటోలు, కార్లు లోన్‌ద్వారా ఇప్పించి వారిని వాటికి యజమానులుగా చేసి వారు వారి కాళ్లపై స్వతంత్రంగా నిలబడేలా చర్యలు తీసుకుంటున్నారు. సంగారెడ్డి జిల్లాలో డ్రోన్ల ద్వారా వ్యవసాయ పంటలకు ఎరువులు చల్లే విధానంపై మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ ఇప్పించి వారికి బ్యాంకుల ద్వారా డ్రోన్లు ఇప్పించడం ద్వారా వారు గ్రామాల్లో



వ్యవసాయ పనుల్లో డ్రోన్లు ఉపయోగిస్తూ అధిక ఆదాయం పొందుతూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ సంక్షేమ పథకాల అమలులో వారిని భాగస్వామ్యం చేస్తూ వారు ఆర్థికంగా పరిపుష్టి చెందేలా చర్యలు తీసుకుంటున్నది. ఆర్థికంగా మహిళల్లో స్వయం శక్తి పెరగడంతో వారి రోజువారి ఖర్చులకు కుటుంబ సభ్యులపై ఆధారపడడం తగ్గిపోయింది. ఆర్థికంగా నిలబెట్టుకోవడంతో కుటుంబ నిర్ణయాల్లో వారి భాగస్వామ్యం పెరిగింది. స్వయం సహాయక సంఘాల సమావేశాల ద్వారా వారిలో ధైర్యం, ప్రశ్నించే తత్వం, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందాయి. దానితో వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తూ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికవుతున్నారు. పిల్లల చదువులు, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రతపై వారికి అవగాహన పెరిగింది. తమ సంపాదనలతో వారు వారి కుటుంబాల ఆరోగ్యం, పిల్లల విద్య, పౌష్టికారంపై ఖర్చు పెట్టుకోగలుగుతున్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులు ఇతర రాష్ట్రాలకువెళ్లి వారికి స్వయం సహాయక సంఘాల నిర్వహణపై శిక్షణ ఇస్తూ గణనీయమైన ఆదాయాన్ని పొందుతున్నారు. దీనితో ఇతర రాష్ట్రాల్లోనిమహిళా సంఘాలను బలోపేతం చేయడంలో తెలంగాణ మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు. నేడు స్వయం సహాయక సంఘాలు కేవలం పొదుపు సంఘాలుగా కాకుండా స్వయం సమృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయనుటలో ఎలాంటి అతియోశక్తి లేదు. మహిళలు ఆర్థికంగా బలపడడం వలన దేశ ఆర్థిక అభివృద్ధి పెరుగుతున్నది. మహిళా సాధికారతలో కీలకమైనది ఆర్థిక సాధికారిత. తెలంగాణ రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాలలోని మహిళలు ఆర్థిక సాధికారతలో ముందున్నారు. భారత్ ఫ్యూచర్‌సిటీ వేదికగా జరిగిన తెలంగాణరైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047లో మహిళా సాధికారతకు అద్దం పట్టేలా ఇందిరా మహిళా శక్తి స్టాల్ సెర్ప్ ఐసిడిఎస్ ద్వారా ఏర్పాటు చేశారు. స్వయం సహాయక బృందాల్లోని మహిళలు గ్లోబల్ స్థాయి బిజినెస్ ఉమెన్‌గా ఎలా ఎదిగారో ప్రపంచానికి తెలిసేలా ఈ వేదిక ఏర్పాటు చేయడం జరిగింది. 2047 నాటికి భవిష్యత్ తెలంగాణను మహిళలు తీర్చిదిద్దుతారని ఈ సమ్మిట్ లో ప్రస్తావించారు. నాయకత్వం, సృజనాత్మకత, పారిశ్రామిక అభివృద్ధి ద్వారా సంపద సృష్టించబోతున్నారని ఈ సమ్మిట్ ద్వారా తెలియచేశారు. మహిళా సాధికారతలో అత్యంత ముఖ్యమైనది మహిళా అక్షరాస్యత. అక్షరాస్యతలో మహిళలు పురుషుల కన్నా వెనుకబడి ఉన్నారనే ఉద్దేశంతో ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరూ అక్షరాస్యులు కావాలనే ఉద్దేశంతో బృహత్తర కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టింది. అతివలతో అభివృద్ధి అనునది నేడు ప్రతి కుటుంబంలో, ప్రతి గ్రామంలో నిజమవుతున్నది. మహిళలు ఆర్థికంగా బలపడితే ఆ కుటుంబం ఆర్థికంగాబలపడుతుంది. కుటుంబం ఆర్థికంగా బలపడితే ఆ గ్రామం ఆర్థికంగా బలపడుతుంది. గ్రామం ఆర్థికంగా బలపడితే రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుంది. రాష్ట్రం ఆర్థికంగా బలపడితే దేశం ఆర్థికంగా బలపడుతుంది. మహిళా సాధికారిక, అభివృద్ధి అనునది ఇప్పుడు మహిళా సంఘాల ద్వారా మనము చూస్తున్న ఒక స్పష్టమైన వాస్తవ దృశ్యం. స్వయం సహాయకబృందాలలోని మహిళలు తాము మహోన్నత శక్తిగా ఎదుగుతూ దేశాభివృద్ధికి తోడ్పడుతున్న తీరు అభినందనీయం. ●

## బాలికల కళాశాల వసతి గృహాన్ని డిఆర్ఓ ఆకస్మిక తనిఖీ

**ఒంగోలు, ప్రభాతవార్త**





ఒంగోలు భాగ్యనగర్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల కళాశాల వసతి గృహాన్ని శుక్రవారం రాత్రి జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా వంట గదిని, తాగునీటి వసతులను, మరుగుదొడ్లను, స్టోర్ గదిని పరిశీలించారు. వసతి గృహంలో ఉన్న విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా, ప్రతి నెలా వైద్యులు వస్తున్నారా లేదా, వారి ఆరోగ్య పరిస్థితులు, కల్పిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాకు వసతులు బాగున్నాయని, ప్రతినెలా వైద్యులు వచ్చి పరీక్షలు చేసి వెళతారని డి ఆర్ ఓ కు చెప్పడం జరిగింది. జిల్లా రెవెన్యూ అధికారి విద్యార్థులతో కలసి భోజనం చేయడం జరిగింది విద్యార్థులకు వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహించరాదని వసతి గృహం సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలికల వసతి గృహంను పరిశీలించడం జరిగిందన్నారు. వసతులు, భోజనం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వసతి గృహంలో మొత్తం 128 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయన వెంట జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి లక్ష్మీనాయక్, ఎఎస్‌డబ్ల్యూఓ రబియా, కె. స్వప్నలత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలపై లైంగికదాడులు చేసినవారిపై కఠిన చర్యలు

### - రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ

**ఒంగోలు, ప్రభాతవార్త**



మహిళలు,ఆడపిల్లలపై లైంగికదాడులు చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. శుక్రవారం రాష్ట్ర మహిళాకమిషన్ ఛైర్ పర్సన్ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ లోని నర్సింగ్ హాస్టల్‌ను, సఖివన్ స్టాప్ సెంటర్‌ను, రామ్‌నగర్‌లోని గృహహింస నిరోధక చట్టం కేంద్రాన్ని, బాల సదనం కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళాకమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఉందనే భరోసాను కల్పించాలని ఆమె చెప్పారు. రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లలకు ఆశ్రయం కల్పించ డానికి సఖి వనస్టాప్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై లైంగిక దాడులుజరగకుండాఅవగాహన కల్పించాలని అధికారులకు చెప్పారు.



కళాశాలలో, పాఠశాలలో బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగా హన కల్పించాలని ఆమె చెప్పారు. మహిళలకు లైంగిక వేధింపుల చట్టాల గురించి, ఫోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించా లని ఆమె చెప్పారు. రాష్ట్రంలో లైంగిక వేధింపులు తగ్గించ డానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటు న్నాయని ఆమె చెప్పారు. లైంగిక వేధింపులకు గురైన మహిళలు నిర్భయం గా ముందుకు వచ్చి సమస్యను చెప్పుకో లేకపోతున్నారని ఆమె అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటుచేసిన ఇంటర్నల్ కంప్లైంట్ సెల్ కు తెలియజేయాలని ఆమెచెప్పారు. రిమ్స్ హాస్పిటల్ ప్రాంగణంలో ఉన్న నర్సింగ్ హాస్టల్ లో 500మంది విద్యార్థులు ఉండడానికి అసౌకర్యంగా ఉందని ప్రత్యేక భవనంలోకి మార్చాలని విద్యార్థులు కోరన్నారు. సఖి వన్ స్టాప్ సెంటర్లో అమలు జరుగుతున్న కార్యక్రమాల గురించి ఛైర్పర్సన్ అధికారుల ను అడిగితెలుసు కున్నారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉన్న గృహహింస నిరోధక చట్టం కేంద్రాన్ని ఛైర్పర్సన్ పరిశీ లించారు. బాలసదనం కేంద్రంలో ఉన్న పిల్లలతో ఛైర్పర్సన్ ముచ్చ టించారు. బాల సదనం కేంద్రంలో పిల్లలతో సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఛైర్పర్సన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాసంక్షేమశాఖ అధికారి సువర్ణ, నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సుమిత్రా దేవి, దిశ పోలీస్ స్టేషన్ డి.ఎస్.పి రమణమూర్తి, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చికెన్, మటన్, ఫిష్ అమ్ముకునేవారికి స్థలము కేటాయింపు

**జె. పంగులూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**



మండలంలోని ముప్పవరం గ్రామంలో రోడ్డు ప్రక్కన చికెన్, మటన్, ఫిష్ అమ్ముకొనటం వలన వ్యర్థ పదార్థాలు నుండి దుర్వాసనతో నిలువ లేని పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలియచెప్పారు. ఈ నేపథ్యంలో జాగర్లమూడి వారి పాలెం సొసైటీ అధ్యక్షులు అల్లమనేని బ్రహ్మానందస్వామి, గ్రామ సర్పంచ్ సాంబయ్య గ్రామంలోని నాయకుల సలహాతో వారికి స్థలం కేటాయించాలని నిర్ణయించుకుని శుక్రవారం జె.సి.బి ఉపయోగించి చదును చేశారు. చికెన్, మటన్, చేపలు అమ్ముకొని జీవించే వారికి హైవే పక్కన ఉన్న 20 సెంట్లు స్థలాన్ని చదును చేశారు. ఈ స్థలంలో షాపులు నిర్మించుకొనుటకు 12 30 అడుగుల స్థలంని కేటాయించారు. వారు ఈ స్థలంలో వారే షాపులు నిర్మించుకొని అమ్ముకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, డి. భవన్నారాయణ, గరిమిడి జగన్మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## శెనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి

**జె. పంగులూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**



మండలంలోని చందలూరు గ్రామంలో వ్యవసాయ అధికారి డి సుబ్బారెడ్డి శనగ పంటను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ రబీ 202526శ కాలంలో సాగుచేసిన సెనగ పంటకు అక్కడక్కడ ఏరు కుళ్ళు పోయి ఎండు తెగులు కనిపిస్తున్నదని దీని నివారణకు ట్రైకోడెర్మా విరిడి అనే ముందుని లీటర్ నీటికి 8 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయటం గాని లేదా కాపర్ ఆక్సి క్లోరైడ్ అనే ముందుని లీటర్ నీటికి 2.5 గ్రాములు చొప్పున కలిపి తెగులు ఆశించిన పరిసర ప్రాంతాలలో పిచికారి చేసుకోవాలని అన్నారు. జొన్న లేదా మొక్కజొన్న పంటతో పంట మార్పిడి చేయడం ద్వార తెలుగును నివరించవచ్చున్నాలరు.

## ఘనంగా కేరళాహైస్కూలు క్రీడాదినోత్సవ వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**



స్థానిక కోటవీధిలోని కేరళాహైస్కూలు వారి క్రీడాదినోత్సవ వేడుకలు సెయింటధెరిస్సా హైస్కూల్ ప్రాంగణంనందు శుక్రవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్న డిఎస్ పాల్ విద్యార్థులకు క్రీడా పోటీలను షార్ట్‌పుట్ విసిరి ప్రారంభించారు. అనంతరం ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో పాల్గొని, క్రీడల ద్వారా శారీరక ధారుడ్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయని, స్నేహభావం పెంపొందుతుందన్నారు.గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు.విద్యార్థులు క్రీడలు, చదువులలో మంచి ప్రతిభ కనపరచి, తద్వారా పాఠశాలలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని సందేశమిచ్చారు. ఈ క్రీడాదినోత్సవ వేడుకలు 19,20 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ సిబి మైఖెల్ ఫిజికల్ డైరెక్టర్ వెంకట్రావ్, అధ్యాపకులు పాల్గొన్నారు.




# ప్రకాశం

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## సురక్షిత నీరు ప్రజలకు అందించాలి: జడ్పీ సీఈఓ చిరంజీవి

**కొత్తపట్నం, డిసెంబర్ 19, ప్రభాతవార్త**



కొత్తపట్నం మండలం ఆలూరు గ్రామపంచాయతీ పరిధిలో సేవ్ వాటర్ మంత్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అందించే మంచినీటిని పరిశీలించడం జరిగింది. ప్రజలకు సురక్షితమైన మంచినీటిని అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. మంచినీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి, వైపు లైన్ల లీకేజ్ ఎప్పటికప్పుడు రిపేరు చేసి వ్యర్థం కాకుండా చూడాలని తెలియజేశారు. మంచినీటిని పరీక్ష చేయడం జరిగింది. పరీక్ష చేసిన వాటర్ పై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకర్రావు, డిఈ రామ్మోహన్‌రావు, ఏఈఈ వంశీకృష్ణారెడ్డి, కొత్తపట్నం ఎంపీడీవో శ్రీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో మూర్తి, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి







- ఎన్నికల హామీలను 18 నెలల్లోనే అమలు చేశాం
- రాజకీయాలకు అతీతంగా విద్యారంగంలో సంస్కరణలు
- అద్దంకి నియోజకవర్గంలో విద్యార్థులకు ఉచితంగా 5,542 సైకిళ్ల పంపిణీ
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్
- పేదరికం లేని సమాజమే మహా కూటమి లక్ష్యం
- మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి

**బల్లికురవ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం, పేదరికం లేని సమాజం నిర్మించడమే లక్ష్యంగా ముందుకుపోతుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామిలు అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆంధ్ర రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. శుక్రవారం మండలంలోని వైదన గ్రామంలో మంత్రి గొట్టిపాటి, సహచర మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామితో కలిసి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా రూ.73లక్షలతో ఆధునీకరించిన సాంఘిక, సంక్షేమ బాలుర వసతి గృహాన్ని మంత్రులిద్దరూ ప్రారంభించి సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ తరువాత వైదన గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన డ్రైనేజీ కాలువలను ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ పాఠశాలలో రూ.10లక్షలతో నిర్మించిన ప్రహరి గోడను ప్రారంభించారు. అదే గ్రామంలో దాతల సహకారంతో రూ.50లక్షలతో నిర్మించిన ముస్లిం కమ్యూనిటీ హాల్‌ను ప్రజలకు అంకితం చేశారు. వైదన జిల్లా పరిషత్ పాఠశాలలో 199 మంది విద్యార్థులకు దాతల సహాయంతో ఉచితంగా సైకిళ్లను మంత్రులు గొట్టిపాటి, డోలా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ.. మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో విద్యా రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. దూరం ఎక్కువగా ఉండే కారణంతో విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, అద్దంకి నియోజకవర్గంలో ఇప్పటి వరకు 5,542 మంది ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజ్ విద్యార్థినీ, విద్యార్థులకు దాతలు ఎస్ఎస్ఆర్, అసిస్ట్ నిధులతో సైకిళ్లను ఉచితంగా అందించామని ఆయన తెలిపారు. రాజకీయాలకు సంబంధం లేకుండా, రాజకీయ నాయకుల పేర్లు, పార్టీ గుర్తులు లేకుండా విద్యార్థులందరికి యూనిఫాం, బ్యాగులు, పుస్తకాలతో పాటు షూలు కూడా పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రతి పాఠశాలలోనూ మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. టీచర్ల కొరత తీర్చేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు మెగా డీఎస్సీ ద్వారా ఒకేసారి 16,300 ఉపాధ్యాయ పోస్టులను కూటమి ప్రభుత్వంలో భర్తీ చేశామని వెల్లడించారు. పిల్లలు అందరూ కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు వెళ్లాలని మంత్రి గొట్టిపాటి ఆకాంక్షించారు. అదే విధంగా వార్డెన్లు అందరూ విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవాలని హితవు పలికారు. వైదనలో అంగన్‌వాడీ సభ్యులకు మంత్రులు గొట్టిపాటి, డోలా 5జీ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి డోలా మాట్లాడుతూ సాంఘిక, సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎస్సీ హాస్టల్స్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతం మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. పెన్షన్లు, ఉచిత బస్, రైతుకు ఆర్థిక సహాయం, పిల్లల చదువులకు చేయూత వంటివి ఎన్నో చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ రహదారులు అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రోడ్లను దమ్ము ట్రాక్టర్లతో తొక్కించేస్తున్నారని, దీంతో సంవత్సరానికే రోడ్లు ధ్వంసం అవుతున్నాయని మంత్రి గొట్టిపాటి అసహనం వ్యక్తం చేశారు. వాటికి రబ్బరు తొడుగులు వేసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధితో పాటు, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన విధ్వంసం గురించి కూడా ప్రజలు ఆలోచించాలని మంత్రి గొట్టిపాటి కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు మల్లీనీడి గోవిందరావు, మందలపు సుధాకర్, తహసీల్దార్ రవి నాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, సీఐ వెంకటరావు, ఎస్సైలు నాగరాజు, పట్టాభి, ఎస్కే సైదా, పంచాయతీ రాజ్ ఏఈ మాధవ్, సహకార సంఘం అధ్యక్షులు గొట్టిపాటి లక్ష్మయ్య, ఎంఈఓలు కే.శ్రీనివాసరావు, కే.రమేష్‌బాబు, మహా కూటమి నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# ఇదే స్ఫూర్తి రెట్టింపు ఉత్సాహంతో మున్ముందు పనిచేయండి


*- ఏబిసిడి అవార్డు గ్రహీతలను అభినందించిన జిల్లా ఎస్పీ. హర్షవర్ధన్ రాజు*

**సంతనూతలపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

కీలక కేసుల దర్యాప్తులో రాష్ట్ర స్థాయి గుర్తింపు తెచ్చిన స్ఫూర్తితో, రెట్టింపు ఉత్సాహంతో మున్ముందు కూడా పని చేయాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామానికి చెందిన ముప్పవరపు వీరయ్య చౌదరిను, గత ఏడాది ఏప్రిల్ 22వ తేదీ రాత్రి సుమారు 7.30 గంటల సమయంలో ఒంగోలు బైపాస్ రోడ్ లోని తన కార్యాలయంలో దుండగులు హత్య చేశారు. కాగా మృతుడు ముప్పవరపు వీరయ్య చౌదరికి చెందిన కార్యాలయంలో మద్యం షాపుల లెక్కలు తమ అకౌంటెంట్స్ లతో చూస్తున్న సమయంలో, నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు స్కూటీ మోటార్ సైకిల్ పై వచ్చి వీరయ్యను కత్తులతో విచక్షణ రహితంగా పొడిచి, కేకలు వేసిన అకౌంటెంట్ లను ఆఫీస్ లోని సిబ్బంది ని బెదిరించి, అక్కడనుండి పారిపోయిన విషయం పాఠకులకు విధితమే. ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ నందు దీనిపై కేసు నమోదు చేశారు. తదుపరి పోలీస్ శాఖ,లోతుగా దర్యాప్తు చేసి, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ముద్దాయిల అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపటం జరిగింది. దీనిపై ఈ నెల 19వ తేదీ శుక్రవారం నాడు మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అవార్డు ప్రధాన కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, చేతుల మీదుగా, గుంటూరు రేంజ్ ఐజీ సర్వ శ్రేష్ట త్రిపాఠి, సమక్షంలో ఏబిసిడి అవార్డు ప్రదానం చేయటం జరిగినది. కేసులో అత్యుత్తమ విధులు నిర్వహించిన పోలీసు అధికారుల నేతృత్వంలో చేపట్టిన సమగ్ర దర్యాప్తు ఫలితంగా ప్రకాశం జిల్లా పోలీసు శాఖకు ఈ అవార్డు లభించింది.ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ప్రస్తుతం విజయనగరం జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఏ.ఆర్. దామోదర్, ఐపీఎస్, ఒంగోలు డిఎస్పీ ఆర్. శ్రీనివాసరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ యు. సుధాకర్, ప్రస్తుత ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యస్. జగదీష్, డీటీసీ ఇన్స్పెక్టర్ వై. పాండురంగారావు, గతంలో చీమకుర్తి ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన యం. సుబ్బారావు, సోషల్ మీడియా సెల్ ఇన్స్పెక్టర్ వి. సూర్యనారాయణ, సంతనూతలపాడు సబ్ ఇన్స్పెక్టర్ వేజెండ్ల అజయ్ బాబులు ఈ అవార్డులను అందుకున్నారు. ఇలాంటి కేసులను సమర్థవంతంగా పరిష్కరించినప్పుడే ప్రజల్లో పోలీసు శాఖపై గౌరవం మరింత పెరుగుతుందని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. ఈ అవార్డును స్ఫూర్తిగా తీసుకొని, జిల్లా పోలీసులు భవిష్యత్తులో కూడా మరిన్ని కేసులను సమిష్టిగా, సమర్థవంతంగా ఛేదించాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తుల్లో అత్యంత ప్రతిభ కనపరచడాన్ని గుర్తించి ప్రతిష్టాత్మకంగా ప్రతీ మూన్నెళ్లకు ఒకసారి ప్రకటించే ఏబిసిడి (అవార్డు ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్) అవార్డు జిల్లాకు దక్కడం. అందునా రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం విశేషమన్నారు. జిల్లా పోలీసుశాఖ సాధించిన ఈ ఘనత మరింత బాధ్యతతో ప్రజల భద్రత కోసం పనిచేయడానికి ప్రేరణగా నిలవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆకాంక్షించారు.



# వెనుకబడిన ప్రకాశం జిల్లా




**ఒంగోలు, ప్రభాతవార్త**

సీఎం చంద్రబాబు ప్రకటించిన వివిధ ర్యాంకుల్లో ప్రకాశం జిల్లా అనేక విభాగాల్లో వెనుకబడింది. ఒంగోలు కార్పొరేషన్‌తో పాటు 6 మున్సిపాలిటీల్లో రూ.71.19 కోట్ల పన్నులు రావాల్సి ఉండగా, కేవలం రూ.37.11 కోట్లు మాత్రమే వసూళ్లు చేయడంతో రాష్ట్రంలో జిల్లా 19వ స్థానంలో నిలిచింది. నీటి పన్ను వసూళ్లలో రూ.27.10 కోట్లకు గాను రూ.3.64కోట్లు వసూలై 22వ ర్యాంకు సాధించింది. ప్రపంచ వ్యాప్తంగా శిలాజ ఇంధనాల వాడకం తగ్గి. ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన వనరుల వాడకం పెరుగుతుండడంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం భారత్‌కు ముఖ్యమైన ఆస్తిగా మారింది. కోరమండల్ తీరం ప్రస్తుతం భారత్‌కు బంగారు బాతు లాంటిదే. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు విస్తరించి ఉన్న తీర ప్రాంత ఇసుకలో లభించే అరుదైన ఖనిజాలు ఉన్నాయి. ఇవి ఇండియా క్లీన్ ఎనర్జీ టార్గెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. ఆంధ్రప్రదేశ్ తీరంలో లభించే మోనజైట్, ఇల్మెనైట్, రూటిల్ వంటి ఖనిజాలు కేవలం సాధారణ ఇసుక కాదు. భౌగోళిక సర్వేల ప్రకారం, ఉత్తరాన భీమునిపట్నం, కళింగపట్నం నుండి దక్షిణాన రామాయపట్నం, దుగరాజుపట్నం వరకు ఈ ఖనిజ సంపద ఒక నిరంతర కారిడార్‌గా విస్తరించి ఉంది. ముఖ్యంగా ఇక్కడ లభించే మోనజైట్లోలో 55-60శాతం అరుదైన ఖనిజ ఆక్సైడ్లు, 8-10శాతం థోరియం ఉన్నాయి. థోరియం అనేది భారత తదుపరి తరం అణు రియాక్టర్లకు ప్రధాన ఇంధనంగా పరిగణించబడుతోంది. నేడు మనం వాడుతున్న అత్యాధునిక సాంకేతికతకు ఈ ఖనిజాలే ప్రాణం. ఈవీ మోటార్లలో వాడే శక్తివంతమైన శాశ్వత అయస్కాంతాల తయారీకి నియోడైమి యం వంటి మూలకాలు అవసరం. గాలి మరల జనరేటర్లలో వీటి వినియోగం తప్పనిసరి. సెమీకండక్టర్లు, మొబైల్ ఫోన్లు, రక్షణ రంగ పరికరాల తయారీలో ఇవి కీలకమైనవి. ప్రస్తుతం ఈ ఖనిజాల సరఫరాలో చైనా గుత్తాదిపత్యం వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఈ రకమైన ఖనిజాలకు నిలయంగా మారడం వల్ల చైనాపై ఆధారపడటం గణనీయంగా తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కారిడార్‌ను అభివృద్ధి చేసేందుకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. నెల్లూరు జిల్లా గూడూరులో ప్లాంట్ ఇండియన్ రేర్ ఎర్త్స్ లిమిటెడ్ నెల్లూరులో ఏడాదికి 10వేల టన్నుల సామర్థ్యం గల మోనజైట్ ప్రాసెసింగ్ ప్లాంటును నిర్మిస్తోంది. ఇది 2026 నాటికి కార్యరూపం దాల్చనుంది. అరుదైన ఖనిజాల ఆధారిత అయస్కాంతాల తయారీని ప్రోత్సహిం చేందుకు కేంద్రం రూ.7.,280 కోట్లతో ప్రత్యేక ప్రోత్సాహక పథకాన్ని ప్రకటించింది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్ హబ్‌గా మారుతున్న విశాఖ, కాకినాడ ప్రాంతాలకు ఈ ఖనిజాల కారిడార్ వెన్నముకగా నిలవనుంది. ఖనిజాల వెలికితీతో పర్యావరణ పరిరక్షణ, తీర ప్రాంత రక్షణ ఒక సవాలుగా ఉన్నప్పటికి, అధునాతన సాంకేతికతతో ఈ సంపదను వినియోగించుకుంటే ఆంధ్రప్రదేశ్ భారతదేశ క్లీన్ ఎనర్జీ గేట్వేగా మారుతుందనడంలో సందేహం లేదు. 2047 నాటికి భారత్ వికసిత్ భారత్‌గా ఎదగడంలో ఈ తీర ప్రాంత ఖనిజాలే గమనాన్ని నిర్ణయించనున్నాయి.

6_6.qxd 12/20/2025 12:21 AM Page 1



## క్రీస్తు బోధనలు సర్వత్రా మానవాళి ఆచరణీయం

**- టిడిపి మండల అధ్యక్షులు చేవూరి వాసురెడ్డి**

**- మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు**



**సంతమాగులూరు ,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ఏసుక్రీస్తు బోధనలు సమస్త మానవాళి ఆచరించదగినవని సంతమాగులూరు మండల టిడిపి అధ్యక్షులు చేవూరి వాసు రెడ్డి అన్నారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మండల కేంద్రమైన సంతమాగులూరు మండల సమాఖ్య సమావేశం మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తేలప్రోలు రమేష్, మండల టిడిపి అధ్యక్షులు చేవూరి వాసు రెడ్డి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి గద్దల జ్యోతిర్మయి,వెలుగు ఏపిఎం హనుమంతరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాసు రెడ్డి మాట్లాడుతూ పాపులను క్షమించమని తోటి వారిని ప్రేమించమని తెలిపే క్రీస్తు బోధనలు సర్వ సమాజాన్ని మంచి వైపు నడుపుతాయన్నారు.

**మహిళా సమాఖ్య పార్టీలకతీతంగా సేవలందించాలి**



మండల మహిళా సమాఖ్య విధి నిర్వహణలో ఎటువంటి రాజకీయ జోక్యం లేదని సమాజ సమగ్రాభివృద్ధికి మహిళా సమాఖ్య పనిచేయాలని వాసు రెడ్డి పిలుపునిచ్చారు.సమాజ సమగ్ర అభివృద్ధిలో మహిళల కీలక పాత్ర అని మహిళా అభివృద్ధి సమగ్రఅభివృద్ధిగా భావించే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్లు తగిన విధంగా మహిళలకు ప్రోత్సాహం అందిస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలోసంతమాగులూరు తెలుగు బాప్తిస్ట్ ప్రారధనామందిర బోదకులు పులిచర్ల యానాదిరెడ్డి ప్రత్యేక ప్రారధనలు చేయగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నాగబోతు సుజాత,ప్రకృతి వ్యవసాయ ఏడిపిఎంమోహన్, మండల వ్యవసాయ అధికారి షేక్ సైదా, ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ టి శిరీష, దిండు సుబ్బారావు, మండలంలోని అన్ని గ్రామాల వివోఏలు, ప్రకృతి వ్యవసాయ సీఆర్పీలు పాల్గొన్నారు.

### తల్లి తండ్రి ఉపాధ్యాయులుగా మొదటి సంతకం చేసిన పాఠశాలలో

**తను బలపం పట్టిన విద్యార్థుల నడుమ ధీరజ్ రెడ్డి జన్మదిన వేడుకలు**



**సంతమాగులూరు ,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

విదేశాలలో స్థిర ఉద్యోగం చేస్తున్న ఓ యువకుడు తన తల్లి తండ్రి ఉపాధ్యాయులుగా మొట్టమొదట బాధ్యతలు స్వీకరించిన పాఠశాల, తాను మొట్టమొదట పలక పట్టి అక్షరం దిద్దిన పాఠశాల విద్యార్థుల నడుమ నేడు తన జన్మదిన వేడుకలు జరపాలని కోరుకున్నాడు. కుమారుని ఆశయం గొప్పది కావడంతో తల్లితండ్రులు కూడా ఆ పాఠశాల లో తన బిడ్డ కోరిక మేరకు జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిపారు. సంతమాగులూరు కాలనీ ప్రాథమిక పాఠశాలలో మొటాటి ప్రభాకర్ రెడ్డి,ప్రభావతి భార్యాభర్తలిద్దరూ అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా మొదటి ఉద్యోగ బాధ్యతలతో సంతకం పెట్టారు. అదే పాఠశాలలో తమ కుమారుడు ధీరఁజ్ రెడ్డి కూడా అక్షరాభ్యాసం చేశారు. ఆ తరువాత ఉద్యోగ బాధ్యతలలో పలు పాఠశాలకు బదిలీ కావడం తమ బిడ్డ ఉన్నత చదువుల కోసం దేశ విదేశాలకు వెళ్లడం సర్వసాధారణంగా జరిగిపోయాయి. ప్రస్తుతం ప్రభాకర్ రెడ్డి ఆయన భార్య ప్రభావతి ఇద్దరూ కూడా పదవి విరమణ పొందారు. తమ కుమారుడు ధీరజ్ రెడ్డి అమెరికాలో స్థిర ఉద్యోగం చేస్తున్నాడు.దీరజ్ రెడ్డి తన జన్మదిన వేడుకలను తాను అక్షరాభ్యాసం చేసిన తన తల్లిదండ్రుల ఉద్యోగ బాధ్యతలు ప్రథమంగా స్వీకరించిన పాఠశాలలో జరపాలని కోరారు. ధీరజ్ కోరిక మేరకు సంతమాగులూరు కాలనీ పాఠశాలలో శుక్రవారం ధీరజ్ తల్లితండ్రులు సహ ఉపాధ్యాయులు మండల ఉపాధ్యాయశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు విద్యార్థుల నడుమ ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వేమవరపు కోటేశ్వరరావు, దినేష్ కుమార్, వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు సహ ఉపాధ్యాయులు సంతమాగులూరు లోని మూడు ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షా ఫలితాల కార్డుపై అవగాహన



**హనుమంతునిపాడు ,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలంలోని హనుమంతాపురం, లింగంగుంట్ల, కొండారెడ్డిపల్లి, హనుమంతునిపాడు గ్రామాల్లో శుక్రవారం భూసార పరీక్షా ఫలితాల కార్డుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్సీ వ్యవసాయాధికారి వివి శేషమ్మ పాల్గొని భూసార పరీక్షా ఫలితాల కార్డు, నేల ఆరోగ్యం గురించి వివరించి వీటి ఆధారంగా వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, సేంద్రియ, జీవన ఎరువుల ప్రాముఖ్యత, వాటి వాడకం, పంట అవశేషాలను కాల్చడం వలన కలిగే నష్టాలు గురించి వివరించారు. తదుపరి మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ వ్యవసాయ పథకాల గురించి వివరించారు.నేల ఆరోగ్యం, భూసార పరీక్షా విధానం, ఫలితాల వివరణ, సమస్యాత్మక భూములను బాగు చేయుట, జీవన ఎరువుల గురించిన కరదీపికలను రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

## హిందూ - ముస్లింల కలయిక తిరూపాలైన అష్ఫాఖ్

**- రాంప్రసాద్ బిస్మిల్‌ల సంస్మరణ**



**మార్టూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ఆంగ్లేయులచే 1927 డిసెంబర్ 19న ఉరి తీయబడిన రోజు సందర్భంగా గన్నవరం రోడ్డు మార్టూరులో సీపీఐ రెడ్ స్టార్, ముస్లిం చైతన్య వేదిక ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ రెడ్ స్టార్ కేంద్ర కమిటీ సభ్యులు మహ్మద్ భాషా మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య చరిత్రలో అగ్నియుగం నాటి విప్లవ పోరాట యోధులు అష్ఫాఖ్- రాం ప్రసాద్ బిస్మిల్ మధ్య స్నేహ బంధం త్యాగపూరితమైంది. మత ధర్మాలను బట్టి ఇద్దరి ధార్మిక బాటలు వేర్వేరుగా ఉన్నప్పటికి బ్రిటీష్ పాలకుల కబంద హస్తాల నుండి మాతృభూమిని విముక్తి చేయాలన్న తిరుగులేని వారి సంకల్పం ఇద్దరి మార్గాన్ని ఏకం చేసింది. ఆనాటి స్నేహబంధం ఈనాటికి ఆదర్శనీయంగా హిందూ- ముస్లింల ఐక్యతకు చిహ్నంగా నిలిచింది. మతాలకు అతీతంగా వ్యవహరించిన అష్ఫాఖ్- బిస్మిల మిత్రద్వయం కలిసి మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొనటమే కాకుండా కంటక ప్రాయమైన వారి మార్గంలో ఎదురైన అన్ని కష్టనష్టాలతో పాటు చివరకు ఉరి శిక్షణలను కూడా సంతోషంగా స్వీకరించి చిరస్మరణీయులు అయ్యారన్నారు. వారి త్యాగ స్ఫూర్తి నేటి హిందూ - ముస్లిం యువతకు ఎంతో ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఐక్య వేదిక ఉమ్మడి ప్రకాశం జిల్లా కన్వీనర్ దేవరపల్లి రాము, అంబేద్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షుడు మైలా నాగేశ్వరరావు, పఠాన్ వలి, పఠాన్ బాబు, షేక్ ఆదంబి, నాగేంద్ర, కరిముల్లా, దాసు తదితరులు పాల్గొన్నారు.

### యర్రగొండపాలెం అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ



**యర్రగొండపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, ఎంపీడీవో బండారు శ్రీనివాసరావు, సీడీపీవో హేమలత భాస్కర్ ముఖ్యఅతిధులుగా పాల్గొని పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాలకు చెందిన 256 మంది అంగన్‌వాడీ టీచర్లకు 5 జీ మొబైల్ ఫోన్లు అందజేశారు. పరిపాలన సౌలభ్యం కోసమే ఈ ఫోన్లు అందిస్తున్నట్లు సీడీపీవో హేమలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చిట్యాల వెంగల్‌రెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

### మోదేపల్లి మేజర్‌పై ఇరిగేషన్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ పర్యటన



**ముండ్లమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని మోదేపల్లి మేజర్ పరిధిలోని శంకరాపురం, కొటికలపూడి, కుంకుపాడు సాగర్ కాలువపై శుక్రవారం జిల్లా ఇరిగేషన్ అధికారి ఎస్ఈ డి.వరలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ మోదేపల్లి మేజర్ పరిధిలో వారబంది ద్వారా ప్రస్తుతం వస్తున్న సాగర్ నీటిని రైతులు వారబంధి పద్దతిలో జాగ్రత్తగా ఆరుతడి పంటలకు వినియోగించుకోవాలని రైతులకు ఆమె సూచించారు. ప్రస్తుతం వారబంధి ద్వారా 312 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారని అన్నారు. ఈ నీటిని ఆరుతడి పంటలకు చివర భూములు గల రైతులు జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో దర్శి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ యు.విజయలక్ష్మి, సహాయక ఇంజనీర్ వై.విజయరత్నం, డివిజన్ సహాయక కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి, ఇతర ఫీల్డ్ సిబ్బంది ఉన్నారు.

## శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమం



**దర్శి, డిసెంబర్19, ప్రభాతవార్త**

ప్రస్తుత పంటల్లో చీడ పీడలు వాటి యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యలపై శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఆత్మ డైరక్టర్ అయిన రత్న మంజుల ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా కేవీకే హెడ్ డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ రైతులు ప్రస్తుత పరిస్థితులలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని వాటికి సంబంధించిన మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. అదే విధంగా వ్యవసాయ పరిశోధన స్థానం, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ రైతులు చెప్పిన సమస్యలకు మేలైన సస్యరక్షణ పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమాన్ని హాజరైన ఆత్మ ప్రకాశం జిల్లా, ప్రాజెక్టు డైరక్టర్ రత్న మంజుల జిల్లాలో జరుగుతున్న ఆత్మ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో దర్శి సబ్ డివిజన్ వ్యవసాయ సంచాలకులు బాలాజీనాయక్ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు, 8 మండలాల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా

**విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు**



**ముండ్లమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం ముండ్లమూరు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థమైన, సత్వర న్యాయం అను అంశంపై తెలుగు, ఇంగ్లీష్ భాషలలో వక్తృత్వం, వ్యాసరచన పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలకు మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల నుండి 43 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలలో వ్యాసరచన విభాగంలో తెలుగు మీడియం నందు కేజీబీవీ ముండ్లమూరు విద్యార్థిని జి.కృష్ణ లావణ్య 9వ తరగతి ప్రథమ స్థానం పొందారు. అదే విధంగా విక్తృత్వపు పోటీల నందు తెలుగు మీడియం విభాగం నుండి కేజీబీవీ ముండ్లమూరు విద్యార్థిని ఎం.అనుప్రియ, 8వ తరగతి ప్రథమ స్థానం పొందగా ఇంగ్లీష్ మీడియం విభాగం నందు డి.ప్రశాంతి 8వ తరగతి, జడ్పీహెచ్ఎస్ ఉమామహేశ్వరపురం విద్యార్థిని ప్రథమ స్థానం సాధించారు. విజేతలను ఎంఈఓ శ్రీ షేక్ కాలేషావలి,ఈ కార్యక్రమానికి విచ్చేసిన పలు పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ షేక్ కాలేషావలి మాట్లాడుతూ డిసెంబర్ 18 నుంచి 24వ తేదీ వరకు జాతీయ వినియోగదారుల వారోత్సవాలు జరుగుతున్నాయని పాల్గొనాలన్నారు.

### 17వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య



**దర్శి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

దర్శి మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య గురువారం పర్యటించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.వార్డులో సైడ్ డ్రైన్స్‌ను నిర్మిస్తుండగా పనులను పరిశీలించారు. సీసీ రోడ్ల కొంత మేర అవసరం ఉండడంతో వాటిని పరిశీలించారు. పలు చోట్ల వీధి లైట్లను ఏర్పాటుకు అధికారులు ఆదేశించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమీషనర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఏఈ శ్రీరామ్‌మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుభాని, దినకర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**- సీపీఎం**




**ముండ్లమూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ఉపాధి హామీ చట్టాన్ని పార్లమెంట్‌లో బిల్లు పెట్టి రద్దు చేసిన ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలు పేదల కడుపు కొట్టాయని సీపీఎం మండల కార్యదర్శివెల్లంపల్లి ఆంజనేయులు ముండ్లమూరులోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు నిరసన తెలియజేశారు.అనంతరం మండల జాతీయ ఉపాధి హామీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం గ్రామీణ పేదల కోసం వచ్చిన అతి కొద్ది చట్టాల్లో ఉపాధి హామీ చట్టం ఒకటి. ఈ చట్టం భాగా అమలు జరిగిన చోట పెద్దలు వలసలు తగ్గాయి. కొనుగోలు శక్తి పెరిగింది. కాబట్టి దీన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంటా ఏడుకొండలు, సత్యం, మీరావలి, నారాయణ, రామాంజనేయులు, ఎం.రామాంజనేయులు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ఏసుక్రీస్తు మార్గం అందరికి అనుసరణీయం

**- ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్**



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ప్రపంచ శాంతి స్వరూపుడు ఏసుక్రీస్తు అందరికి అనుసరణీయమని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ అన్నారు. ఉప్పుగుండూరు తెలుగు బాప్టిస్టు చర్చి క్రిస్టియన్ యూత్ సంఘ పెద్దలు ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. క్రీస్తు పుట్టుక ద్వారా ప్రపంచంలోనే శాంతి నెలకొందని సమాజంలో మానవుడి నడవడికకు కావాల్సిన అన్ని రకాల సూక్తులు బైబిల్‌లో లిఖించబడ్డాయని దీనిని ప్రతి ఒక్కరు ఆచరిస్తే అందరికి మేలులు జరుగుతాయని ఆయన తెలిపారు. క్రీస్తు చెప్పిన నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించు అన్న మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సెమీ క్రిస్మస్ ఘనంగా జరుపుకున్న తెలుగు బాప్టిస్టు సంఘ పెద్దలు, క్రిస్టియన్ యూత్‌ను ఆయన అభినందించారు. గ్రామంలో తెలుగు బాప్టిస్టు చర్చి కొత్తగా నిర్మాణం జరపాలని ప్రస్తుతం ఉన్నది శిధిలావస్థకు చేరిందని కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన మాట్లాడుతూ ఉప్పుగుండూరులో ఈ పాటికి కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు మొదలు పెట్టి జరుగుతున్నాయని అదే విధంగా సంఘ పెద్దలు కాలనీ వాసులు అందరూ ఐక్యంగా ఉంటే చర్చి నిర్మాణం చేయించే బాధ్యతను తీసుకొని సత్వరమే పూర్తి చేస్తానని సభాముఖంగా ఆయన హామీ ఇచ్చారు. అందరికి ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు తేళ్ళ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ పండుగ అని , ఈ పండుగ వేడుకలు ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. సీనియర్ జర్నలిస్టు గద్దె త్యాగరాజు అధ్యక్షతన జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలలో సంఘ పాస్టర్ డాక్టర్ రెవ తెలగలపూడి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు జరిపి ఎమ్మెల్యే చేతుల మీదుగా కేక్ కట్ చేయించి పంచి పెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు క్రైస్తవ గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘాల అధ్యక్షులు పాస్టర్ రెవ తేళ్ళ దైవాదీనం, సెక్రటరీ శేఖర్‌బాబు, ఏబీఎన్ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ టీఎఎస్ఎస్, సింగ్ మాస్టర్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు గద్దె శేషయ్య, గ్రామ టీడీపీ అధ్యక్షులు కనగాల శ్రీనివాసావు, సొసైటీ చైర్మన్ కాట్రగడ్డ బాబు, సొసైటీ డైరక్టర్లు పెంట్యాల శ్రీనివాసరావు, మసి ముక్కు భాస్కరరావు, టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు కూతంబాకం సెల్వం, ఎస్టీసెల్ అధ్యక్షులు నాగమల్లేశ్వరరావు, క్రిస్టియన్ యూత్ కత్తి పవన్, రాజేష్, సురేష్‌లతో పాటు యూత్ సభ్యులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

**తిరుమలగిరి పాఠశాలలో పని చేస్తున్న ఆయమ్మకు సన్మానం చేసిన ఎంఈఓ బృందం**



**యర్రగొండపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

యర్రగొండపాలెం మండల ఎంఈఓ ఆంజనేయులు పట్టణంలోని జీపీఎస్ తిరుమలగిరి కాలనీలోని పాఠశాలలో పని చేస్తున్న ఆయమ్మ కుమారికి సన్మానం చేశారు. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా పాఠశాలను శుభ్రంగా అందంగా తీర్చిదిద్దడంలో ఆమె పాత్ర చాలా గొప్పదని,చక్కని విధి నిర్వహణలో అందరికి ఆదర్శంగా ఉందని ఎంఈఓ ఆంజనేయులు కొనియాడారు. సంక్రాంతి పండుగ ప్రారంభమవ్వడంతో ముందస్తు ముగ్గులతో పాఠశాల ఆవరణం తీర్చిదిద్దడంతో పాఠశాల సిబ్బంది అందరూ ఆమె పని తీరును ప్రశంసించారు. ఆమె పాఠశాలకు చేస్తున్న సేవలను కీర్తించారు. పాఠశాల సిబ్బందితో కలిసి పూలదండను వేసి దుశ్శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓతో పాటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌నాయుడు, ఎన్ఎస్ఎస్ రామకోటయ్య, హెచ్ఎం నాగమల్లేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### నూతన సంవత్సర వేడుకల కొరకు స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర



**హనుమంతునిపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని హాజీపురం పరిధిలో గల సోషల్ పార్క్‌ను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సందర్శించి నూతన సంవత్సర ఎడుకల కొరకు స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, హనుమంతునిపాడు మండల టీడీపీ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, పామూరు పీఏసీఎస్ చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, దొడ్డిచింతల సర్పంచ్ సానికొమ్ము బ్రహ్మారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు బలసాని కోటయ్య తదితర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## గిరిజన చిన్నారుల అభివృద్ధికి ఆదరణ అవసరం



**సింగరాయకొండ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

గిరిజన చిన్నారుల సమగ్ర అభివృద్ధికి సమాజం ఆదరణ అవసరమని న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు అన్నారు.శానంపూడి గ్రామానికి చెందిన తొట్టెంపూడి అంకయ్య వర్థంతి సందర్భంగా శుక్రవారం మనవడు తొట్టెంపూడి సుబ్బరాయుడు మండలంలోని పాత సింగరాయకొండ,తాతయ్య గిరిజనకాలనీలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శానంపూడి గ్రామానికి చెందిన యువత గత 15 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్నారని తెలిపారు. ఉద్యోగరీత్యా వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న యువత కూడా తమవంతు సహాయ సహకారాలు అందించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.చిన్నారులకు విద్యతో పాటు పోషకాహారం ఎంతో అవసరమని, మొక్కకు నీరు ఎంత ముఖ్యమో,ఎదిగే దశలో పిల్లలకు పోషకాహారం అంతే ముఖ్యమని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని కత్తి మాధురి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన అవసరం

**సింగరాయకొండ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి స్థాయికి అనుగుణంగా బోధన అందించాల్సిన అవసరం ఉందని తరల్ జిల్లా సమన్వయకర్త చుండూరి కిషోర్ బాబు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం సింగరాయకొండ మండలంలోని గవదగట్లవారిపాలెం ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలను ఆయన, మండల విద్యాధికారి-2 ఆవుల శ్రీనివాస్ (MEOÐ2)తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న ఫౌండేషనల్ లిటరసీ న్యూమరసీ (FLN) 75 రోజుల కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఉపాధ్యాయులతో చర్చించి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస స్థాయి, రోజువారీ కార్యాచరణపై వివరాలు తెలుసుకున్నారు.అలాగే విద్యార్థులతో మమేకమై చదవడం, వ్రాయడం, లెక్కలపై ప్రశ్నలు వేసి వారి ప్రతిభను పరిశీలించారు. నీలివి కార్యక్రమం ద్వారా విద్యార్థుల మౌలిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలు మెరుగుపడుతున్నాయని అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్న పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో విద్యార్థుల అభ్యాస ఫలితాలు మరింత మెరుగుపడేలా కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలోప్రధానోపాధ్యాయులు అర్రిబోయిన రాంబాబు,ఉపాధ్యాయులు అజయ్ కుమార్, సి.ఆర్.పి వంశీ పాల్గొన్నారు.

### చంద్రబాబునాయుడు పాలనలోనే

## అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత





**పొన్నలూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

చంద్రబాబు నాయుడు పాలనలోనే అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత లభిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. తూర్పు నాయుడుపాలెం క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఐసీడీఎస్ సిబ్బందికి 5జీ స్మార్ట్ ఫోన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూచంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే అంగన్వాడీ సిబ్బంది వేతనాలు పెరిగాయని,గతంతో పోలిస్తే అంగన్వాడీ కార్యకర్తలకు గౌరవం, ఆర్థిక భద్రత పెరిగిందన్నారు. రాష్ట్రంలో 5వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. గర్భిణులు, బాలింతలు,చిన్నారుల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని, అందులో భాగంగా అంగన్‌వాడీ వ్యవస్థలో ప్రభుత్వం స్మార్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టిందన్నారు.సేవల్లో వేగం, పారదర్శకతకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని,అందులో భాగంగా అంగన్ వాడీ సిబ్బందికి స్మార్ట్ ఫోన్లను అందించడం జరిగిందన్నారు.

### పాఠశాలలను తనిఖీ చేసిన మండల అకాడమిక్ ఫోరం



**మార్టూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాలలో పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి ఎంసీహెచ్ వస్త్రామ్ నాయక్ ఆధ్వర్యంలో మండల అకాడమిక్ ఫోరం తనిఖీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మొదటిగా బొబ్బేపల్లి గ్రామంలోని హెచ్ఈ మోడల్ ప్రాథమిక పాఠశాలను, తదుపరి రాజుగారిపాలెం గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖ అధికారి, సబ్జెక్టు నిపుణులు పాఠశాలలోని విద్యార్థుల ఎఫ్ఎల్ఎన్ ప్రకారం విద్యా సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలన చేసిన, పాఠశాల సిబ్బందికి తగు సూచనలు చేశారు.తనిఖీ అనంతరం సంబంధిత నివేదికలను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 కే.ప్రేమలత, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రంగస్వామి, ఫణి, పద్మకుమారి, ప్రైమరీ ఫోరమ్ సభ్యులు శ్రీరామమూర్తి, కే.రామాంజనేయులు, బి.యోహోషువ, ఐ.శంకరరావు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**సంతమాగులూరు, డిసెంబర్ 19 ,ప్రభాతవార్త**

అద్దంకి - నార్కెట్‌పల్లి రహదారిలో సంతమాగులూరు మండలం ఏల్చూరు శివారు రామిరెడ్డి పాలెం వద్ద శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన సోమ సోమిరెడ్డి రోడ్డు వెంబడి వెళ్తుండగా కారు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షత గాత్రుని వెంటనే ఏల్చూరి టోల్ ప్లాజా అంబులెన్స్‌లో నరసరావుపేటలోని ఆసుపత్రికి తీసుకొని వెలాగా ఆయన అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు చెప్పారు .

## డిజిటల్ సేవలతో అంగన్‌వాడీలు మరింత బలోపేతం

**- సీఎం చంద్రబాబు కానుకగా కార్యకర్తలకు 5 జీ మొబైల్స్**

**- మొబైల్స్ అందజేసిన ఎమ్మెల్యే ఏలూరి**




**మార్టూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

అంగన్‌వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరువతో అంగన్‌వాడీ కార్యకర్తలకు 5జీ స్మార్ట్ ఫోన్లు అందించే కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఏలూరి స్వయంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలకు, ప్రాజెక్టు ఆఫీసర్లకు 5 జీ మొబైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతతో అంగన్‌వాడీ సేవలు మరింత పారదర్శకంగా, వేగంగా ప్రజలకు చేరే అవకాశం ఉందని ఎమ్మెల్యే చెప్పారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం పోషకాహార వివరాలు, హాజరు నమోదు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలను మొబైల్ యాప్‌ల ద్వారా సమర్థవంతంగా నిర్వహించవచ్చని వివరించారు. అంగన్‌వాడీలే గ్రామాభివృద్ధికి పునాదిలని అన్నారు. 5జీ మొబైల్స్ ద్వారా రియల్‌టైమ్ డేటా నమోదు, ఆన్‌లైన్ నివేదికలు, వీడియో ఆధారిత శిక్షణను పొందే వీలుంటుందని ఎమ్మెల్యే వివరించారు. దీని వల్ల అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు మెరుగుపడడంతో పాటు, తల్లులు, పిల్లలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. గ్రామ మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే ఏలూరి ఆదేశించారు. క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా అధికారుల స్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను తన దృష్టికి కానీ పై అధికారుల దృష్టికి కానీ తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైన్లు సంబంధించి అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని అన్నారు. మిగిలిన పనులను గుర్తించి, ఇప్పటికే సంబంధించిన అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.

7_7.qxd 12/20/2025 12:23 AM Page 1



## పాలనా వ్యవస్థ మొత్తం కిందిస్థాయి ఉద్యోగుల చేతిలో ఉంటుంది

**- గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలి**

**- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**మార్కాపురం, డిసెంబరు 19,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి వార్డు సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలు తీర్చడంలో ముందుండాలని సూచించారు. ప్రజల్లో మీ పనితీరు పట్ల సంతృప్తి శాతం పెరగాలంటే వేగంగా, బాధ్యతతో పని చేయాలని అన్నారు. పాలన వ్యవస్థ మొత్తం కిందిస్థాయిలో సచివాలయ ఉద్యోగుల చేతుల్లోనే ఉందని, ప్రజలు ఏ సమస్యతో వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ పథకాలను మరింత సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఇకనుంచి ఉద్యోగుల పనితీరులో వేగం పెరగాలని, అత్యంత వెనుకబడిన ఈ ప్రాంత అభివృద్ధికి అందరం కలిసి కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఈ సమావేశంలో మార్కాపురం మున్సిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, అన్ని వార్డు సచివాలయాల ఉద్యోగులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను తిప్పికొట్టాలి : సిపిఎం ధర్నా

**- మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశద్రోహం**



**మార్కాపురం, డిసెంబరు 19,ప్రభాతవార్త**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసే కుట్రలను ప్రతిఘటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం మార్కాపురం మండల పరిషత్తుకార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి సిపిఎం మార్కాపురం మండల కార్యదర్శి భూమా బాలనాగయ్య అధ్యక్షత వహించారు.ఈ ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దగ్గుపాటి సోమయ్య మాట్లాడారు. యూపీఏ-1 ప్రభుత్వంలో వామపక్షాల మద్దతుతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం గత 12 ఏళ్లుగా నీరుగార్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఉపాధి లేని కార్మికులకు పని కల్పించే ఈ చట్టం పేరును మార్చడం, నిధుల్లో కోత విధించడం కార్మిక వ్యతిరేక విధానాలకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం 90 శాతం,రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం భరించాల్సిన చట్టాన్ని 60:40 గా మార్చడం వల్ల రాష్ట్రాలపై తీవ్రమైన భారం పడుతుందని, అప్పుల్లో ఉన్న రాష్ట్రాలు చట్టాన్ని సమర్థంగా అమలు చేయలేని పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా కార్మికులకు ఉపాధి దూరమై వలసలు పెరుగుతాయని తెలిపారు. 20 ఏళ్లుగా అమలవుతున్న ఉపాధి హామీ చట్టం వల్ల వ్యవసాయ కార్మికుల కొనుగోలు శక్తి పెరిగి దేశ జీడీపీ అభివృద్ధికి తోడ్పడిందన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించడం దేశద్రోహానికి సమానమని విమర్శించారు. వెంటనే గాంధీ పేరును పునరుద్ధరించాలని,రాష్ట్రాలపై విధించిన భారం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, సిపిఎం నాయకులు పండిట్ రూబెన్,జవాజి రాజు,ఒర్స అడివయ్య,తురక ఏడుకొండలు,రేపని తిరుపతయ్య,షేక్ కరీముల్లా,కొండేటి నగేష్,ఏనుగుల సురేష్, బలుసుపాటి కాశయ్య,రైతుసంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, యద్దనపూడి జడేజా తదితరులు పాల్గొన్నారు.

## మార్కాపురం బస్టాండ్‌లో వినియోగదార్ల సదస్సు



**మార్కాపురం, డిసెంబరు 19,ప్రభాతవార్త**

జాతీయ వినియోగదార్ల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మార్కాపురం ఆర్టీసీ బస్టాండ్‌లో వినియోగదార్ల సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆర్టీసీడిపోమేనేజర్ నరసింహులు అధ్యక్షత వహించారు.ముఖ్యఅతిథిగా జిల్లా వినియోగదార్ల సంఘాల అధ్యక్షులు ఒరుగంటి మల్లిక్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం సలహాలు మరియు ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, అలాగే బస్సు వేళలను టెక్నాలజీ ద్వారా ఎంక్వయిరీ కౌంటర్‌లో తెలియజేసే విధానం అమలు చేయాలని సూచించారు. జిల్లా ప్రయాణికుల సంఘ అధ్యక్షులు ఆర్‌కేజీ నరసింహం మాట్లాడుతూ బస్టాండ్‌లో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. బీజేపీ అధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ పల్లె ప్రాంతాలకు బస్సుల సంఖ్య పెంచి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సదస్సులో పలువురు ప్రయాణికులు, వినియోగదార్ల సంఘ ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలు, సూచనలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందుల



**మార్కాపురం, డిసెంబరు 19,ప్రభాతవార్త**

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి శుక్రవారం మార్కాపురం నియోజకవర్గంలోని పలుకార్యక్రమాల్లో పాల్గొన్నారు. తర్లుపాడు మండలం కలుజువ్వలపాడు గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో రసాయన ఎరువుల అధిక వినియోగంతో భూమి, ఆరోగ్యం దెబ్బతింటున్నాయని, ప్రకృతి సాగు వైపు రైతులు మళ్లాలని సూచించారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ద్వారా రైతులకు లాభాలు చేకూరేలా 13 వేల కోట్ల రూపాయలతో 38 పరిశ్రమలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు తమ పంటలను అధికారుల వద్ద నమోదు చేసుకుని బీమా వంటి పథకాల ద్వారా ఆర్థిక భద్రత పొందాలని సూచించారు. అనంతరం పశ్చిమ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన మార్కాపురాన్ని జిల్లాగా ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి గ్రామ మహిళలు, టీడీపీ నాయకులు ఘనంగా క్షీరాభిషేకం చేసి ఆనందం వ్యక్తం చేశారు. తదుపరి మార్కాపురం జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని తర్లుపాడు రోడ్డులో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాస్టర్లకు నూతన వస్త్రాలు బహుకరించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

## బిసి వర్గాల సంక్షేమానికి కృషి చేస్తాం

**- ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి**



**గిద్దలూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త**

బిసి వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా కృషి చేస్తామని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. గిద్దలూరు పట్టణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిసి సంఘ మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేతాతోపాటు పలువురు బీసీ నాయకులు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో బిసి వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని, అయితే ప్రస్తుతం సామూహిక సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సరైన భవనం లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గిద్దలూరులో బిసి భవన్ ఏర్పాటు చేస్తే బిసి యువత,విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని,ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం మరియు సామాజిక ఐక్యతకు కేంద్రంగా నిలుస్తుందని వివరించారు. ఈ నేపథ్యంలో బిసి భవన్ నిర్మాణానికి అవసరమైన స్థలం, నిధులను మంజూరు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.స్పందించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ భవన్ నిర్మాణ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

## 21న మార్కాపురంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలు





**మార్కాపురం, డిసెంబరు 19, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21వ తేదీ (ఆదివారం) ఉదయం 8గంటలకు మార్కాపురం పట్టణంలోని కమలా హై స్కూల్ (సీబీఎస్ఈ), తర్లుపాడు రోడ్డు వద్ద జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు) పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పురుషులు - 10 కిలోమీటర్లు, మహిళలు - 10 కిలోమీటర్లు, 20 సంవత్సరాలలోపు బాలురు-8 కిలోమీటర్లు, బాలికలు - 6కిలోమీటర్లు, 18 సంవత్సరాలలోపు బాలురు - 6 కిలోమీటర్లు, బాలికలు-4 కిలోమీటర్లు,16 సంవత్సరాలలోపు బాలురు,బాలికలు-2 కిలోమీటర్లు, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం (బర్త్ సర్టిఫికేట్) సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను డిసెంబర్ 24న కాకినాడ జిల్లా పెద్దాపురంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపిక చేస్తామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్రరావు, సెక్రటరీ ఎం రఘు తెలిపారు. మరిన్ని వివరాలకు డి రాజు నాయిక్ - 76750 26220, ఎస్ రజనీష్ - 97013 58726 నంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

## గౌతమ్ విద్యాసంస్థలో 21న జాబ్‌మేళా

**కంభం, డిసెంబరు 19 ,ప్రభాతవార్త**

కంభం పట్టణంలోని గౌతమ్ విద్యాసంస్థలో ఈ నెల 21వ తేదీ ఆదివారం జాబ్ మేళా జరుగునని గౌతమ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ చెగిరెడ్డి. రామభూపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం నిర్వహించే ఈ జాబ్ మేళా నందు వివిధ రాష్ట్రాలలోని 9 ప్రముఖ కంపెనీలు దాదాపు 400 జాబులను భర్తీ చేయనున్నారని తెలిపారు. కావున ఇంటర్,ఐటిఐ, డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ జాబ్ మేళాను శాండ్ స్పేస్ టెక్నాలజీ మరియు గౌతమ్ విద్యాసంస్థలు కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



**కంభం, డిసెంబరు 19, ప్రభాతవార్త**

వినియోగదారుల హక్కులపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మధురవాణి అన్నారు. పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో శుక్రవారం వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నెల24న జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వస్తు సేవల వినియోగ రక్షణ,ఉత్పాదక సమయము,నాణ్యత, గడువు,తూకాల్లో మోసాలు తదితర అంశాలపై చిత్రలేఖన ప్లకార్డ్స్ చేతబట్టి, నినాదాలిచ్చారు. పాఠశాలలో వినియోగదారుల హక్కులపై వ్యాసరచన,వకృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధురవాణి, వైస్ ప్రిన్సిపల్ శ్రావణ లక్ష్మి, ఉపాధ్యాయిని శారద తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యుల సర్వే నుండి విముక్తి కల్పించాలి

**- రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ స్వాతికి వినతిపత్రం అందజేసిన వీఆర్వోలు**



**రాచర్ల, డిసెంబర్ 19 ,ప్రభాతవార్త**

కుటుంబ సభ్యుల సర్వే నుండి తమకు విముక్తి కల్పించాలని కోరుతూ శుక్రవారం రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వై స్వాతికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. బిఎల్ఓ సర్వే, సచివాలయ విధులు, వివిధ రకాల ధ్రువపత్రాల విచారణ, పోలీస్ శాఖతో శాంతి భద్రతలకు సంబంధించి అనుసంధాన పరిస్థితులు, కోర్టు కేసులు, వివిధ రకాల సర్వేలతో పని భారం అధికమైందని ఇలాంటి పరిస్థితుల్లో మరల ప్రభుత్వం యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే తమకు అప్పగించిందని దీంతో పని ఒత్తిడి అధికమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. మా ఇబ్బందులను పరిగణలోకి తీసుకొని కుటుంబ సభ్యుల సర్వే నుండి తమకు విముక్తి కల్పించాలని అన్నారు. తమ విన్నపాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు ఎస్ రంగయ్య, అర్చన పి డానియల్, ఏ శివారెడ్డి, ఈ వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ శివయ్య, డి యోనా తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**రాచర్ల, డిసెంబరు 19 ,ప్రభాతవార్త**

వివిధ రకాల విద్యుత్ కారణాలు దృష్ట్యా నేడు శనివారం ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గిద్దలూరు విద్యుత్ శాఖ డీఈఈ బి శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. మండలంలోని ఆకవీడు, జేపీ చెరువు, రాచర్ల, అనుమలవీడు, మేడంవారిపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అన్నారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఎడవల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదని ఆయన తెలిపారు.

### అంగన్వాడీ కార్యకర్తలకు 5జి ఫోన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త**

గిద్దలూరు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లు, వర్కర్లకు ప్రభుత్వం అందిస్తున్న అధునాతన 5జి ఫోన్లను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. గిద్దలూరు ప్రాజెక్ట్ పరిధిలో మొత్తం 243మంది అంగన్వాడీ టీచర్లకు 5జి ఫోన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా అంగన్వాడీ టీచర్లు, వర్కర్లు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే సరుకులు, స్టాక్, ఖర్చులు, హాజరు వివరాలు ఇకపై ఫోన్ల ద్వారానే నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. అంగన్వాడీ సిబ్బందికి కూడా తల్లికి వందనం పథకం అమలు చేసే అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. అలాగే అంగన్వాడీ టీచర్ల గ్రాట్యుటీని రూ.20వేల నుంచి రూ.1లక్షకు, వర్కర్ల గ్రాట్యుటీని రూ.20వేల నుంచి రూ.40వేల వరకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదని తెలిపారు. అంగన్వాడీ వర్కర్లు తమకు అందుతున్న రూ.11,500 జీతం సరిపోవడం లేదని, జీతం పెంపు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అంగన్వాడీ టీచర్లు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా అంగన్వాడీ సిబ్బంది సౌకర్యార్థం ఐసిడిఎస్ కార్యాలయంలో మంచినీటి బోరు, టాయిలెట్స్, సీసీ రోడ్డు, కాంపౌండ్ వాల్ మంజూరు చేస్తూ తక్షణమే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మున్సిపల్ ఛైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యులు పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ ఈవీ రమణబాబు, సిడిపిఓ మహిత, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ బైలడుగు బాలయ్య, ఎంపీడీఓ సీతారామయ్య, ఎంఈఓ అశ్విన్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి, రాష్ట్ర మైనార్టీ నాయకులు షేక్ పెద్ద మస్తాన్, పట్టణ ఉపాధ్యక్షులు పందిటి రజిని బాబు, కౌన్సిలర్లు బిల్లా రమేష్, లోక్కు రమేష్, కోఆప్షన్ మెంబర్ దమ్మాల జనార్దన్, పట్టణ నాయకులు, అంగన్వాడీ సూపర్వైజర్లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో



**జరుగుమల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

స్థానిక మండల కేంద్రమైన జరుగుమల్లిలోని బీసీ బాలికల హాస్టల్‌ను జరుగుమల్లి ఎంపీడీవో ఎంవీ రమణమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను కొన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆహార విషయంలో ప్రతిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మెనూ గురించి తెలుసుకొని విద్యార్థులకు ఆహార విషయం, వైద్య విషయంలో ఎలాంటి కొరత ఉండరాదన్నారు. బాలికలకు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు.

### శబరిమల యాత్రకు బయలుదేరుతున్న అయ్యప్ప దీక్షాదారులకు ఫలహారాల పంపిణీ



**గిద్దలూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త**

గిద్దలూరులో ధర్మశాస్త్ర అయ్యప్ప సేవ ట్రస్ట్ (మదిలేటి), శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శబరిమల యాత్రకు బయలుదేరుతున్న అయ్యప్ప స్వామి దీక్షాదారులకు పండ్లు, ఫలహారాలు పంపిణీ చేశారు. అయ్యప్ప స్వామి నామస్మరణల మధ్య భక్తిశ్రద్ధలతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్షదారులు శబరిమల యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకోవాలని వారు ఆకాంక్షించారు.

### కోటేశ్వరరావు మృతికి నివాళులర్పించిన మనోజ్‌కుమార్, పున్నరెడ్డి



**నాగులుప్పలపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కండ్లగుంట సొసైటీ డైరక్టర్ అత్తంటి కోటేశ్వరరావు భౌతిక కాయాన్ని మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, కండ్లగుంట పీఏసీఎస్ చైర్మన్ మున్నంగి పున్నరెడ్డితో కలిసి శుక్రవారం సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి



**వెలిగండ్ల, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని గుడిపాటిపల్లి సచివాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ రికార్డులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించాలయ సిబ్బంది సర్వేలన్నీ త్వరగా పూర్తి చేయాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అక్కడికి వచ్చిన అర్జీదారులతో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుడిపాటిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన ఒక వ్యక్తి ప్రభుత్వ బోరును అక్రమంగా వినియోగించుకుంటున్నాడు అని తెలుసుకున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ అక్కడికి వెళ్లి బోరును అక్రమంగా వినియోగించుకుంటున్న వ్యక్తిని హెచ్చరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బోర్లు గానీ, బావులు, చేతి పంపులు అక్రమంగా వినియోగించుకుని దుర్వినియోగం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అక్రమంగా వినియోగించుకుంటున్న బోరును రేపటిలోగా ప్రజలకు వినియోగంలోకి తేవాలని హెచ్చరించారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి రెడ్డిగారి గంగాధర్, డిప్యూటీ ఎంపీడీవోలు రాంప్రసాద్, జనార్ధన్‌రావు, సచివాలయ సిబ్బంది బోర్ మెకానిక్ మునిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు అవగాహన



**జరుగుమల్లి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

2025-26 పంట కాలానికి టంగుటూరు పొగాకు బోర్డు పరిధిలోని జరుగుమల్లి గ్రామంలో పొగాకులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించి నాణ్యమైన పొగాకును పండించడానికి జరుగుమల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంచుకోవడం జరిగింది. జరుగుమల్లి గ్రామంలో రైస్ యువర్ ఓన్ ఫ్యూయిల్ పథకం కింద టేకు, చింత, మద్ది, వేప మొదలైన మొక్కలు పొగాకు రైతులకు సరఫరా చేయడం జరిగింది. వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పొగాకు రైతులు క్యూరింగ్ కొరకు వారి సొంత కలపను వారే స్వయంగా పెంచుకోవాలన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడుతూ పచ్చదనాన్ని పెంపొందించుకొని, బ్యారన్ క్యూరింగ్ కొరకు అడవులను నరకరాదని తెలిపారు. పొగాకు బోర్డు ప్రొడక్షన్ పాలసీ ప్రకారం రైతుగా రిజిస్టర్ అయిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి బ్యారన్ పరిధిలో 10 మొక్కలు నాటాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, క్షేత్రాధికారి ఉపేంద్ర, పొగాకు బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

### పలువాడల్లో రూ.5.60 కోట్లతో సీసీ రోడ్లు, సైడు కాలువలకు

**ఎమ్మెల్యే విజయ్‌కుమార్, మేయర్ సుజాత, కమీషనర్ వెంకటేశ్వరరావులు ముమ్మర శంకుస్థాపనలు**





**సంతనూతలపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని ఒంగోలు నగరపాలక సంస్థ సమతా నగర్, విరాట్ నగర్, పేర్నమిట్టలలో గల 5 డివిజన్లనందు ఐదు కోట్ల 60 లక్షల వ్యయం కాగల సీసీ రోడ్డు, సైడు కాలువలకు శుక్రవారం సాయంత్రం సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ ఒంగోలు నగర పాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు కమీషనర్ కోడూరి వెంకటేశ్వరరావులు ముమ్మరంగా శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి సంక్షేమం ముందంజలో ఉన్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. వాడవాడలా సిమెంట్ రోడ్డు, సైడు కాలువలను ముమ్మరంగా ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. సంతనూతలపాడు నియోజకవర్గాన్ని జిల్లాలో అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే తప్పక పరిష్కరిస్తామని ఎమ్మెల్యే విజయ్ కుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా 39వ డివిజన్ సమతా నగర్ నాలుగో లైన్‌లో రెండు కోట్లు, 38వ డివిజన్ సమతా నగర్‌లో కోటి రూపాయలు, 40వ డివిజన్ ద్వారకా నగర్ రెండవ లైన్ లో కోటి రూపాయలతో, పేర్నమిట్ట 41 డివిజన్ పోలేరమ్మ గుడి సమీపాన కోటి మూడు లక్షల పదహారు వేల రూపాయలతో 43వ డివిజన్ విరాట్ నగర్ నందు 56 లక్షల 64 వేల రూపాయలతో ఈ సందర్భంగా సీసీ రోడ్లు, సైడు కాలువలకు ఎమ్మెల్యే విజయ్ కుమార్, మేయర్ గంగా సుజాత, కమీషనర్ వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మలగా రమేష్, గోలి లక్ష్మీ తిరుపతిరావు, కండె స్వాతి రమణ యాదవ్, తెళ్ళ చంద్రశేఖర్, నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు, తదితరులు ముమ్మరంగా శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమైక్య అధ్యక్షులు మండవ జయంతిబాబు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి అడకా స్వాములు, సంతనూతలపడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, మండల టీడీపీ మహిళా సంఘ నాయకురాలు ఆరికట్ల సుమతి, టీడీపీ నేత మాజీ వైస్ ఎంపీపీ వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, 39వ డివిజన్ అధ్యక్షులు కొల్లా మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే నన్నేసా, మండల టీడీపీ మహిళా సంఘం అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు పావులూరి నారాయణస్వామి చౌదరి,టీడీపీ నాయకులు పత్తిపాటి శ్రీనివాసావు, అమానుల్లా,బాబు,ఆచారి, పత్తిపాటి వెంకటేశ్వరరావు, బత్తులశ్రీను,కే.శ్రీను, రవికుమార్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

### 21 తేది పల్స్ పోలియోను విజయవంతం చేయాలి - డా. ధీరేంద్ర కుమార్

**- ప్రతి ఒక్క తల్లి పోలియోకు సహకరించాలి**




**సింగరాయకొండ,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

పోలియో మహమ్మారి నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 21న (ఆదివారం) నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి తల్లి సహకారంతో విజయవంతం చేయాలని కొండపి ఎస్ఎంఓ, సింగరాయకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డా. ధీరేంద్రకుమార్ పిలుపునిచ్చారు.శుక్రవారం సింగరాయకొండ ఉన్నత శ్రేణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. భారత ప్రభుత్వం ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సమన్వయంతో చేపడుతున్న ఆరోగ్య భద్రతా కార్యక్రమంలో భాగంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరియు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు సింగరాయకొండ మండలంలోని తీరప్రాంత గ్రామాలతో పాటు ఆర్‌టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌ల వద్ద ప్రత్యేక పోలియో చుక్కల కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.మండలంలో 40కి పైగా పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, శనివారం సాయంత్రం కల్లా ఆయా గ్రామాల్లో పోలియో మందు సిద్ధంగా ఉంచనున్నట్లు వెల్లడించారు. 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో పాకల మెడికల్ ఆఫీసర్ డా. వంశీధర్ పాల్గొన్నారు.

8_8.qxd 12/20/2025 12:25 AM Page 1



# ఏకీకృత కుటుంబ సర్వేకు సహకరించాలి



**వేటపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ఏకీకృత కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని జీఎస్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో జున్ను మరియమ్మ తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ప్రయోజనం కలిగే విధంగా ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు ఇచ్చే నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 8 నుంచి 2026 జనవరి 12వ తేదీ వరకు ఏకీకృత కుటుంబ సర్వే ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. ఇంటింటికి గ్రామ సచివాలయం సిబ్బంది సర్వే కోసం వచ్చిన సమయంలో ప్రజలు సహకారం అందించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు గ్రామ సచివాలయంలో పని చేసే అన్ని శాఖల ఉద్యోగులకు ఈ సర్వే గురించి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమగ్ర సమాచారం సేకరిస్తారని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అర్హులైన పేదలకు సక్రమంగా అందించాలనే ఉద్దేశంతో అత్యంత పారదర్శకంగా సర్వేను చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఉద్యోగులు అలసత్వం వహించకుండా అంకిత భావంతో ప్రజలతో మమేకమై వారి సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధికి సంబంధించిన వివరాలను పక్కాగా సేకరించి, మొబైల్ యాప్ ద్వారా నమోదు చేయాలని తెలిపారు.

## ఎమ్మెల్యే మద్దులూరిని కలిసిన జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్ సుచిత్ర వీరయ్య చౌదరి



**చీరాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

చీరాల ఎమ్మెల్యే నివాసంలో శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, ధర్మపత్ని మద్దులూరి మాలకొండమ్మ, చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్‌లను ప్రకాశం జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా నియమితులైన సుచిత్ర వీరయ్యచౌదరి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వీరయ్య చౌదరి అన్నగారు యువగళం పాదయాత్రలో, గత ఎన్నికల ప్రచారంలో బాగా తెలుసని తెలిపారు. వీరయ్య చౌదరి ని కోల్పోవడం తీరని లోటని తెలిపారు. ప్రత్యేకంగా నా కుమారులతో ఒక సోదరుడిగా ఉన్నారని తెలియజేశారు. చీరాల నియోజకవర్గం నుంచి అన్ని విధాలా మీకు అండగా ఉంటానని సుచిత్ర వీరయ్య చౌదరికి మాట ఇచ్చారు.

# ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజాదర్బార్



**చీరాల, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండయ్య ప్రజల వద్ద నుండి స్వయంగా సమస్యల వినతుల అర్జీలను స్వీకరించారు. మొత్తం 236 పైగా అర్జీలు రాగా వీటిలో ఇంటి నిర్మాణాల కోసం, ఇంటి స్థలాల కోసం 86, 140 పింఛన్లు, 10 పలు సమస్యలపై అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధన్, మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల పట్టణ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, చీరాల నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లలిత, జనసేన నాయకులు గూడూరు శివరాం ప్రసాద్, కారంపూడి పద్మిని, నాగలక్ష్మి, ఉసిరిపాటి సురేష్, కూటమి నాయకులు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## తెగిపడిన విద్యుత్ తీగలు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం




**ఇంకొల్లు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

నూతన విద్యుత్ స్తంభాలు వేసే క్రమంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న చెట్లు కొమ్మలు తొలగిస్తున్న క్రమంలోచెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఈపురుపాలెం వద్ద రహదారి వెంబడి నూతన ఎత్తైన విద్యుత్ స్తంభాలను వేసేందుకు గాను ఓ స్కూల్ సమీపంలో చెట్టు కొమ్మలు సిబ్బంది కోస్తున్న సమయంలో ఆ చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలపై పడి నాలుగు విద్యుత్ తీగలు తెగిపోయాయి. చెట్టు కొమ్మలు విద్యుత్ తీగలు ఆగి ఉన్న స్కూల్ బస్సుపై పడటంతో షార్ట్ సర్క్యూట్‌తో సమీపంలోని ట్రాన్స్‌ఫారం వద్ద ఫీజులు ఎగిరిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆగి ఉన్న స్కూల్ బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రాంతంలో సుమారు మూడు గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సంబంధిత విద్యుత్ సిబ్బంది వచ్చి విద్యుత్ లైన్‌లకుమరమ్మత్తులు చేపట్టారు. ఎవరికి ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## వేటపాలెం ఎస్సై జనార్ధన్ ఆధ్వర్యంలో దేశాయిపేట పంచాయతీలో పల్లె నిద్ర



**వేటపాలెం, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ప్రజలతో నేరుగా మమేకమై గ్రామ సమస్యలను తెలుసుకునే లక్ష్యంతో వేటపాలెం పోలీసు స్టేషన్ ఎస్సై జనార్ధన్ ఆధ్వర్యంలో దేశాయిపేట పంచాయతీ లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రాత్రి బస చేసి స్థానికుల నుంచి భద్రత, శాంతి భద్రతలు, సామాజిక సమస్యలపై అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో జరుగుతున్న చిన్నపాటి వివాదాలు, అనుమానస్పద కార్యకలాపాలపై ప్రజలు నిర్భయంగా సమాచారం అందించాలని ఎస్సై జనార్ధన్ కోరారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సూచించారు. మహిళల భద్రత, రాత్రి వేళల్లో గస్తీ పెంపు, సీసీ కెమెరాలు ఏర్పాటు వంటి అంశాలపై చర్చ జరిగింది. పల్లె నిద్ర కార్యక్రమంలో పోలీసు ప్రజల మధ్య విశ్వాసం పెరుగుతుందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు నగరవనం పరిశీలించిన ఎమ్మెల్యే ఉగ్ర





**కనిగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని హనుమంతునిపాడు రోడ్డులో ఉన్న నగరవనాన్ని కనిగిరి ఎమ్మెల్యేడాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం సందర్శించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రకృతి వాతావరణం లో ఘనంగానిర్వహించాలనే ఉద్దేశంతో టీడీపీ శ్రేణులతో కలిసి వేడుకల నిర్వహణకు అనుకూలతపై ఆయన స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ నగరవనం సహజ సౌందర్యంతో ప్రజలకుఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తోందని, ఇలాంటి ప్రదేశంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కూడా పెరుగుతుందని తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమం లో డీసీఎంస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, కనిగిరి మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండా కృష్ణారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు అచ్చాల రవి, బాలు, ఓబుల్‌రెడ్డి, ఉప్పలపాటి హరిబాబు, ఇంద్ర భూపాల్‌రెడ్డి తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నగరవనంలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం



**కనిగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం హనుమంతునిపాడు రోడ్డు మార్గంలో ఉన్న నగరవనం పార్కులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కనిగిరి టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఎమ్మెల్యేడాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, మహిళలు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కనిగిరి టౌన్ టీడీపీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పిలుపునిచ్చారు.

# ప్రసన్నాంజనేయస్వామికి అరటి కాయల పూజ





**అద్దంకి , డిసెంబరు 19,ప్రభాతవార్త**

అద్దంకి మండలం శ్రీ సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో శుక్రవారం అమావాస్య సందర్భంగా కుద్రవానిపాలెం వాస్తవ్యులు నాదెళ్ల కోటేశ్వరరావు దంపతులు స్వామి వారికి అరటికాయల పూజా కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి తీర్థప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి అధ్యక్షుడు చుండూరి మురళిసుధాకర్ రావు, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడు వారిని ఘనంగా సన్మానించుకున్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ యువకుడు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి

**సంతనూతలపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం గార్లపాడు ఐటీసీ గూడెంలో విద్యుత్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు త్రిపుర రాష్ట్రం చైనాల మండలం దలైజిల్లాకు చెందిన ఇంతాస్ ఖాన్(20) అనే యువకుడు జారీ కింద పడి గాయాలకు గురి అయ్యాడు. సదరు యువకుడు ఒంగోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు తండ్రి షయాలుద్దీన్ ఫిర్యాదు మేరకు మద్దిపాడు సబ్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట సూర్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జగనన్న జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు పరిశీలించిన దద్దాల నారాయణ యాదవ్



**కనిగిరి, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సంక్షేమ ప్రదాత, జనహృదయ నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా కనిగిరి పవిత్ర కళ్యాణ మండపంలో చేపట్టిన ఏర్పాట్లను కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్, రక్తదాన శిబిరం, చీరాల పంపిణీ, తోపుడు బండ్ల పంపిణీ అన్నదానం కౌంటర్ల ఏర్పాట్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించి కార్యక్రమాలు సజావుగా క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు చేశారు. జగనన్న జన్మదినాన్ని సేవా కార్యక్రమాల రూపంలో ప్రజలకు చేరువ చేయాలన్న లక్ష్యంతో వేడుకలు నిర్వహిస్తున్నట్లు దద్దాల నారాయణ యాదవ్ తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్‌గఫార్, మడతల కస్తూరిరెడ్డి, సూరసాని మోహన్‌రెడ్డి, కటికల వెంకటరత్నం, ఆవుల భాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి, పులి శ్రీనివాసులురెడ్డి, పల్నాటి భాస్కర్‌రెడ్డి, ఆవుల తిరుపతిరెడ్డి తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మార్కాపురం జిల్లా ఏర్పాటుపై చేరెడ్డిపల్లిలో టీడీపీ నాయకులు సంబరాలు

### - పాల్గొన్న కందుల విగ్నేష్‌రెడ్డి



**కొనకనమిట్ల,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మార్కాపురం ఏర్పాటు ప్రకటనపై చేరెడ్డివారిపల్లెలో శుక్రవారం రాత్రిటీడీపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా శాసనభ్యులు కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విగ్నేష్ఎడ్డి ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చిత్రపటాలకు కందుల విగ్నేష్‌రెడ్డి నాయకులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మోరబోయిన బాబురావు, తెలుగు యువత నాయకులు పెరికే సుఖదేవ్, మాజీ మండల కన్వీనర్ వరికూటి రామిరెడ్డి, నాయకులు మువ్వా కాటంరాజు, అంకాల రోశయ్య, వెంకట సుబ్బయ్య, శ్రీనివాస్ చౌదరి, రమణమ్మ, సుబ్బారావు, యర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కొమరోలు,డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని కొమరోలు, రెడ్డిచర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో నేడు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సబ్‌స్టేషన్ల మెయింటినెన్స్ కొరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

# జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన లక్ష్మీ అమూల్య



**బల్లికురవ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

మండలంలోని వి.కొప్పెరపాడు, ఉన్నత పాఠశాలలో విద్యార్దిని అమూల్య శుక్రవారం జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో తన ప్రతిభను చాటి ప్రథమ బహుమతి పొందింది. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమర్థవంతమైన, వేగవంతమైన పరిష్కారం అనేఅంశంపై జరిగిన జిల్లా స్థాయిలో డిబేట్ పోటీలు నిర్వహించారు. తెలుగు మీడియం విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొప్పెరపాడు విద్యార్థి పి.లక్ష్మీ అమూల్య ప్రథమ స్థానం పొంది రూ.5వేలు క్యాష్ అవార్డు గెలుచుకుంది. ఈ నెల 23వ తేదీన విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో బాపట్ల జిల్లా తరుపున ఈ విద్యార్థిని పాల్గొంటుంది. అత్యుత్తమ ప్రతిభ చాటిన లక్ష్మీ అమూల్యను ప్రధానోపాధ్యాయులు పురంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దమ్ము అంజయ్యలు అభినందించారు.

## గోగినేనివారిపాలెంలో మహిళ హత్య పరిశీలించిన దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ





**కొనకనమిట్ల, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

కొనకనమిట్ల మండలం గోగినేనివారిపాలెం ఎస్సీ కాలనీలో పులి బుల్లెమ్మ(49)ను గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి హత్యకు గురైనట్లు గొంతు నులిమి హత్య చేశారని కుమార్తె లక్ష్మీ తిరుపతమ్మ, స్థానికులు పోలీసులకు తెలిపారు. గొంతు నులిమి హత్య చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నట్లు క్లూస్ టీమ్ ద్వారా పరిశీలించారు. మృతురాలి భర్త ఆరు నెలల క్రితం మృతి చెందారు. ఇద్దరు కుమారులు, కుమార్తెలు కలిగి ఉన్నారు . శుక్రవారం దర్శి డీఎస్పీ లక్ష్మీ నారాయణ , పొదిలి ఎస్సై రాజేష్ కుమార్, వి.వేమన సిబ్బందితో వెళ్లి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బుల్లెమ్మను గొంతు నులిమి చంపి ఉండవచ్చనిభావిస్తున్నారు. ఒంగోలు నుంచి వచ్చిన డాగ్ ,క్లూస్ టీమ్ ద్వారా సంఘటన స్థలాన్ని అనుమాన స్పద పరిసరాలను నిశితంగా పరిశీలించారు. కూతురు లక్ష్మీ తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

## రెడ్డిచర్ల సచివాలయం తనిఖీ చేసిన ఎంపీడీవో



**కొమరోలు, డిసెంబర్ 19,ప్రభాతవార్త**

మండలంలోని రెడ్డిచర్ల సచివాలయాన్ని ఎంపీడీవో సానికొమ్ము సత్యం శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సమగ్ర కుటుంబ సర్వే, వాట్సాప్ గవర్నెన్స్, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఎంపిడిఓ సత్యం మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజల నుండి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో జేసిహెచ్ చెన్నారావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## గ్రానైట్ లారీల తనిఖీ



**బల్లికురవ, డిసెంబర్ 19, ప్రభాతవార్త**

స్థానిక గ్రానైట్ క్వారీల నుండి కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్న రెండు గ్రానైట్ లారీలను శుక్రవారం రాత్రి బాపట్ల ప్రాంతీయ రవాణా శాఖ అధికారి రంగారావు తనిఖీ చేశారు. డ్రైవర్ల లైసెన్సులు, గ్రానైట్ రవాణాకు సంబంధించి టాక్స్ చెల్లింపులు తదితర అంశాలను ప్రత్యేకంగా తనిఖీ చేశారు. బల్లికురవ, అద్దంకి రహదారిలో స్థానిక పోలీసు స్టేషన్‌కు సమీపంలో ఈ వాహనాలను ఆయన తనిఖీ చేశారు. అదే విధంగా అద్దంకి, పంగులూరు, బల్లికురవ, ప్రాంతాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం రవాణా చేసే వాహనాలను నమోదు చేసే ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని ఆయన తెలియజేశారు.

## పల్స్ పోలియోను విజయవంతం చేయండి - తహశీల్దార్ జి వి సుబ్బారెడ్డి



**కొరిశపాడు , డిసెంబరు 19,ప్రభాతవార్త**

ప్రభుత్వం చేపట్టిన 21వ తేది ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కొరిశపాడు తహశీల్దార్ జీవి సుబ్బారెడ్డి మండలంలోని చిన్నారుల తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కార్యాలయ సమావేశ హాలులో పి హెచ్ సి సిబ్బంది తో కలిసి ఆయన పల్స్ పోలియో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నుంచి పోలియో మహమ్మారిని శాశ్వతంగా తరిమికొట్టేందుకై పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ చేపట్టిందన్నారు, అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదు సంవత్సరాలు వయసు కలిగిన ప్రతి శిశువుకు రెండు చుక్కలు పోలియో డోస్ వేయించా లన్నారు తీవ్రమైన జలుబు దగ్గు జ్వరం ఉన్న చిన్నారులకువైద్యుల సూచనలను మేరకు పోలియో డ్రాప్స్ వేయించాలన్నారు. ఆదివారం ఉదయం గ్రామాల్లో ఏర్పాటుచేసిన బూతుల్లో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండి చిన్నారులకు పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు. పోలియో డ్రాప్స్ వేయించని చిన్నారులకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సోమవారం మంగళవారం గ్రామంలో చిన్నారులు ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన వారికి పోలియో డ్రాప్స్ వేస్తారన్నారు. చిన్నారులు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తల్లిదండ్రులు ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో డ్రాప్స్ వేయించి వారు ఆరోగ్యంగా రోగాలు బారిన పడకుండా ఎదిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మేదరమెట్ల పి హెచ్ సి వైద్యులు డాక్టర్ చిట్టిబాబు, హెచ్ ఈ సి బ్రహ్మానందం, మండలంలోని ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# బధిరుల పాఠశాలలో వితరణ



**అద్దంకి, డిసెంబరు 19,ప్రభాతవార్త**

అద్దంకి చైతన్య మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బదిరుల ఆశ్రమ పాఠశాలలో అద్దంకి మండల విద్యాశాఖాధికారి2 కె.వి. శ్రీనివాసరావు చే సానిటరీ నాప్కిన్ ఇన్సినేరేటర్‌ను బ్యాంకు విశ్రాంత ఉద్యోగి బాబురావు వితరణగా పాఠశాల నిర్వాహకులు కు అందజేశారు. ఈ సందర్భంగా అద్దంకి మండల విద్యాశాఖ అధికారి 2 కె. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, అప్పుడే విజయానికి చేరువ అవుతారని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, విద్యార్థులు కష్టపడి చదువుకొని ప్రభుత్వం కల్పించిన అవకాశాలు వినియోగించుకొని ఉన్నత స్థితిలో ఉండాలని తెలిపారు. బాబురావు మాట్లాడుతూ ఈ పాఠశాల లోని విద్యార్థినులకు అవసరమైన శానిటరీ నాప్కిన్ ఇన్సినేరేటర్‌ను అందించటం తనకు సంతోషకరంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎల్లవేళలా తమ కుటుంబ సహకారం ఈ పాఠశాలకు ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకురాలు పూనూరి ఆరోగ్యం, ప్రిన్సిపల్ సురేంద్రబాబు, సిబ్బంది రమేష్, నవీన్, ధైర్యం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన



**అద్దంకి, డిసెంబరు 19, ప్రభాతవార్త**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసినా కేంద్ర ప్రభుత్వం విధానాలు వ్యతిరేకంగా అద్దంకిలో నిరసన శుక్రవారం సిపిఎం పార్టీ అద్దంకి మండలం కమిటీ ఆధ్వర్యంలో అద్దంకి తాసిల్దార్ ఆఫీస్ వద్ద ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి జి రామ్ జి పథకాన్ని తీసుకురావడంతో గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు పని హక్కుగా ఉన్న ఉపాధి చట్టాన్ని లేకుండా చేయడమేనని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు తెలియజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలకి ఆసరాగా ఉన్న చట్టాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తూ వస్తుందని నిన్న కార్మిక చట్టాలను రద్దుచేసి లేబర్ కోడు బిల్లు తీసుకొచ్చి కార్మికులు హక్కులను కాలరాశిందని, నేడు గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు ఆసరాగున్న ఎంజి ఎన్ ఆర్ జి ఎస్ చట్టాన్ని రద్దుచేసి గ్రామాల్లో కొద్దిమందిగా ఉన్న భూస్వాములకు అనుకూలంగా చౌకగా కూలీలకు వస్తారని అభిప్రాయంతో అత్యధికంగా ఉన్న పేదలకు అన్యాయం చేస్తుందని దేశంలో కార్పొరేటు భూస్వాములకు అనుకూలంగా చట్టాలను మార్చటం అనేది ఒక బిజెపి కేంద్ర ప్రభుత్వానికి చెల్లుతుందని ఈ విధానాల్ని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని తెలియజేశారు. కేంద్రంలో చేస్తున్న ప్రతి చట్టానికి రాష్ట్రంలో ఉన్న బూర్జువా పార్టీలు మద్దతు తెలియజేయటం చాలా విచారకరమని ఆంధ్ర రాష్ట్రంలో ఎంతో కొంత అభివృద్ధి అవుతుంది అంటే అది ఉపాధి హామీ చట్టం ద్వారానే అవుతుందని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు సవరణ తీసుకొచ్చిన ఫలితంగా 90-10 శాతం నిధులు కాకుండా 60-40 శాతంగా కేటాయింపుల వల్ల అభివృద్ధి కుంటుపడే ప్రమాదం ఉందని రాష్ట్రంలోనే ప్రధాన పార్టీలు ఈ విషయాన్ని గమనించి ఈ విధానాన్ని వ్యతిరేకించాలని ఈ విధానాలకు వ్యతిరేకంగా రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహించి కార్మిక కర్షక ఐక్య పోరాటాలను బలోపేతం చేసి ఈ చట్టాలను వెనక్కి కొట్టే విధంగా పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. డిమాండ్లతో కూడిన వింత పత్రాన్ని డిప్యూటీ తాసిల్దార్ సురేష్ బాబుకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు ఎస్ కే కరీమ్. కోమరగిరి ప్రమీల. హనుమంతరావు. జ్యోతి. తదితరులు పాల్గొన్నారు.

# పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### - పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు జయచంద్ర



**అద్దంకి, డిసెంబరు 19, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ, రాష్ట్రీయ గోకుల్ మిషన్ (ఆర్‌జీఎం) ఆధ్వర్యంలో పాడి రైతులకు పశువుల ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు ఉచిత వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ యస్.జయచంద్ర పేర్కొన్నారు. శుక్రవారం అద్దంకి మండలంలోని మణికేశ్వరం గ్రామంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో పశు గణాభివృద్ధి సంస్థ ద్వారా కృత్రిమ గర్భధారణ విస్తరణ, లింగ నిర్ధారిత వీర్యం సరఫరా వంటి వినూత్న కార్యక్రమాలను సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల రైతులకు మేలు జాతి దూడలు లభించడమే కాకుండా, పాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాల్లో గర్భకోశ వ్యాధుల చికిత్స, నట్టల నివారణ, గాలికుంటు మరియు గొంతువాపు వంటి ప్రాణాంతక వ్యాధులకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా చూడి కట్టని పశువులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పశువులకు అందించాల్సిన పోషకాహారం, ఖనిజ లవణాల మిశ్రమం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. చిన్న, మధ్య తరహా రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు బ్రహ్మయ్య, స్థానిక తెదేపా నేత షేక్ కరిముల్లా, పశువైద్యులు సైదయ్య, రాంబాబు, శ్వేత, గోపాలమిత్రలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రోటరీ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు



**అద్దంకి, డిసెంబరు 19, ప్రభాతవార్త**

రోటరీ క్లబ్ సింగరకొండ అద్దంకి శుక్రవారం సాయంత్రం రోటరీ ఆఫీస్ నందు రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యం లో, మిత్రుడు అద్దంకి శ్రీధర్ టీచర్ సౌజన్యంతో, సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి స్నాక్స్ స్వీట్స్ హాట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బాచినశివధర పూర్ణచంద్రరావు మాట్లాడుతూ క్రీస్తు ఆశయాలు అందరూ అనుసరించాలని, సర్వమత సమానత్వం పాటించాలని, ప్రతి పౌరున్ని విశ్వమానవ పౌరుడిగా గౌరవించాలని, పేద ధనిక తేడాలు చూపరాదని అందరూ కలిసిమెలిసి ఉండాలని ఈ నూతన క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ అళహరి హరి ప్రసాద్, రోటరీ సభ్యులు, ఊటుకూరు రామ కోటేశ్వరరావు, లెవీ ప్రసాద్, పి ఎల్ వి నరసింహారావు, చప్పిడివీరయ్య, ఎర్రమోతు రమేష్, ఈ.టి.ఎల్.శ్రీనివాసాయ, సంధిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని కామేశ్వరరావు, చండూరీ మురళిసుధాకర్రావు, అంజాద్ భాషా, మహమ్మద్ రఫీ, ఉబ్బాదేవ పాలన, పసుపులేటి ఆంజనేయులు, మహాలక్ష్మి రెడ్డి, మిత్రులు పాల్గొన్నారు.

20-12Pg 9_20-12Pg5.qxd 19/Dec/25 9:29 PM Page 1



# మోడీ-ప్రియాంక ముచ్చట్లు

## వనమూలికలతో అలర్జీ సమస్యలు తగ్గాయి

## విబిరామ్‌జీ బిల్లు ఆమోదం తీరు అభ్యంతరకరం

## ప్రధాని-మోడీ వయనాడ్ ఎంపీ మాటామంతీ

## ప్రతిపక్ష సభ్యుల తీరుతోనే అర్ధరాత్రి వరకు సభ


## ప్రధాని మోడీ సమాధానంతో ఏకీభవించిన ప్రియాంక

## ప్రతిపక్ష ఎంపీలతోనూ ప్రధాని సరదా సంభాషణ

## ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

## రాత్రంతా పార్లమెంట్ ఆవరణలో విపక్ష సభ్యుల నిరసన

## పోరాటం కొనసాగిస్తామని ఖర్గే హెచ్చరిక



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** పార్లమెంటు శీతాకాల సమావేశాలు ముగియడంతో స్పీకర్ఓంబిర్లా ఎంపిలకు తేనీటి విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలోప్రధాని నరేంద్రమోడీ, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, రామ్మోహన్‌నాయుడు పలువురు అఖిలపక్ష ఎంపిలు కూడా పాల్గొన్నారు. ప్రియాంక నియోజకవర్గం వయనాడ్ గురించి మోడీ చర్చించినట్లు తెలిసింది. ప్రియాంక మాట్లాడుతూ వయనాడ్ అడవుల్లో దొరికే ఒక మూలికను వాడు తున్నానని, దీనివల్ల తనకు అలర్జీ సమస్యలు పూర్తిగా తొలగిపోయాయయన్నారు. యేడాదిలో 125రోజులపాటు పనికల్పించే వికసిత్‌భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్)బిల్లును అర్ధరాత్రి ఆమోదించిన విషయంపై అఖిలపక్ష ఎంపిలు ప్రధానితో చర్చించారు. అర్ధరాత్రి చట్టాన్ని ఆమోదించడం ఆదర్శవంతంగా ఉండదని, కాబటి శీతకాల సమావేశాను పొడిగించాల్సి ఉండాలని ప్రధానికి చెప్పారు. అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తరచూ నిరసనలు చేపట్టడంవల్ల పార్లమెంటు సమావేశాల్లో అంతరాయాలు వచ్చాయని, అరిచీ అరిచీ వారి గొంతులు అలసిపోవద్దని తాను కోరుకుంటున్నానని మోడీ అనడంతో విపక్ష ఎంపిలతో సహా అందరు నవ్వుకున్నారు. ఈ విందులోనే ప్రధానిమోడీ ఆర్ఎస్‌పి ఎంపి ఎన్‌కే ప్రేమచంద్రన్‌ను ప్రశంసించినట్లు తేలింది. చర్చకుముందు ప్రేమదాసన్ హోంవర్క్ చేసుకుంటారని మోడీ చెప్పడంతో అందుకు కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ, కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవల్, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లు కూడా ఏకీభవించారు. సమావేశాలు మరింత పొడిగించి మీనోళ్లు నొప్పి పుట్టేలా చేయడం నాకిష్టంలేదని సరదా జోక్స్‌వేసారు. అయినా కూడా మీరంతా తగినంత సమయం చర్చకు తీసుకోగలిగారని అన్నారు. ఎంపి షెల్జాకుమారితో మాట్లాడుతూ ప్రధాని హర్యానా అసెంబ్లీ సమావేశాలను ప్రస్తావించారు. శీతాకాలసమావేశాల్లో ప్రధానిమోడీ హాజరుకాలేకపోయారు. జోర్డాన్, ఇథియోపియా, ఒమన్ మూడుదేశాల పర్యటనకు వెళ్లడంతో చివరిరోజు మాత్రమే రాగలిగారు. అదికూడా విపక్ష నిరసనల మధ్య నిరవధిక వాయిదా పడటం గమనార్హం.

**ముగిసిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు**

పార్లమెంటు శీతకాల సమావేశాలు నిరవధికంగా వాయిదాపడ్డాయి. 19 రోజులపాటునిరవధికంగా సాగిన ఈ సమావేశాల్లో కీలక బిల్లులు కూడా ఆమోదం పొందాయి. ఎంఎన్‌రేగా స్థానంలో తీసుకువచ్చిన వికసిత్‌భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్(గ్రామీణ్) బిల్లు (విబిజిరామ్‌జి)2025కు ఆమోదం తెలపడం తోపాటు శాంతిబిల్లు, బీమా సవరణ బిల్లు సబ్‌కా బీమా సబ్కీ రక్షా సవరణ బిల్లుకూడా ఉభయ సభల్లో ఆమోదం పొందాయి. అలాగే బిల్లుల రద్దు,సవరణల బిల్లు 2025కు కూడా ఆమోదం తెలిపారు. ఈ బిల్లువల్ల 71 కాలం చెల్లిన చట్టాలను రద్దుచేసి వాటిస్థానంలో సవరణలతోకూడిన చట్టం కూడా తీసుకురావచ్చు. లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే వందేమాతరం తర్వాత నిరవధిక వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్లాప్రకటించారు. రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ 269వ శీతాకాల సమావేశాలను ఇప్పటితో ముగిస్తున్నట్లు ప్రకటిస్తూ సహకరించిన సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ శీతాకాల సమావేశాల్లోనే ఉత్పాదకత పెరిగిందని, అర్థవంతమైన చర్చలకు వేదికగా రాజ్యసభ నిలిచిందని చెప్పారు.మొత్తం 15రోజులపాటు సమా వేశాలు జరిగాయి. అణు ఇంధనరంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ఆహ్వానించేందుకు ఉద్దేశించిన శాంతిబిల్లు, సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా (శాంతి)బిల్లును మూజువాణ ఓటుతో రాజ్యసభ ఆమోదించింది బీమారంగంలో విదేశీ పెట్టుబడుల పరిమితిని 100శాతానికి పెంచే బీమా సవరణ బిల్లునుప్రతిపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ ఆమోదించింది. మణిపూర్ గూడ్స్ అండ్ షర్వీసెస్ ట్యాక్స్(రెండోసవరణబిల్లు)2025కి లోక్‌సభ ఆమోదం తెలిపింది. సెంట్రల్‌ఎక్సైజ్ సవరణ బిల్లు, నేషనల్ సెక్యూరిటీ బిల్లు, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు, ఉన్నత విద్యాకమిషన్ బిల్లు, జన్‌వి శ్వాస్(నిబంధనల సవరణ)బిల్లు, దివాలా, దివాలా కోడ్ సవరణ బిల్లు, పారదర్శకంగా భూసేకరణకోసం జాతీయ రహదారుల సవరణ బిల్లు, కంపెనీల చట్టం సవరించేందుకు కార్పొరేట్ చట్టాలసవరణ బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.

**8 మంది విపక్ష సభ్యులపై సభా హక్కుల నోటీస్**

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఎనిమిది మంది విపక్ష సభ్యులుపై బిజెపి ఎంపి నిషికాంత్ దూబే తెచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసును పరిశీలనకు తీసుకున్నారు. విబిజిరామ్‌జి బిల్లుపై చర్చ సమయంలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు సభా హక్కుల కిందకు వస్తుందని పేర్కొంటూ దూబే ఇందుకు సంబంధించి నోటీసును స్పీకర్‌కు అందచేసారు. దూబే తన నోటీసులో హిబి ఏడెన్, డీన్ కురియాకోస్, ఎస్ మురసోలి, కె.గోపీనాథ్, శశికాంత్ సెంథిల్, షఫీ పరంబిల్, ఎస్ వెంకటేశన్, జోతిమణిలపేర్లను ఈ నోటీసులో చేర్చారు. వారు సభా కార్యక్రమాలకు నిరంతరం ఆటంకాలు సృష్టించారని, వ్యవసాయ గ్రామీణాభివృద్ధిమంత్రి వివరాజ్‌సింగ్ చౌహాన్ చర్చకు అడ్డుతగిలారని, సభను నడిపించే అధికారులను కూడా సజావుగా సాగనీయలేదని అన్నారు. సభా సాక్షిగా వీరు అనైతిక ప్రవర్తనకు పాల్పడ్డారని అధికారులు, మంత్రులు ప్రజాప్రతినిధులను వారి విధులను చేయనీయకుండా అడ్డుకుని సభహక్కుల ఉల్లంఘనకు పాల్పడినట్లు దూబే ఆరోపించారు. వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉండాలంటే విపక్షంపై కఠిన చర్యలు తీసుకోవాలనికోరారు. మంత్రి శివరాజ్‌సింగ్ చర్చను ప్రారంభించేసమయంలోనే విపక్ష సభ్యులు సభ వెల్‌లోకి దూసుకువచ్చి బిల్లు కాపీలను చించివేసారు. బల్లలపై నిలబడి తమ నిరసనను భారీ నినాదాలతో తెలిపారు. 20 ఏళ్లనాటి ఎంజిఎన్‌రేగా బిల్లు స్థానంలో విబి గ్రామ్‌జి 2025 బిల్లును తీసుకురావడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేసారు.






**చట్టరూపంలోకి "విబి-జిరామ్‌జీ' బిల్లు..**

ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరాలమధ్య ఎన్డీయ ప్రభుత్వం ఆధునీకరించి సవరణలు తెచ్చిన మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రూపురేఖలకు పార్లమెంటు ఆమోదం తెలిపింది. ఆమోదం తెలిపిన వెనువెంటనే రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకూడా ఆమోదముద్రవేయడంతో వెంటనే చట్టరూపంలోకి వచ్చేసింది. జిరామ్‌జి పేరిట కొత్తగా బిల్లును తెచ్చిన ఎన్డీయేపై ప్రతిపక్షాలు ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేసింది. మతతత్వాన్ని ప్రేరేపించేవిధంగా శ్రీరాముడిని రంగంలోకి తెచ్చిందని మహాత్మాగాంధీపేరును తుడిచేయాలన్న దుగ్ధతోనే ఈ మార్పులకు పూనుకున్నదని కాంగ్రెస్‌ఎంపిలు ధ్వజమెత్తారు. గ్రామీణ నిరుపేదలకు ఉపాధి హామీని మరింత మృగ్యం చేసిందని, వారికిఇచ్చిన ఉపాధి హామీని చంపేస్తోందని ఆరోపించారు. అలాగే సవరించిన ఫండింగ్ వ్యవస్థను కూడా ప్రతిపక్షం అభ్యంతరం వ్యక్తంచేసింది. సవరించిన ఫండింగ్‌లో 60శాతం కేంద్రం, 40శాతం రాష్ట్రాలునిధులు భరించాల్సి వస్తోంది. సంక్లిష్ట సాంఘిక సంక్షేమపథకం కింద ఈనిధులు చెల్లిస్తారు. దీనివల్ల అనేకరాష్ట్రాల్లో ఈపథకం అమలయ్యే అవకాశాలు తకునకవ అని సుమారుగా 56 కోట్లరూపాయలవరకూ వేతనబిల్లులుఅవుతాయని వాదించారు. కాంగ్రెస్ ఎంపి చిదంబరం మాట్లాడుతూ జీవనోపాధిని లేకుండాచేస్తోందని,భద్రత లేకుండాచేస్తోందని, గ్యారంటీలేని బిల్లును ఎందుకు తీసుకువచ్చినట్లని ప్రశ్నించారు. బిల్లు ఆమోదం పొందిన 48 గంటల్లోనే చట్టరూపంలోకి వచ్చేసింది. మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయెమెంట్ గ్యారంటీ స్కీం స్థానంలోనే ఈ కొత్త బిల్లును తీసుకువచ్చింది. 20 ఏళ్లనాటి ఈ పథకం మార్పు అత్యవసరంగా కేవలం రాజకీయ దురుద్దేశ్యంతోనే తెచ్చిందని విపక్షాలు ఆరోపించాయి. పనిదినాలు ప్రస్తుతం ఉన్న 100 నుంచి కొత్తబిల్లులో 125కి పెంచారు. ఈబిల్లుపై వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లులో కేవలం గాంధీపేరును మాత్రమే జోడించిందని చమత్కరించారు. విబి జిరామ్‌జి చట్టంగా తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఎంఎన్‌రేగాలో 90శాతం పూర్తిగా కేంద్రమే భరించిందని ఇపుడు ఈ బిల్లుకు 40శాతం రాష్ట్రాల వాటా విధిగా ఇవ్వాల్సి వస్తోందని, ఈశాన్యప్రాంతాల్లో అయితే కేవలం 10శాతం చెల్లిస్తే సరిపోయేదని ఇపుడు 40శాతం భరించాల్సి వస్తోందని ఆరోపించారు. కేంద్రం తెచ్చిన ఈ బిల్లు నిరుపేదలకు వ్యతిరేకం అని విపక్షాలు ఆరోపించాయి. జిరామ్‌జి యాంటీ పూర్ బిల్ అంటూ నినాదాలుచేసారు. బిల్లును అమలుచేసేటపుడు క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు లేవు యధావిధంగా అమల వుతుంది. పనులు పంచాయత్ లేదా ప్రోగ్రామ్ అధికారి కేటాయిస్తారు.

# అవినీతి మరకలతో మహారాష్ట్ర మంత్రుల రాజీనామాలు

**ముంబయి, డిసెంబరు 19:** మహారాష్ట్ర రాజకీయాల్లో మంత్రుల అవినీతి, కుంభకోణాలు ఒక్కొక్కటిగా తెరపైకి వస్తున్నాయిరాజకీయాల్లో పాత తరంనుంచి కొత్తతరం వరకూ అందరూ అవినీతి మరకలు అంటుకున్నవారే. ప్రభుత్వ ఫ్లాట్ పొందేందుకు నకిలీ పత్రాలు సమర్పించిన కేసులో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత, మంత్రి మాణిక్రావ్ కోకాటేకు రెండేళ్ల జైలు శిక్ష పడింది. ఈ నేపథ్యంలో ఆయన తన మంత్రి పదవికి చేసిన రాజీనామాను ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ ఆమోదించారు. దీంతో అవినీతి ఆరోపణలతో పదవులు కోల్పోయిన మంత్రుల జాబితాలో కోకాటే పేరు కూడా చేరింది. గత ఏడాది ప్రభుత్వం కోకాటేను రక్షిస్తోందంటూ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌పై తీవ్ర విమర్శలు రావడంతో ఒత్తిడి పెరిగి కోకాటే పదవి నుంచి తప్పుకోక తప్పలేదు. మహారాష్ట్ర చరిత్రలో ఇలా మంత్రులు రాజీనామా చేయడం కొత్తేమీ కాదు. సామాజిక కార్యకర్త అన్నా హజారే ఆరోపణలపై ఏర్పాటైన జస్టిస్ పీబీ సావంత్ కమిషన్ నివేదిక ఆధారంగా గతంలో సురేష్ జైన్, పదంసింహ్ పాటిల్, నవాబ్ మాలిక్ వంటి మంత్రులు పదవులు వీడాల్సి వచ్చింది. రాష్ట్ర చరిత్రలో కుంభకోణాల కారణంగా ముగ్గురు ముఖ్యమంత్రులు కూడా తమ కుర్చీలను కోల్పోయారు. సిమెంట్ కుంభకోణంలో ఎ.ఆర్. అంతులే, కుమార్తె మెడికల్ మార్కుల వివాదంలో శివాజీరావ్ నీలంగేకర్‌పాటిల్, ఆదర్శ్ హౌసింగ్ స్కామ్‌లో అశోక్ చవాన్ రాజీనామా చేశారు. ఇదే జాబితాలో ఉప ముఖ్యమంత్రులు రాంరావ్ ఆధిక్, ఛగన్ భుజ్‌బల్ (తెల్గీ స్టాంప్ పేపర్ స్కామ్) కూడా ఉన్నారు. అవినీతి ఆరోపణలతో పదవులు కోల్పోయిన కేబినెట్ మంత్రుల జాబితా చాలా పెద్దది. వీరిలో అనిల్ దేశ్‌ముఖ్, సురేష్ జైన్, నవాబ్ మాలిక్, సంజయ్ రాథోడ్ వంటి పలువురు ప్రముఖులు ఉన్నారు. వీరిలో కొందరు జైలు శిక్ష కూడా అనుభవించారు. ఆసక్తి కరంగా హోం మంత్రి పదవిని నిర్వహించిన ఛగన్ భుజ్‌బల్, పదంసింహ్ పాటిల్, అనిల్ దేశ్‌ముఖ్ ముగ్గురూ ఆర్థిక అవకతవకల నుంచి హత్య కేసుల వరకు వివిధ ఆరోపణలతో అరెస్ట్ కావడం గమనార్హం.







# ఎప్‌స్టీన్‌ఫైళ్లలో ప్రముఖుల ఫొటోలు

## బిల్‌గేట్స్ ఫొటో విడుదలచేసిన డెమోక్రాట్లు

**వాషింగ్టన్, డిసెంబరు 19:** అమెరికా రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న లైంగిక నేరగాడు జెఫ్రీ ఎప్స్టీన్ కేసులో డెమోక్రాట్లు మరిన్ని ఫొటోలను బయటపెట్టారు. ఎప్స్టీన్‌కు సంబంధించిన పూర్తి ఫైల్స్‌ను విడుదల చేయాలని ట్రంప్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే వ్యూహంలో భాగంగా, గురువారం 68 కొత్త చిత్రాలను విడుదల చేశారు. న్యాయశాఖకు విధించిన గడువు శుక్రవారంతో ముగియనుండగా ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఫొటోలలో పలు దేశాలకు చెందిన పాస్‌పోర్టులు, గుర్తింపు పత్రాలు ఉన్నాయి. ముఖ్యంగా ఉక్రెయిన్, రష్యా వంటి దేశాలకు చెందిన మహిళల పాస్‌పోర్టులు ఉండటం గమనార్హం. అంతేకాకుండా, ప్రముఖ మేధావి నోవామ్ చోమ్స్కీ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఫిల్మ్‌మేకర్ వుడీ అలెన్, ట్రంప్ మాజీ వ్యూహకర్త స్టీవ్ బానన్ వంటి ప్రముఖుల చిత్రాలు కూడా ఇందులో ఉన్నాయి. అయితే, ఈ ఫొటోలలో ఎవరూ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడినట్లుగా కనిపించడం లేదు. కొన్ని ఫొటోలు తీవ్ర అను మానాలకు తావిస్తున్నాయి. ఓ టెక్స్ట్ మెసేజ్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్‌లో 'నా స్నేహితురాలు కొందరు అమ్మాయిలను పంపింది. అమ్మాయికి 1000 డాలర్లు అడుగుతోంది. ఇప్పుడు వారిని నీకు పంపిస్తాను. బహుశా జే (జెఫ్రీ)కి ఎవరైనా నచ్చొచ్చు' అని ఉంది. మరొక చిత్రంలో, ఒక మహిళ పాదంపై లోలిటా నవలలోని వాక్యం రాసి ఉండటం కలకలం రేపుతోంది. అమెరికా ప్రజలకు పారదర్శకత అందించేందుకే ఈ ఫైల్స్‌ను విడుదల చేస్తున్నామని డెమోక్రాట్లు చెబుతున్నారు.

మరోవైపు, రిపబ్లికన్లు మాత్రం డెమోక్రాట్లు తమకు అనుకూలమైన విషయాలను ఎంచుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తు న్నారు. లైంగిక ఆరోపణల కేసులో విచారణ ఎదుర్కొంటున్న ఎప్స్టీన్, 2019లో జైలులో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఎప్స్టీన్ ఫైల్స్ ట్రాన్స్‌పరెన్సీ యాక్ట్ ప్రకారం న్యాయశాఖ వెంటనే ఫైల్స్‌ను విడుదల చేయాలని డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు.

# ఫేక్ వీడియోలపై ఎంపి సుధామూర్తి ఆందోళన



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని తాను సూచిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న వీడియో ఫేక్ అని రాజ్యసభ ఎంపి సుధామూర్తి పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టాలని తాను ఎప్పుడూ చెప్పనని ఇటువంటి డీప్‌ఫేక్ వీడియోల మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు. వైరలైన వీడియోలో అధిక రాబడులు పొందడానికి తాను సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టడానికి స్క్రీన్‌పై కనిపిస్తున్న లింక్‌పై క్లిక్ చేయమని వీక్షకులను కోరుతున్నట్లు చూపిస్తోంది. ఇప్పటికే చాలా మంది పెట్టుబడిదారులు ఇందులో చేరి, నెలకు రూ.10లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఎక్కువ మంది దీనిలో చేరుతున్నందున రిజిస్ట్రేషన్లను నేటితో ముగిస్తున్నాం. అందుకే ఇందులో చేరాలనుకునేవారు వీడియో కింద కనిపిస్తున్న లింక్ ద్వారా వెంటనే చేరండి అని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఈ వీడియోపై సుధా మూర్తి స్పందిస్తూ డీప్‌ఫేక్ వీడియోలపై ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎటువంటి పెట్టు బడులు పెట్టాలని ఎవరికీ సూచించనని ఇటువంటి వీడియోలు చూసి ఎవరూ మోస పోవద్దని కోరారు. సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

# పదవీ విరమణకు ముందు పెద్దసంఖ్యలో ఉత్తర్వులు

## సుప్రీంకోర్టు 'సిక్సర్' వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** పదవీ విరమణకు ముందు కొందరు న్యాయమూర్తులు పెద్ద సంఖ్యలో ఉత్తర్వులు జారీ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఈ ధోరణిని క్రికెట్‌లో ఆఖరి ఓవర్లలో బ్యాటర్లు సిక్సర్లు కొట్టడంతో పోల్చింది. జడ్జీలలో ఈ తరహా పోకడ పెరగడం దురదృష్టకరమని ఆందోళన వ్యక్తం చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ జిల్లా జడ్జి తన రిటైర్మెంట్‌కు 10రోజుల ముందు సస్పెన్షన్‌కు గురయ్యారు. రెండు వివాదాస్పద ఉత్తర్వులు జారీ చేశారన్న ఆరోపణలతో హైకోర్టు ఈ చర్య తీసుకుంది. దీనిని సవాలు చేస్తూ ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. "పిటిషనర్ తన రిటైర్మెంట్‌కు ముందు సిక్సర్లు కొట్టడం ప్రారంభించారు. ఇది ఒక దురదృష్టకరమైన ట్రెండ్. దీనిపై మేము ఎక్కువగా మాట్లాడాలనుకోవడం లేదని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది విపిన్ సంఘీ వాదనలు వినిపిస్తూ తన క్లయింట్‌కు మంచి సర్వీస్ రికార్డు ఉందని, కేవలం న్యాయపరమైన ఉత్తర్వుల కోసం సస్పెండ్ చేయడం సరికాదని అన్నారు. పై కోర్టులలో సవాలు చేయగల ఉత్తర్వుల కోసం క్రమశిక్షణ చర్యలు ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. అయితే, న్యాయపరమైన పొరపాట్లకు, దురుద్దేశపూర్వక ఉత్తర్వులకు మధ్య తేడా ఉందని ధర్మాసనం అభిప్రాయపడింది. కేవలం పొరపాటు జరిగి ఉంటే సస్పెండ్ చేయలేరు. కానీ ఆ ఉత్తర్వులు ఉద్దేశపూర్వకంగా, నిజాయతీ లేకుండా ఇస్తే పరిస్థితి ఏంటని సీజేఐ ప్రశ్నించారు. ఈ పిటిషన్‌పై నేరుగా జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన సుప్రీంకోర్టు, సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరుతూ ముందుగా మధ్యప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు స్వేచ్ఛనిచ్చింది. ఈ అభ్యర్థనను నాలుగు వారాల్లోగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టును ఆదేశించింది.



# ఉస్మాన్ హాదీ మృతితో బంగ్లాలో చెలరేగిన అల్లర్లు

## రెండు పత్రికా కార్యాలయాలకు నిప్పు

## భారత్ దౌత్యకార్యాలయంపై రాళ్లురువ్విన ఆందోళనకారులు

**ఢాకా, డిసెంబరు 19:** బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. యువజన నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హది (32) మృతితో దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజధాని ఢాకాలో వందలాది మంది ఆందోళనకారులు హింసకు పాల్పడ్డారు. దేశంలోని రెండు ప్రముఖ వార్తాపత్రికలైన ప్రథమ్ ఆలో , ది డైలీ స్టార్ కార్యాలయాలపై దాడి చేసి నిప్పంటించారు. నిన్న అర్ధరాత్రి సమయంలో మొదట ప్రథమ్ ఆలో కార్యాలయాన్ని చుట్టుముట్టిన నిరసనకారులు, నినాదాలు చేస్తూ భవనాన్ని ధ్వంసం చేసి, ఆ తర్వాతనిప్పు పెట్టారు. అనంతరం అక్కడి నుంచి ది డైలీ స్టార్ కార్యాలయానికి చేరుకుని దాడికి పాల్పడ్డారు. ఈ దాడితో ఆఫీసులోని జర్నలిస్టులు భవనం లోపలే చిక్కుకుపోయారు. దాదాపు 25 మంది జర్నలిస్టులు ప్రాణభయంతో టెర్రస్‌పైకి పరుగులు తీశారు. నాకు ఊపిరాడటం లేదు. అంతా పొగమయంగా ఉంది. నన్ను చంపేస్తున్నారు అంటూ ది డైలీ స్టార్ రిపోర్టర్ జైమా ఇస్లాం ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్ట్ పరిస్థితి తీవ్రతను తెలియజేసింది. సమాచారం అందుకున్న బంగ్లాదేశ్ ఆర్మీ, అగ్నిమాపక సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి భవనంలో చిక్కుకున్న 25 మంది జర్నలిస్టులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎడిటర్స్ కౌన్సిల్ ప్రెసిడెంట్ నూరుల్ కబీర్‌పై కూడా ఆందోళనకారులు దాడి చేసి కొట్టారు. ప్రస్తుతం ది డైలీ స్టార్ కార్యాలయం వద్ద సైన్యాన్ని మోహరించారు. ప్రస్తుత ప్రభుత్వానికి పరోక్ష మద్దతు ఇస్తున్న ఈ రెండు పత్రికలనే ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే దానిపై స్పష్టత రాలేదు. చిట్టగాంగ్‌లోని భారత దౌత్య కార్యాలయం, అధికారిక నివాసం సమీపంలో గుమిగూడిన ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కనిపించాయని, దహనకాండ కూడా జరిగినట్లు పోలీసులు తెలిపారు. సోషల్ మీడియాలో ఇందుకు సంబంధించిన వీడియోలు వైరల్ అయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు, ఎలాంటి నష్టం జరగకుండా హైకమిషన్ వద్ద భారీ భద్రతను మోహరించారు. హదీ మరణం తర్వాత రాత్రికి రాత్రే ఆందోళనకారులు విధ్వంసానికి పాల్పడ్డారు.

# దేశ రాజధానిని కమ్మేసిన పొగమంచు

## 152కిపైగా విమానసర్వీసులు రద్దు

## గ్రాప్-4 ఆంక్షల్లోనే కొనసాగుతున్న ఢిల్లీ

## 50శాతం వర్క్‌ఫ్రం హోం

## విద్యాసంస్థలకు కూడా ఆన్‌లైన్ క్లాసులే



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేయడంతో దృశ్య వీక్షణ తీవ్రంగా పడిపోయి విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపించింది. ఢిల్లీ విమానాశ్రయంలో ఒకే రోజు 152 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. రద్దయిన వాటిలో 79 ఇతర గమ్యస్థానాలకు వెళ్లేవి ఉంటే, 73 నగరానికి వచ్చేవి ఉన్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ క్యాట్ నిబంధనల కింద పనిచేస్తోంది. దీంతో అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులు సోషల్‌మీడియా పోస్టుల్లో సూచించారు. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పలు విమానయాన సంస్థలు కూడా వాతావరణం కారణంగా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేశాయి. పొగమంచుతో పాటు వాయు కాలుష్యం కూడా ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలి నాణ్యత సూచీ 380కి పడిపోయింది. ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడా, ఘజియాబాద్‌లలో దృశ్య స్పష్టత 100 మీటర్ల కంటే తక్కువగా నమోదైంది. దీంతో భారత వాతావరణ శాఖ నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇదే తరహా పరిస్థితి ఉత్తరప్రదేశ్‌లోనూ నెలకొంది. అక్కడ కూడా రానున్న రెండు రోజులకు పొగమంచు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాల వేగాన్ని నియంత్రించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. రేపు కాస్త ఉపశమనం లభించినా, ఆది, సోమవారాల్లో మళ్లీ దట్టమైన పొగమంచు ఏర్పడుతుందని ఐఎండీ అంచనా వేసింది. ఇదిలా ఉంటే తీవ్ర ఆంక్షలకారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు మందగించాయి. 50శాతంఇంటినుంచే పనివిధానం నడుస్తోంది. స్కూళ్లలో ఆన్‌లైన్ క్లాసులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికీ గ్రాప్-4 ఆంక్షల్లోనే దేశరాజధాని పరిసర ప్రాంతాలు కొనసాగుతున్నాయి.

# సంక్షిప్తంగా..

## బంగ్లా విద్యార్థి ఉద్యమ కీలక నాయకుడి హత్య




**ఢాకా, డిసెంబరు 19:** బంగ్లాదేశ్‌లో గతేడాది జరిగిన విద్యార్థి ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన యువ నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ (32) కన్నుమూశారు. గతవారం ఎన్నికల ప్రచారంలో ఉండగా దుండగులు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన ఆయన, సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన హాదీ నిన్న రాత్రి మృతి చెందారు. డిసెంబర్ 12న ఢాకాలోని పల్టన్ ప్రాంతంలో ఆటోరిక్షాలో ప్రచారం నిర్వహిస్తుండగా, ముసుగు ధరించిన దుండగులు ఆయన తలపై కాల్పులు జరిపారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండటంతో, బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం మెరుగైన వైద్యం కోసం ఎయిర్ అంబులెన్స్‌లో సింగపూర్‌కు తరలించింది. అయినప్పటికీ ఫలితం లేకపోయింది.

## బాండీ బీచ్ హీరోకు రూ.14 కోట్ల నజరానా



**కాన్‌బెర్రా, డిసెంబరు 19:** ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో యూదులపై ఉగ్ర దాడి ఘటన యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపాటుకు గురిచేసింది. ఈ భయానక దాడి సమయంలో అహ్మద్ అల్‌అహ్మద్ అనే వ్యక్తి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఉగ్రవాదులకు ఎదురెళ్లి గాయపడ్డిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ హీరోకు ఓ సంస్థ భారీ నజరానా అందించింది. గో ఫండ్ మీ అనే సంస్థ ఏకంగా 2.5 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లను బహుమతిగా ఇచ్చింది. అంటే మన భారత కరెన్సీలో రూ. 14.84 కోట్లు. సంస్థ ప్రతినిధులు జార్జ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అహ్మదను కలిసి ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ప్రపంచవ్యాప్తంగా 43 వేల మంది దాతలు నుంచి దీన్ని సేకరించిట్లు తెలిపారు.

## అఫ్ఘానిస్థాన్‌ను వణికించిన భూకంపం



**కాబూల్, డిసెంబరు 19:** అఫ్ఘానిస్థాన్‌లో భూకంపం సంభవించింది. శుక్రవారం ఉదయం ఒక్కసారిగా కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.1గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 10కి.మీ లోతులో భూకంపం కేంద్రం ఉన్నట్లు తెలిపింది. అయితే, భూకంపం తీవ్రత స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. ఈ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. మరోవైపు ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లోనూ భూమి కంపించింది. ఉఖ్రుల్ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాం తంలో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 2.9గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. భూమికి సుమారు 35 కిమీ లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది.

## మహువా మొయిత్రాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మోయిత్రాకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభిం చింది. ఆమెపై చార్జిషీట్ దాఖలు చేసేందుకు సిబిఐకి అనుమతిస్తూ లోక్‌పాల్ జారీ చేసిన ఉత్తర్వులను కోర్టు రద్దు చేసింది. గత నెల 21న జస్టిస్ అనిల్ ఖేతర్పాల్, హరీశ్ వైద్యనాథన్ శంకర్ నేతృత్వంలోని ధర్మాసనం మహువా మొయిత్రాకు మధ్యంతర ఉపశమనం ఇవ్వడానికి నిరాకరిస్తూ, నిర్ణయాన్ని రిజర్వ్ చేసింది. 2013 లోక్‌పాల్, లోకాయుక్త చట్టం కింద లోక్‌పాల్ అనుసరించిన ప్రక్రియ స్పష్టంగా లోపభూయిష్టంగా ఉందని మహువా మొయిత్రా తరఫు న్యాయవాదులు వాదించారు.

## ఫుల్‌టైమ్ సిఎం నేనే: సిద్ధరామయ్య మరోసారి వెల్లడి



**బెంగళూరు, డిసెంబరు 19:** కర్ణాటక సీఎం పదవిపై కొంతకాలంగా నెలకొన్న ఉత్కంఠకు సీఎం సిద్దరామయ్య తెరదించారు. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో తనకు ఎలాంటి పవర్ షేరింగ్ డీల్ లేదని, పూర్తి ఐదేళ్ల పాటు తానే సీఎంగా కొనసాగుతానని ఆయన అసెంబ్లీ వేదికగా స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం మద్దతు కూడా తనకే ఉందని సిద్దరామయ్య తేల్చిచెప్పారు. ఈరోజు ఉదయం రాష్ట్ర అసెంబ్లీలో సిద్దరామయ్య మాట్లాడుతూ "నేను గతంలో ఒకసారి పూర్తి ఐదేళ్ల పదవీకాలం పూర్తిచేశాను. ఇప్పుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాను. నా అభిప్రాయం ప్రకారం అధిష్ఠానం నా పక్షాన ఉంది. పదవిని చెరో రెండున్నరేళ్ల పంచుకోవాలన్న నిర్ణయం ఏదీ జరగలేదని అన్నారు. వారం వ్యవధిలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది రెండోసారి.

20-12Pg6exHMNWJQE 10_20-12Pg6exHMNWJQE.qxd 19/Dec/25 11:04 PM Page 1



# వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలకు ప్రకృతి ఆధారిత సేంద్రీయ ఆవిష్కరణలే పరిష్కారం

**పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావంపై జరిగిన సదస్సులో వక్తలు**




పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావంపై జరిగిన సదస్సులో ప్రసంగిస్తున్న డా. తస్లీమారిఫ్ సయ్యద్

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి:** వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలకు ప్రకృతి ఆధారిత బయో ఆవిష్కరణలే స్థిరమైన పరిష్కారమని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్ (బెంగళూరు) సంచాలకులు డా. తస్లీమారిఫ్ సయ్యద్ అన్నారు. ఈ ఆవిష్కరణల ద్వారా వ్యవసాయం, పర్యావరణం, ప్రజారోగ్యాన్ని ఏకకాలంలో మెరుగుపరచవచ్చని ఆయన స్పష్టం చేసారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో, మాలక్ష్మి గ్రూప్ సహకారంతో విజయవాడ లోని నోవోటెల్ హోటల్‌లో వాతావరణ మార్పు - పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావం" అనే అంశంపై శుక్రవారం యార్లగడ్డ శ్రీరాములు 22వ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం అమరావతి వేదికగా అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కలిగిన వారితో సామాజిక బాధ్యతగా మాలక్ష్మి గ్రూప్ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ సందర్భంగా డా. తస్లీమారిఫ్ సయ్యద్ మాట్లాడుతూ వాతావరణ మార్పు కారణంగా ఆహార భద్రతే కాక, నీటి వనరులు, మానవ ఆరోగ్యంపై ఇప్పటికే తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు సమాజం లోతైన సమాలోచన చేయవలసిన అవసరం ఉందన్నారు. మాలక్ష్మి గ్రూప్ వ్యవస్థాపకులు యార్లగడ్డ హరిశ్ చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, సమాజం, పర్యావరణ హితమే నూతన సాంకేతికతల లక్ష్యంగా ఉండాలన్న యర్లగడ్డ శ్రీరాములు ఆశయాలను కొనసాగించడానికే ఈ స్మారక ఉపన్యాసాల పరంపరను ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. యువతలో నైతికతతో కూడిన, స్థిరమైన, సామాజిక బాధ్యత గల ఆవిష్కరణలను ప్రోత్సహించడమే మాలక్ష్మి గ్రూప్ లక్ష్యమని తెలిపారు. తొలుత యార్లగడ్డ శ్రీరాములు చిత్రపటానికి దీపప్రజ్వలన చేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాలక్ష్మి ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ మండవ మాలక్ష్మి గ్రూప్ 20 సంవత్సరాల ప్రయాణాన్ని వివరించారు. శ్రీరాములు జీవితం, ఆయన అందించిన సేవలపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. శుక్రవారం నాటి మాలక్ష్మి గ్రూప్ 20వ ఫౌండేషన్ డే వేడుకల నేపథ్యంలో అతిథులు, ఆహ్వానితుల సమక్షంలో హరిశ్ చంద్ర ప్రసాద్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) రాష్ట్ర ఛైర్మన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ ప్రారంభోపన్యాసం చేసారు.



# ఉద్యాన విశ్వవిద్యాలయానికి జాతీయ పురస్కారం

డిసెంబర్ 19 ( పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి) డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీని "ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తమ విశ్వవిద్యాలయం" అవార్డు వరించింది. "ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్-2025లో భాగంగా, ఈ నెల 16 వ తేదీన విజయ్ దివస్ సందర్భంగా న్యూఢిల్లీ లోని ఎన్.డి.ఎం.సీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీకి ఈ అవార్డును వెటరన్స్ ఇండియా సంస్థ, కేంద్ర రక్షణ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీ తరఫున ప్రణాళిక, పర్యవేక్షణ మరియు మూల్యాంకన విభాగం డైరెక్టర్ డా. ఎస్. శ్రీ విజయ పద్మ ఈ కార్యక్రమానికి హాజరై అవార్డును స్వీకరించారు. దేశభక్తిని ప్రేరేపించే లక్ష్యంతో న్యూ ఢిల్లీ లోని "వెటరన్స్ ఇండియా" అనే సంస్థను మాజీ సైనికోద్యుగులు, రిటైర్డ్ ఉన్నతాధికారులు కలసి 2015 సం.లో ఏర్పాటు చేసారు. ప్రస్తుతం ఈ సంస్థలో దాదాపు 38 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. వెటరన్స్ ఇండియా సంస్థ నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రెడిటేషన్ ( ఎన్బీఏ) సహకారంతో ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా భారతదేశ ఔనత్యం ప్రచారం చేస్తూ, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ , వారిలో దేశభక్తి, జాతీయతను పెంపొందించే లక్ష్యంతో పనిచేస్తోంది. ఈ కార్యక్రమమంతా "నేషన్ ఫస్ట్, ఆల్వేస్ ఫస్ట్" అనే ఆలోచనతో కొనసాగుతోంది. సమాజ సేవ, గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత మరియు ఆహార భద్రత, యువ నాయకత్వం మరియు రైతుల అభ్యున్నతి వంటి అంశాల్లో విశ్వవిద్యాలయం చేసిన సేవలకు గాను డా. వై.ఎస్.ఆర్. హార్టికల్చరల్ యూనివర్సిటీకి "ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్-2025 ప్రదానం చేశారు. వెటరన్స్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది "వాలంటీర్ ప్యాట్రియాటిక్ రిజర్వ్ ఫోర్స్" గా నమోదు చేసుకుని, యుద్ధం, ప్రకృతి విపత్తులు మరియు జాతీయ అత్యవసర పరిస్థితుల సమయంలో దేశ సేవకు సిద్ధంగా ఉండేలా పనిచేస్తున్నారనీ డా.వై.యస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డా కె. ధనుంజయరావు సంబదిత అధికారులను, రిజిస్ట్రార్ డా.బి. శ్రీనివాసులును అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధనుంజయరావు మాట్లాడుతూ తమ యూనివర్సిటీ కి వచ్చిన ఈ అవార్డు నూతనంగా ఉపకులపతిగా బాధ్యత స్వీకరించిన తనకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో విశ్వవిద్యాలయానికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు.

# జిల్లా కేంద్రం కోసం గర్జించిన రాజంపేట

**ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు పట్టిన కూటమి నేతలు - చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు మహిళలు వినూత్నంగా నిరసన - వైసిపి ఎంపీ, ఎమ్మెల్యే రాజీనామా చేయాలని కూటమి డిమాండ్**



**రాజంపేట,డిసెంబర్19 ప్రభాతవార్త** వేలాదిమంది ప్రజల సాక్షి గా రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని,మంచి నగరంగా అభివృద్ధి చేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్కడైతే ఎన్నికల సభలో ప్రకటించారో అక్కడే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు గర్జించారు. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని ఆ పార్టీ నేతలే తూర్పారబట్టారు. ఎన్డీఏ నిర్ణయం ప్రజలు హర్షించడం లేదని గళం విప్పారు. చేసిన తప్పు సరిదిద్దకపోతే ప్రజల భావోద్వేగాలను అదుపు చేయలేమని, ప్రజలతో కలిసి పోరాటం చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. రెండు లక్షల, మంది ఓటర్లు కావాలో ఆరు లక్షల మంది ఓటర్లు కావాలో తేల్చుకోవాలని ప్రభుత్వానికి అల్టిమేట్ ఇచ్చారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ప్రజా గర్జనతో రాజంపేట జనసంద్రమైంది. వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని మారుమోగేలా నినాదాలు చేశారు. మాకు న్యాయం కావాలంటూ నినదించారు. స్థానిక ఆర్టిసి బస్టాండ్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వేలాదిమంది ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. మహిళా నేతలు వినూత్నంగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కొంగుచాపి చంద్రన్న, పవనన్న మాకు రాజంపేట జిల్లా కేంద్రం చేయాలంటూ వేడుకున్నారు. రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్‌రాజు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ తప్పిదాలే నేటి ప్రజా ఆందోళనకు కారణమని పేర్కొన్నారు. నాడు రాజంపేట జిల్లా కేంద్రం చేయకుండా అన్నమయ్య పుట్టిన గడ్డను కాదని రాయచోటి జిల్లా కేంద్రం చేసి క్షమించరాని తప్పు చేశారని స్పష్టం చేశారు. నాటి తప్పిదాలకు కారణమైన ఎంపి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి జేఏసీతో కలిసి ఉద్యమంలో పాల్గొనాలని హితవు పలికారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలనే డిమాండ్ కు టిడిపి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయి సాధిస్తామని భీమా వ్యక్తం చేశారు. రాజంపేట నియోజవర్గ జనసేన నేత ఎల్లటూరి శ్రీనివాసరాజు మాట్లాడుతూ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గాన్ని రెండు ముక్కలు చేశారని పేర్కొన్నారు మదనపల్లి ను జిల్లా కేంద్రంగా ప్రకటించి రాజంపేట ను ప్రకటించకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఎంతో ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు.

# చిన్నారిపై అత్యాచార యత్నం పోక్సో కేసు నమోదు

**మదనపల్లెక్రైమ్, డిసెంబర్ 19 ప్రభాతవార్త.** ఎనిమిదేళ్ల చిన్నారిపై ఓ యువకుడు అత్యాచార యత్నానికి ఒడిగట్టాడు. ఈ సంఘటన శుక్రవారం మదనపల్లె మండలం లో జరిగింది. బాధితులు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, వలసపల్లె పంచాయతీ, కట్లాటపల్లి కు చెందిన ఎనిమిదేళ్ల చిన్నారికి తల్లిదండ్రులు లేరు. అవ్వ చెంతనే ఉంటోంది. అవ్వే కూలి పనులు చేసుకుంటూ పాపను పోషించుకుంటూ చదివించుకుంటోంది. ఈ క్రమంలో పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన చిన్నారి ని స్థానికంగా ఉన్న వరుణ్ అనే యువకుడు మాయమాటలు చెప్పి చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, నోటికి గుడ్డకుక్కి అత్యాచారం యత్నం చేస్తుండగా స్థానికులు గమనించి అడ్డుకున్నారు. దీంతో వరుణ్ అక్కడి నుంచి పరారయ్యాడు. కూలుపనుల్లో ఉన్న అవ్వకు విషయం తెలియగానే ఇంటికి చేరు కుంది. చిన్నారి అవ్వ వెంటనే గ్రామస్తులతో కలిసి మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ చేరుకుని ఫిర్యాదు చేసింది. నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేస్తామని సీఐ కళా వెంకటరమణ తెలిపారు.

# వ్యాపారులకు రోల్‌మోడల్ స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-2025 అవార్డు గ్రహీత శ్రీరాం సుబ్బారావు

**- బులియన్ మర్చంట్ శ్రీరాం సుబ్బారావు-సుర్యాకాంతం దంపతులకు ఘన సన్మానం**



స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-2025 అవార్డు గ్రహీత జగ్గయ్యపేట జ్యూయలరీ వ్యాపారి శ్రీరాం సుబ్బారావు-సుర్యాకాంతం దంపతులను సన్మానిస్తున్న బులియన్ మర్చంట్స్.

**జగ్గయ్యపేట, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** నీతి, నిజాయితీతోపాటు నైతిక విలువలను ఆచరించటం ద్వారా ఖాతాదారుల విశ్వాసాన్ని పొందటం ప్రతి వ్యాపారికి శిరోధార్యం కావాలని, ఇందుకు నిలువెత్తు సాక్ష్యంగా స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-2025 అవార్డు గ్రహీత శ్రీరాం సుబ్బారావు ఆదర్శాన్ని పాదుకొల్పారని పలువురు వర్తక, వాణిజ్య వ్యాపార ప్రముఖులు, వక్తలు కొనియాడారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు-సూర్యాకాంతం (సునీత) దంపతులు స్టార్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అవార్డు సాధించిన విషయం పాఠకులకు తెలిసిందే. జగ్గయ్యపేట పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో బులియన్ మర్చంట్స్ ఏర్పాటుచేసిన అభినందన, సనా ్మనసభ వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా మల్లేశ్వరరావు, కార్యదర్శి గొల్లపూడి వెంకటకృష్ణారావు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, ఆర్యనైజర్ సత్యసాయి చైతన్య, జగ్గయ్యపేట నియోజకవర్గ టిడిపి సమన్వయ కమిటి సభ్యులు శ్రీరాం ధనుంజయ, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, షరాబు వర్తక సంఘ ప్రధాన కార్యదర్శి కొంకిమళ్ళ మల్లిఖార్జునరావు, రాష్ట్ర నాయకులు మహంకాళి శ్రీనివాసరావు, జెఆర్‌సి విద్యాసంస్థల ఛైర్మన్ రంగాపురం నరసింహారావు తదితర పట్టణ ప్రముఖులు పాల్గొని శ్రీరాం సుబ్బారావు దంపతులను ఘనంగా సన్మానించారు. వక్తలు ప్రసంగిస్తూ శ్రీరాం చినజయరాముడు, విశ్వనాథం సోదరులు జగ్గయ్యపేట బంగారపు వ్యాపారాలను రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు దోహదపడ్డారని, అదే రీతిలో విలువలు, సంప్రదాయాలను పాటిస్తూ శ్రీరాం సుబ్బారావు సుధీర్ఘకాలంగా బంగారం వ్యాపారాన్ని మరింతగా విస్తరించారని అభినందించారు. ఖాతాదారుల నమ్మకాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ కోల్పోకూడదనే తన తండ్రి విశ్వనాథానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కొనసాగుతున్నానని సన్మాన గ్రహీత సుబ్బారావు అన్నారు. తన తదంతరం ఇదే విధంగా విలువలను పాటిస్తూ వ్యాపారం కొనసాగించాలని తమ కుమార్తెకు సూచించానన్నారు. కాగా కార్యక్రమంలో జెఆర్‌సి, అమ్మాణి, విశ్వభారతి, స్కిల్ వొకేషనల్ జూనియర్ కాలేజీలు, కిరాణా, ఐరన్, ఫాన్సీ, క్లాత్, స్వర్ణకారవర్తక సంఘాల నేతలు సుబ్బారావు దంపతులకు ఆత్మీయ సన్మానంచేశారు.

# మద్యం కోసం రూ.10 ఇవ్వలేదని వ్యక్తిని హత్య చేసిన బాలుడు

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఓ మైనర్ బాలుడు మద్యం తాగేందుకు రూ.10 ఇవ్వలేదని తాతాజీ అనే వ్యక్తిపై దాడిచేసి హత్య చేశాడు. ఆ తరువాత బాలుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఈ ఘటన విజయవాడలోని కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చిట్టీనగర్ లౌక్య బార్ దగ్గర గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. మైనర్ బాలుడు తాగిన మత్తులో మద్యం కోసం డబ్బులు సరిపోలేదని తాతాజీ (48)ని రూ.10 ఇవ్వాలని అడిగాడు. తాతాజీ పది రూపాయలు ఇచ్చేందుకు నిరాకరించడంతో విచక్షణ కోల్పోయిన మైనర్ బాలుడు కత్తితో అతనిపై దాడి చేశాడు.

తాతాజీ తాపీ పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మంగళగిరి నులకపేట ప్రాంతంలో ఉండేవాడు. పనికోసం విజయవాడలో జీవనం సాగిస్తున్నాడు. మైనర్ బాలుడు దాడి చేయడంతో తాతాజీ కిందపడిపోయాడు. రక్తపు మడుగులో పడిఉన్న తాతాజీని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే అతను మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు.. నిందితుడిని సీసీ కెమెరాలు ఆధారంగా పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు

# జెవివి రాష్ట్ర కన్వీనర్ కుమారుడి నేత్రదానం



జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ కుమారుడి నేత్రదానం చేస్తున్న దృశ్యం

**అనంతపురం, డిసెంబర్ 19 ప్రభాతవార్త బ్యూరో** విశ్రాంత ఉపాధ్యాయుడు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకె భాస్కర్ కుమారుడు సాకె కిరణ్ కుమార్(21 సంవత్సరాలు)అనారోగ్యంతో ఉదయం 7 గంటలకు మృతి చెందారు. తన కుమారుడి మరణం ఎంతో బాధ కలిగించినప్పటికీ అతడు చనిపోయిన కంటి చూపు లేని అభాగ్యులకు చూపు కలిగించడమే కాకుండా వారిలో తమ బిడ్డని సజీవంగా చూడాలనే ఉద్దేశంతో నేత్రాలను రెడ్ క్రాస్ సొసైటీకి దానం చేశారు.ఒక వ్యక్తి మరణించినప్పటికీ తనలో ఉన్న అవయవాలు కొద్దికాలం పాటు పనిచేస్తాయని అంతలోపు వాటిని వేరే వారికి దానంగా ఇవ్వడం ఎంతో ఉపయోగమని వైద్యశాస్త్రం తెలియజేస్తుంది. ఇదే విషయాన్ని గత 35 సంవత్సరాలుగా నేను పనిచేస్తున్న జన విజ్ఞాన వేదికలో తెలుసుకోవడమే కాక ఇతరులకు కూడా తెలియజేశానని,అందులో భాగంగానే నా కుమారుడి నేత్రాలు ఇతరులకు ఉపయోగపడే విధంగా చేసినట్లు సాకే భాస్కర్ తెలిపారు.

# శ్రీశైలం దర్శన వేళలో మార్పులు: ఇఒ శ్రీనివాసరావు

**శ్రీశైలంప్రాజెక్టు,డిసెంబరు19,ప్రభాతవార్త** శ్రీశైల క్షేత్రంకు తరలివచ్చే భక్తుల విన్నపం మేరకు శ్రీస్వామివారి స్పర్శదర్శన సమయాలను పెంచుతూ దర్శన వేళలో మార్పులు చేయడం జరిగిందని శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.ప్రతి శని, ఆది, సోమవారాలు, పర్వదినాలు మరియు ప్రభుత్వ సెలవురోజులలో(ప్రత్యేక రోజులల్లోతప్ప) నిర్దిష్ట వేళలలో మూడు విడతలుగా భక్తులకు శ్రీస్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించడం జరిగిందని అన్నారు. ఉదయం 4.30 నుండి 6.00 గంటల వరకు శ్రీస్వామివారి అలంకార దర్శనం,వి.ఐ.పి బ్రేక్ ఉదయం 6.30 నుండి 7.00 ల వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం.మెదటి విడత ఉదయం 7.00 నుండి గం.8.30,10.30 వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం.విఐపి బ్రేక్ 10.30 నుండి 11.30 వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం.రెండవ విడత ఉదయం 11.45 నుండి మధ్యాహ్నం 2.00 ల వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం,2.00 నుండి 4.00ల నుండి 7.00ల వరకు శ్రీస్వామివారి అలంకార దర్శనం,విఐపి బ్రేక్ రాత్రి 7.45 నుడి గం.9.00ల వరకు శ్రీస్వామివారి అలంకార దర్శనం,మూడవ విడత గం.9.00 ల నుండి గం.11.00ల వరకు శ్రీస్వామివారి స్పర్శదర్శనం కల్పించబడిందని తెలిపారు. శ్రీస్వామివారి స్పర్శదర్శన సమయాలు అమలు జనవరి 2026వ సంవత్సరం నుండి అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. అదే విధంగా భక్తులు ఆన్‌లైన్ టికెట్ల కోసం రాష్ట్ర దేవదాయశాఖ అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ ఏపి టెంపుల్స్.ఏపి.గోవి.ఇన్‌లేదా దేవస్థానం అధికారిక వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ శ్రీశైలదేవస్థానం.ఓఆర్‌జిలను మాత్రమే వినియేగించుకోవాలని అన్నారు.మనమిత్ర వాట్సాప్(9552300009)ద్వారా కూడా శ్రీస్వామివారి స్పర్శదర్శనం, అతి శీఘ్రదర్శనం, శీఘ్రదర్శనం, టికేట్లను మరియు ఆర్జితసేవా టికేట్లను పొందవచ్చునని పేర్కన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా శ్రీశైలదేవస్థానం ఉద్యోగులకు కూడా ప్రత్యేక విధులను కూడా కేటాయించడం జరిగిందని అన్నారు.



వివరాలు వెల్లడిపరుస్తున్న ఈఓ శ్రీనివాసరావు

# జాతీయ రోలర్ స్కేటింగ్‌లో విజయవాడ క్రీడాకారులకు పతకాలు పంట..

**- స్కేటర్లకు క్రీడాశాఖ మండిపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి మంత్రి అభినందనలు..**



**విజయవాడ, డిసెంబరు 19,ప్రభాతవార్త ప్రతినిధి :** విశాఖ వేదికగా ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహించిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయవాడకు చెందిన అంచిత, దినేష్, దిరాజ్, తనుజ, తన్మయి పతకం సాధించడం అభినందనీయ మని, క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన కోచ్ లు మహమ్మద్ ఖాజా, నాగుల్ మీరను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వీరిని అభినందించారు. రోలర్ స్కేటింగ్ అండర్ 18, 15, 12 విభాగంలో 1 బంగారు, 4 కాంస్య, 5 రజతం పతకాలు సాధించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేలా ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు మహమ్మద్ ఖాజా టీమ్, టీమ్ నాగుల్ మీర , పలువురు కోచులు ఉన్నారు.



# కన్నుల పండువగా అమావాస్య ఉత్సవం

**శ్రీకాళహస్తి,డిసెంబర్ 19 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ధనుర్మాస అమావాస్య సందర్భంగా శుక్రవారం కన్నుల పండువగా ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో నెల నెలా ఒక ఉత్సవంను నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో అమావాస్య సందర్భంగా ఉత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా కనబడింది. స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో కన్నులు మిరుమిట్లు కొల్పొనట్లు ముస్తాబు చేసారు. బోయిలు మోసుకుంటూ మేళ తాళాలతో పట్టణంలోని వాహనాల మండపం వద్దకు చేర్చారు.అక్కడ పల్లకిల్లో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు.ఉత్సవంతో పాటు ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించగా ఆలయ మిరాసి దారుల కుటుంబం నుంచి దండనాధికారిగా డాక్టర్ పరశురాం గురుకుల్(అచ్చితా గురుకుల్) హాజరయ్యారు.

# క్రికెట్ బెట్టింగ్‌లో వైసిపి నేత కొడాలి నాని అనుచరుని అరెస్ట్

**గుడివాడ( విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి, వైసీపీ కీలక నేత కొడాలి నానికి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ప్రధాన అనుచరుడు, రాజకీయ సలహాదారుడు కూనసాని వినోద్‌ను గుడివాడ వన్ టౌన్ పోలీసులు ఇవాళ(శుక్రవారం) అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతుండగా వినోద్‌ను పట్టుకున్నారు. వినోద్ దగ్గరి నుంచి రూ.50వేలు, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వినోద్‌పై గతంలో పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారని అభియోగాలున్నాయి.ఆయన బెటింగ్‌ను నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి.ఈ క్రమంలో వినోద్ తన నిర్వహణలోని ఓ పేకాట క్లబ్బులో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను ఆడిస్తున్నారనే సమాచారం అందడంతో వెంటనే గుడివాడ వన్ టౌన్ పోలీసులు రంగంలోకి దిగారు.

ఈ క్రమంలో వినోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో కీలక అంశాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం.

# వైసిపి నాయకులు మాట్లాడేవన్నీ శుద్ధ అబద్ధాలు - ఎపి శాప్ ఛైర్మన్ రవినాయుడు..

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి గారు చేస్తున్న హడావిడి చూస్తుంటే అది రాజకీయ పోరాటంలా లేదు, ఒక భారీ బడ్జెట్ సినిమా షూటింగ్‌లా ఉందని ప్రజలు నవ్వుకుంటున్నారని ఏపీ శాప్ ఛైర్మన్ రవి నాయుడు అన్నారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆస్కార్ అవార్డులు ఇచ్చే వారు జగన్ నటనను చూస్తే, ఆయనకు అంతకంటే పెద్ద అవార్డు ఏదైనా ఉంటే ఇవ్వాలని భావిస్తారు. రాజమౌళి లాంటి దిగ్గజ దర్శకులు కూడా జగన్ వేస్తున్న వేషాలు, పీపీపీ విధానంపై ఆయన చేస్తున్న "షో" చూసి బిత్తరపోతారని విమర్శించారు. కోటి సంతకాలు అంటూ మూటలు కట్టి, పెద్ద పెద్ద వాహనాల్లో ప్రదర్శిస్తూ జగన్ ఒక పెద్ద నాటకానికి తెరలేపారు. అసలు ఆ మూటల్లో ఉన్నవి సంతకాలేనా? ఏ నియోజకవర్గంలో, ఏ బూత్ లెవల్‌లో సంతకాలు తీసుకున్నారో చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? నియోజకవర్గానికి లక్ష సంతకాలు అంటున్న జగన్, కనీసం ఆయన వెంట తిరిగే కార్యకర్తలతో కూడా సంతకాలు పెట్టించలేకపోయారు. కేవలం డ్రోన్లు, కెమెరాలతో విజువల్స్ క్రియేట్ చేసి ఏదో జరిగిపోతోందని బిల్డప్ ఇస్తున్నారు. ఢిల్లీలో వైసీపీ ఎంపీ గురుమూర్తి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలో పీపీపీ విధానానికి మద్దతుగా సంతకం చేస్తారు.. కానీ ఇక్కడ జగన్ మాత్రం డ్రామాలు ఆడుతారు. "జగన్మోహన్ రెడ్డి తన రాజకీయ లబ్ధి కోసం దేశవ్యాప్త విధానాలను కూడా వక్రీకరిస్తున్నారు. పీపీపీ విధానం అనేది కేవలం ఆంధ్రప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాదు.నరేంద్ర మోదీ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారు దేశవ్యాప్తంగా ఇదే మోడల్‌ను ప్రోత్సహిస్తున్నారు.

# గుడివాడ పిఎస్‌కు విచారణకు హాజరైన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు అర్జున్‌రెడ్డి

**గుడివాడ(విజయవాడ).డిసెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు అర్జున్ రెడ్డి ఈరోజు (శుక్రవారం) గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు విచారణ నిమిత్తం హాజరయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, వారి కుటుంబ సభ్యుల చిత్రాలను అసభ్యంగా మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారంటూ గత ఏడాది అర్జున్ రెడ్డిపై గుడివాడలో కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో సోమవారం రాత్రి పోలీసుల నుంచి అర్జున్ రెడ్డి నోటీసులు అందుకున్నారు. విచారణ నిమిత్తం నేడు గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు అర్జున్ రెడ్డి హాజరయ్యారు. అప్పట్లో అరెస్ట్ చేసేందుకు గుడివాడ పోలీసులు యత్నించగా అర్జున్ విదేశాలకు వెళ్లిపోయారు. తరువాత పోలీసులు లుక్ అవుట్ సర్క్యూలర్ జారీ చేశారు. ఈనెల ఎనిమిదో తేదీ రాత్రి విదేశాల నుండి తిరిగి రావడంతో అర్జున్ రెడ్డిని శంషాబాద్ ఎయిర్‌పోర్టుఇమిగ్రేషన్ అధికారులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఏప పోలీసు బృందాలు.. అతడిని అదుపులోకి తీసుకుని సీఆర్పీసీ సెక్షన్ 41 ఏ కింద నోటీసులు అందజేశారు. ఉమ్మడి కడప,జిల్లాల్లో అర్జున్ రెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి.

# ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

**తిరుపతి,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలంఅడవి నుండి అక్రమంగా ఎర్రచందనం దుంగలను రవాణ చేస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు పట్టుబడిన ముద్దాయిలకు ఈ కేసులో ఐదేళ్ళ జైలుశిక్ష, మూడులక్షల రూపాయలు జరిమానా న్యాయస్థానం విధించింది. భాకరాపేటపోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన ఎర్రచందనం కేసులో నిందితులు కలికిరిమండలం అచ్చర్ల గోల్లపల్లికి చెందిన నల్లకాసుల రెడ్డప్ప(33), పుల్లనాగరాజు అనే గోవిందు(35), యర్రవారిపాళెంమండలం ముడిమి చంగయ్య,గొల్లపల్లికిచెందిన వెంకటాద్రిలపై నమోదైన కేసులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అన్ని ఆదారాలతో కోర్టులో కేసులో వాదించారు. ఈ కేసు విచారణ పర్యవేక్షణ సక్రకమంగా అందించడంతో నలుగురు ముద్దాయిలకు ఒక్కొక్కరికి ఐదేళ్ళజైలు, మూడులక్షల రూపాయలు జరిమానా న్యాయమూర్తి విధిస్తూ తీర్పునిచ్చారని టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

# ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ ప్లాన్‌లకు సవరణలు, విధి విధానాలు ఖరారు

### - తాజాగా జిఓ విడుదల చేసిన పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్

**విజయవాడ,డిసెంబరు19,ప్రభాతవార్తప్రతినిధి:** ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా భవన నిర్మాణ ప్లాన్‌లకు సవరణ చేసిన ప్రభుత్వం శుక్రవారం విధి విధానాలు ఖరారు చేసింది. ఈ ఏడాది అక్టోబరు 13న టౌన్‌ప్లానింగ్ భవన నిర్మాణాలకు సంబంధించిన ముసాయిదా విడుదల చేసింది దీనిపై అభిప్రాయాలు, అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం తుది నిబంధనలు విడుదల చేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి సురేష్‌కుమార్ జిఓ విడుదల చేశారు. భవన నిర్మాణ ప్లాను 2 017లో సెక్షన్ 2లోని సబ్‌సెక్షన్ 17 క్లాస్ హెచ్‌లో 24 మీటర్ల కంటే ఎత్తయిన భవనాలకు ఎనర్జీ కన్జర్వేషన్ అండ్ సస్టెయినబుల్ బిల్డింగ్ కోడ్ (ఇసిఎస్‌బిసి) నిబంధనలు వర్తింపజేయాలని పేర్కొన్నారు. నివాస భవనాలను ఎకోనివాస్ సంహిత (ఇఎన్ఎస్)కు అనుగుణంగా కోడ్‌లో చేర్చనున్నారని వివరించారు. అలాగే 24 మీటర్ల కంటే ఎత్తయిన భవనాలను కచ్చితంగా అగ్నిమాపకశాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. అనంతరమే అదనపు అంతస్తులకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తొమ్మిది మీటర్ల కంటే తక్కువ వెడల్పు ఉన్న రోడ్డులో 10 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో నిర్మాణాలకు అనుమతి ఇవ్వొచ్చని,

అయితే అందులో ప్రభావిత స్థలాన్ని స్థానిక సంస్థకు గిఫ్ట్‌డీడ్ రూపంలో ఇవ్వాలని పేర్కొన్నారు. తొమ్మిది మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న రోడ్లలో 15 మీటర్ల ఎత్తు వరకూ అనుమతులు ఇవ్వొచ్చని కొత్త నిబంధనల్లో తెలిపారు. టవర్‌లైన్లు ఉన్న స్థలాన్ని గ్రీన్‌బెల్టుగా మార్చాలన్నారు. 4 వేల చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న భవనాలు ఎపిఇఎన్ఎస్ నిబంధనలు వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఆక్యుపెన్సీ ధ్రువపత్రం తీసుకోవాలంటే ఎపిఇఎన్ఎస్ నిర్ధారణ అనుమతి తీసుకోవాలని సూచించారు. కొత్తగా పేర్కొన్న నిబంధనలో అభివృద్ధి చేసిన నిర్మాణంలో బహిరంగ ప్రదేశాలను నివాస సంక్షేమ సంఘం తరపున బదిలీ చేసేలా అఫిడవిట్ సమర్పించాలని సూచించారు. భారీ అంతస్తుల భవనాల్లో స్కైవాక్, స్కైపార్కు, స్కై బ్రిడ్జికి అనుమతినివ్వాలని నిర్ణయించారు.

నిబంధనలు అమలు చేసే భవనాలకు 20 శాతం ఫీజులపై రాయితీ ఇవ్వొచ్చని తెలిపారు. అలాగే అభివృద్ధి ఛార్జీలను నాలుగు సమాన వాయిదాల్లో కట్టచ్చని పేర్కొన్నారు.

ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ పొందిన మూడేళ్లలో ఆస్తిని అమ్మితే 20 శాతం స్టాంపు డ్యూటీ తగ్గించనున్నారు.



# మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది: గవర్నర్ అబ్దుల్ నజీర్

విజయవాడ ప్రభాతవార్త డిసెంబర్ 19 విజయవాడ, డిసెంబర్ 19: ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ శుక్రవారం లోక్ భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ, భారత సాయుధ దళాలకు భారతీయులందరి హృదయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న జరుపుకునే సాయుధ దళాల పతాక దినోత్సవం వారి శౌర్యం, విధి పట్ల అంకితభావం మరియు అత్యున్నత స్థాయి నైపుణ్యానికి అభివందనం చేయడానికి ఒక ప్రత్యేక సందర్భం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు సైనిక సంక్షేమ శాఖ వారి సమస్యలను పరిష్కరించడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాయని గవర్నర్ చెప్పారు గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్, సైనిక సంక్షేమ శాఖ మాజీ సైనికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ చర్యల సంకలనం అయిన ఖిమార్గదర్శిఖిని విడుదల చేశారు. అనంతరం మేజర్ (స్వర్గీయ) టి.ఎస్.టి. భరద్వాజ్ తండ్రి శ్రీ టి. ఉపేంద్ర కుమార్, నాయక్ (స్వర్గీయ) వై. రాజు భార్య శ్రీమతి వై. గౌతమి, హవల్దార్ వి. సుబ్బయ్య భార్య శ్రీమతి జి. లీలావతి, ఎస్.డబ్ల్యూ.ఆర్ పి. కార్తీక్ తల్లి శ్రీమతి పి. సెల్వి, హవల్దార్ జి. శివశంకర రావు భార్య శ్రీమతి జి. లక్ష్మి ్మ, శౌర్య పురస్కార గ్రహీతలు లెఫ్టినెంట్ కల్నల్ పి. మస్తాన్ రెడ్డి, ఎస్.ఎం., గ్రూప్ కెప్టెన్ అబ్దుల్ రెహమాన్, వి.ఎస్.ఎం., మరియు విశిష్ట విజేతలు కల్నల్ కొలసాని శ్రీనివాస్ (రిటైర్డ్) మరియు కెప్టెన్ సి.డి.ఎన్.వి. ప్రసాద్ (రిటైర్డ్)లను సన్మానించి నగదు బహుమతులు అందజేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి గరిష్ట విరాళాలు సేకరించినందుకు జిల్లా కలెక్టర్లు శ్రీమతి ఎ. తమీమ్ అన్సరియా, గుంటూరు, డాక్టర్ వి. వినోద్ కుమార్, బాపట్ల, శ్రీమతి కీర్తి చెకూరి, తూర్పు గోదావరి, మరియు జిల్లా సైనిక్ సంక్షేమ అధికారులు కెప్టెన్ పి. సత్య ప్రసాద్ (రిటైర్డ్), తూర్పు గోదావరి మరియు శ్రీమతి గుణశీల, గుంటూరు బాపట్లను కూడా గవర్నర్ సన్మానించారు. సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి. వెంకట రెడ్డి, వి.ఎస్.ఎం. (రిటైర్డ్), సైనిక సంక్షేమ శాఖ కార్యకలాపాలపై నివేదికను సమర్పించారు. హోం, విపత్తు నిర్వహణ మరియు సైనిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత సభను ఉద్దేశించి ప్రసంగించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ జి. అనంత రాము, హోం శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ కుమార్ విశ్వజీత్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి శ్రీ పి.ఎస్. సూర్యప్రకాష్, లోక్ భవన్ మరియు సైనిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.



## సిఎం చంద్రబాబుకు బ్రిక్స్ ఆల్బమ్ అందించిన ఎంపి శబరి

**నంద్యాల, డిసెంబరు 19 ప్రభాతవార్త:** ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదములు సార్ అంటూ న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడకు బ్రిక్స్ 11వ శిఖరాగ్ర సమావేశం ఆల్బమ్‌ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రెజిల్ (బ్రాసీలియా)లో నిర్వహించిన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ పుస్తకంలో బ్రెజిల్‌లో జరిగిన 11వ బ్రిక్స్ సమావేశాల్లో నేను పాల్గొన్న ఫోటోలు, ప్రసంగాలు, చర్చలు పొందుపరచడం అదృష్టంగా, గర్వకారణంగా, అపార గౌరవంగా, అనుభవంగా భావిస్తున్నానని, ప్రపంచ స్థాయిలో మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు (ఎఐ), వాతావరణ మార్పు, ప్రజాస్వామ్య విలువలు వంటి కీలక అంశాలపై జరిగిన చర్చల్లో భారతదేశం తరఫున స్వరం వినిపించడం నిజంగా ఆనందాన్ని ఇచ్చింది.

# దుర్గమ్మవారి సేవలో మంత్రి ఆనం



**ఇంద్రకీలాద్రి, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** శ్రీ కనకదుర్గ అమ్మవారిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆయన భక్తులతో ముచ్చటించి ఆన్ లైన్ సేవలు, భక్తుల సంతృప్తి స్థాయి తెలుసుకున్నారు. అన్ని ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు తెలిపారు. ఆయన ఈవో ఛాంబర్లో దేవాలయంలో నగదు రహిత సేవల స్థాయి, ఐవిఆర్ ఎస్ కాల్స్ ద్వారా భక్తుల సంతృప్తి స్థాయి, ఆన్ లైన్ సేవలు పెంపుదల గురించి ఆలయ ఈవో నుండి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బడేటి ధర్మారావు, పి. రాఘవ రాజు, ఎ. శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు వెలగపూడి శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.

– నిత్యాన్నదానానికి విరాళం: శ్రీ అమ్మవారి ఆలయంలో జరిగే అన్న ప్రసాద వితరణ నిమిత్తం ప్రకాశం జిల్లా, పుల్లెల చెరువు వాస్తవ్యులు టి బ్రహ్మానంద రెడ్డి కుటుంబ సభ్యులు టి కోటిరెడ్డి వారి పేరిట రూ.1,01,116 రూపాయలు మరియు విశాఖపట్నం, గాజువాకకు చెందిన పీతల సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.1,00,000 రూపాయలను మరియు గుంటూరుజిల్లా, తాడేపల్లికి చెందిన కొండిశెట్టి వెంకట విటల్ భాస్కర్ కుటుంబ సభ్యులు కె సత్యనారాయణమ్మ, అంజయ్య నాయుడు మరియు కుటుంబ సభ్యులు వారి పేరిట రూ.1,00,116 రూపాయలు అన్న ప్రసాద వితరణ నిమిత్తం ఆలయ అధికారులను కలిసి విరాళంగా అందజేశారు. దాతలకు దుర్గమ్మవారి దర్శనం ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి : మంత్రి సత్యప్రసాద్



**విజయవాడ, డిసెంబర్ 19, ప్రభాతవార్త ప్రతినిధి :** రెవెన్యూ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ రెవెన్యూ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ విఆర్వో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ విఆర్ఏ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, ఏపి గ్రామసర్వేయర్‌ల అసోసియేషన్ నాయకులు మంత్రిని కలిసి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ప్రమోషన్‌లు ఇవ్వాలని మూడు సంఘాల నాయకులు కోరారు. అధికారులతో సంప్రదించి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. విఆర్వో అసోసియేషన్ నాయకులు రవీంద్ర మాట్లాడుతూ ప్రతిరోజూ సచివాలయంకు వెళ్ళి హాజరు వేయించుకోవటం ఇబ్బందిగా ఉందని తాము ఎక్కడ పనిలో ఉంటే అక్కడ హాజరు వేసుకునే వెసులుబాటు ఇవ్వాలని మంత్రిని కోరారు. రెవెన్యూశాఖ పనిలో ఉన్నప్పుడు కూడా వేరే విధులు కేటాయిస్తూ సచివాలయ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని దీని వల్ల రెవెన్యూ పని జాప్యం జరుగుతుందని ఫిర్యాదు చేసారు. సచివాలయాల్లో ఒకంప్యూటర్ ఇస్తే ఈఆఫీస్ ద్వారా అన్ని పనులు సకాలంలో చేయగలుగుతామని విన్నవించారు. తమను టెక్నికల్ పోస్టులుగా గుర్తించాలని సర్వేయర్ అసోసియేషన్ నాయకులు కోరారు. వీరి సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. రెవెన్యూశాఖపై అవినీతి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయని అవినీతికి ఆస్కారం లేకుండా పనిచేయాలని సూచించారు. రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని మంత్రి అనగాని ఆదేశించారు.



## శ్రీవారి సేవలో న్యాయమూర్తులు

**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ మంచిజరగాలని స్వామివారిని ప్రార్థించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. శుక్రవారం ఉదయం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్‌మెహతా, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు, టాటాగ్రూప్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ కుటుంబ సభ్యులతో కలసి విఐపి బ్రేక్‌లో వేర్వేరుగా శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేదపండితులువేదాశీర్వచనం చేశారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## అలిపిరిలో అత్యాధునిక లగేజీ స్కానర్‌కు ఇండియన్‌బ్యాంకు భారీ విరాళం -రూ.37.97లక్షలు అందజేత

**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యం దేశవిదేశాల నుండి తిరుమలకు వస్తున్న యాత్రికుల వాహనాలను, లగేజీలను మరింత నిశితంగా తనిఖీచేసేందుకు అవసరమైన అత్యాధుని లగేజీ స్కానర్‌కోసం ఇండియన్ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ భారీ విరాళంఅందించారు. ప్రణేశ్‌కుమార్ 37,97,508రూపాయలు డిడిలను శుక్రవారం సాయంత్రం టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి తిరుమలలో అందజేశారు. తిరుమలకు వచ్చే భక్తుల లగేజీలను మరింతగా తనిఖీ చేసేందుకు అసవరమైన లగేజీస్కానర్‌కు ఈవిరాళం అందించినట్లు ఆ బ్యాంకు ఫీల్డ్ జనరల్ మేనేజర్ ప్రణేశ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్‌బ్యాంకు జోనల్‌మేనేజర్ ఎం.సెల్వరాజ్, డిప్యూటీ జోనల్ మేనేజర్ ఇందిరా, తిరుమల శాఖ బ్రాంచ్‌మేనేజర్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

# ఆభా ఖాతాల్లో మనమే టాప్ : చక్రధరబాబు

**గన్నవరం, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఆభా) ఖాతాలను సృష్టించటంలో దేశంలోనే మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని రాష్ట్రడైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధరబాబు తెలిపారు. రాష్ట్రజనాభాలో 4.84 కోట్లమందికి ఆభాఖాతాలు రూపొందించినట్లు ఆయన చెప్పారు. శుక్రవారం మంగళగిరిలోని హాయ్‌ల్యాండ్‌లో జరిగిన సదస్సులో చంద్రధరబాబు మాట్లాడుతూ వైద్యరంగానికి చెందిన వైద్యులతోపాటు ఇతర సిబ్బందిలో 65,242మంది వివరాలు కూడా రిజిస్ట్రీలో నమోదైనట్లు తెలిపారు. 26,083వైద్యశాలల వివరాలు, రిజిస్ట్రీలో నమోదు కాగా ఇందులో అన్ని రకాల ప్రభుత్వవైద్యశాలలు ఉన్నాయని, ఆభాఖాతాలు పొందిన వారిలో 7,50కోట్లు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు ఆభాతో అనుసంధానమైనట్లు ఆయన వివరించారు. ఆభా సాయంతో రోగులు వైద్యశాలలకు వెళ్ళినపుడు గతంలో తీసుకున్న చికిత్సల వివరాలు, ల్యాబ్ రిపోర్టులు ఇతర సమాచారం డిజిటల్‌గా భద్రపరచేందుకు అవకాశం ఉంటుందన్నారు.

# సైనికుల త్యాగాలవల్లే మనం క్షేమంగా ఉన్నాం : హోంమంత్రి అనిత

**విజయవాడ(గన్నవరం), డిసెంబర్ 19, ప్రభాతవార్త :** దేశరక్షణలో సైనికుల త్యాగాలు మరువలేనివని, వారి త్యాగాల ఫలితంగానే దేశంలో ప్రజలందరూ క్షేమంగా ఉంటున్నారని రాష్ట్రహోంమంత్రి వంగలపూడి అనిత సైనికులను కొనియాడారు. సాయుధ దళాల జెండా కార్యక్రమం శుక్రవారం ఉదయం లోకభవన్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్రగవర్నర్ అబ్దుల్ నజీర్, హోం మంత్రి అనితలు పాల్గొన్నారు. ఈసందర్భంగా అనిత మాట్లాడుతూ సాయుధ దళాల జెండా కార్యక్రమం అంటే దేశంకోసం ప్రాణాలు అర్పించిన సైనికులను గుర్తుచేసుకుని వారికి కృతజ్ఞతలు తెలిపే రోజన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ చలి, మంచు, జోరువానను లెక్క చేయకుండా దేశరక్షణే ధ్యేయంగా అహర్నిశలు శ్రమిస్తున్న సైనికులకు ఏమిచ్చినా వారి రుణం తీర్చుకోలేమన్నారు. మన సైనికులకు ఆయుధాలు బలం కాదని, ధైర్యమే వారికి బలంగా పేర్కొన్నారు. మన దేశంలోని సైనికులు కేవలం యుద్ధాల్లోనే కాకుండా ప్రకృతి వైపరీత్యాలైన భూకంపాలు, తుఫాన్‌లు, వరదలు, కొండచరియలు విరిగిపడినప్పుడు తక్షణమే స్పందించి ప్రజలను రక్షించేందుకు ముందుంటారని ప్రశంసించారు. దేశరక్షణలో ప్రాణత్యాగం చేసిన, గాయపడిన సైనికుల కుటుంబాలకు అందరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. సాయుధ దళాల జెండా నిధికి విరాళాలు ఇస్తున్న ప్రతిఒక్కరికి మంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సైనిక్ సంక్షేమ కార్పోరేషన్ ఏర్పాటు చేసి రూ.10కోట్ల కార్పస్ పంఢ్‌ను కేటాయించినట్లు చెప్పారు. 2024 జూన్ నుండి ఇప్పటి వరకు మరణించిన సైనికుల కుటుంబాలకు చెందిన అర్హులైన 13ని కారుణ్యనియామకంలో ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు. ఈసందర్భంగా గవర్నర్ నజీర్ మాట్లాడుతూ దేశరక్షణకు కృషిచేస్తున్న సైనికులకు ప్రతిఒక్కరూ మద్దతు తెలపాలని కోరారు. జెండా నిధికి ఎన్‌జిఓసంఘం ఇస్తున్న సహకారం మరువలేదన్నారు. ఈకార్యక్రమంలో ఎన్‌జిఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



## టిటిడి పథకాలకు రూ.20లక్షలు విరాళం

**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకుదాతలు తమవంతూగా విరాళాలందిస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన హిమశ్రియ దంత టిటిడి స్విమ్స్‌ట్రస్ట్‌కు 10లక్షలురూపాయలు, ఫ్లాష్‌లైన్ ఇఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీప్రాణదానట్రస్ట్‌కు 10లక్షలు రూపాయలు డిడిలను దాతలు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి అందజేశారు.

# ప్రభుత్వంపై జనసేన నేత తిరుగుబాటు

**విజయవాడ, డిసెంబర్ 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రతిపక్షం సరైన పాత్రపోషించటంలేదనో..లేక మరేదో కారణం చేతనో జనసేన నాయకుడు ప్రభుత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేసాడు. సాక్షాత్తు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంత్రిగా ఉన్న పంచాయతీరాజ్ శాఖలో సమస్య పరిష్కరించటంలేదంటూ నిరవధిక నిరాహారదీక్షకు దిగటం కృష్ణాజిల్లాలో సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళితే కృష్ణాజిల్లాలోని మండల కేంద్రమైన బాపులపాడు గ్రామంలో 2014వ సంవత్సరం ఇంటి పన్నులను అప్పటి పాలకవర్గం ఒకేసారి రెండింతలకు పైగా పెంచారు. దీనిపై కొందరు గ్రామస్తులు కోర్టుకు వెళ్ళి పన్నులు చెల్లించటంలేదు. మరి కొందరు మాత్రం పెంచిన పన్నులను సక్రమంగా చెల్లిస్తూ వస్తున్నారు. ఇంటి పన్నులు తగ్గించాలని, ప్రభుత్వం వచ్చి 18నెలలు దాటినా ఈసమస్యను పరిష్కరించలేదంటూ జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు ఆకస్మాత్తుగా బాపులపాడులో గురువారం అమరణ నిరాహారదీక్షకు దిగారు. పవన్‌కళ్యాణ్ మంత్రిగా ఉన్న శాఖలో సమస్యపై జనసేన నేత దీక్ష చేపట్టడం జనసేనతోపాటు కూటమి నాయకులను మింగుడుపడటంలేదు. అదేవిధంగా మల్లవల్లి పారిశ్రామికవాడకు సేకరించిన ప్రభుత్వభూముల్లో ఆక్రమణదారులకు కొందరికి పరిహారం ఇవ్వలేదు. దీనిపై 2016 నుండి బాధితులు అడుగుతున్నా ఎవరూ స్పందించటంలేదు. ప్రభుత్వాలు మారినా తమకు పరిహారం ఇవ్వకపోవటంలేదని బాధితులు వాపోతుండగా, తక్షణం వారికి పరిహారం ఇవ్వాలంటూ జనసేన నాయకుడు డిమాండ్ చేసారు. ఈసమస్యపై గత టిడిపి ప్రభుత్వంలోనే ముగ్గురు ఉన్నతాధికారులతో కమిటీ నియమించగా మల్లవల్లి భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం ఇచ్చామని ఇంకా ఎవరికీ ఇవ్వాల్సిన పనిలేదని కమిటీ నివేదిక ఇచ్చింది. దీంతో ఆఫైల్‌ను ప్రభుత్వం క్లోజ్‌చేసింది. ఎప్పుడో జరిగిన అంశాలకు సంబందించి ఇప్పుడు దీక్ష చేసి ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడం తగదని పలువురు కూటమి నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. పరిష్కారం లేని రెండు సమస్యలను పట్టుకుని దీక్షలు చేయటం ఏమాత్రం సబబుకాదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఎప్పటివో సమస్యలకు అప్పట్లోనే ఆందోళనలు చేయాల్సి ఉండగా అప్పట్లో కామ్‌గా ఉండి ఇప్పుడు ఏమిటన్న ప్రశ్న ఉదయిస్తుంది. కాగా దీక్షా శిబిరానికి కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ చేరుకుని రమేష్‌కు సంఘీభావం తెలిపారు. ఎన్‌టిఆర్‌జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను శుక్రవారం సాయంత్రం బాపులపాడు చేరుకుని రమేష్‌కు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేసారు.

# విశాఖ, మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించండి

### తక్షణమే అవసరమైన నిధులివ్వండి కేంద్రమంత్రి ఖట్టర్‌కు చంద్రబాబు వినతి

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ..విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎంసవరించిన డీపీఆర్ లను కేంద్ర ఆమోదానికి పంపినట్టు తెలిపిన ముఖ్యమంత్రి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు ఏర్పాటు అవశ్యకతను కేంద్ర మంత్రికి సీఎం చంద్రబాబు వివరించారు.రాష్ట్రంలో త్వరితగతిన మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన కార్యచరణకు సహకరించాలన్నారు.అవసరమైన నిధులు కేటాయించాలన్నారు.ఈ విషయంలో ఇప్పటికే రాష్ట్రం చేసిన పలు ప్రతిపాదనలను ఆమోదించాలన్నారు.ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమై భూసేకరణ దిశలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని వివరించారు.,రాష్ట్రంలో ప్రధాన మంత్రి గృహనిర్మాణ పరిధిలో ఇళ్ళ నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు.మరిన్ని ఇళ్ళను కేటాయించాలని విజ్ఞప్తి చేసారు.కేంద్ర గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో సమావేశంలో ఆయనను ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘనంగా సత్కరించారు. కేంద్రమంత్రి కింజరపు రామ్మోహననాయుడు తదితరులు సీఎం చంద్రబాబును అనుసరించి ఉన్నారు.



## వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నాం :ప్రముఖులు

**తిరుమల,డిసెంబర్ 19ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం సంతోషమని సీనియర్ విశ్రాంత ఐఏఎస్ అధికారి,మాజీ టిటిడి ఇఒ డాక్టర్ దొండపాటి సాంబశివరావు తెలిపారు. దొండపాటి దంపతులు శుక్రవారం ఉదయం తిరుమలకు చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకుని దేవదేవుని ఆశీస్సులందుకున్నారు. శ్రీవారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అంతర్జాతీయంగా సత్తా చాటుతున్న మన అరకు కాఫీ

### ప్రత్యేక అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు

**విజయవాడ,డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని అరకు కాఫీ ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఆదరణ పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. అరకు కాఫీకి చెందిన “నానోలాట్ సిరీస్ విడుదలైన కొద్ది గంటల్లోనే అమ్ముడుపోవడంపై ఆయన స్పందించారు. ఈ శుభవార్తను పంచుకున్నందుకు పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రాకు ధన్యవాదాలు తెలిపారు. అరకు రైతులకు ఆనంద్ మహీంద్రా అందిస్తున్న నిరంతర మద్దతును చంద్రబాబు ప్రశంసించారు. ఒక సిరీస్ విడుదలైన ఒక్క రోజులో, మరొకటి కేవలం కొన్ని గంటల్లో అమ్ముడుపోవడం అరకు కాఫీ ప్రత్యేకతకు లభిస్తున్న ప్రపంచ స్థాయి గుర్తింపునకు నిదర్శనమని అన్నారు. అరకు కాఫీని ప్రపంచ ప్రఖ్యాత బ్రాండ్‌గా తీర్చిదిద్దిన నాంది ఫౌండేషన్‌కు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

అంతకుముందు, అరకు కాఫీ తాజా ఘనత గురించి ఆనంద్ మహీంద్రా ట్వీట్ చేశారు. “ఆంధ్రప్రదేశ్‌లోని అరకు లోయ ఖ్యాతి మరోసారి అంతర్జాతీయ స్థాయికి చేరింది. ఇక్కడి కాఫీ బ్రాండ్ ఖిఅరకు కాఫీఖి సరికొత్త రికార్డు సృష్టించింది. తాజాగా విడుదల చేసిన ఖినానోలాట్ సిరీస్ఖి కాఫీ కిలో ఏకంగా రూ. 10,000 ధర పలికింది. ఇంతటి ఖరీదైనప్పటికీ, ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టిన రెండో విడత కాఫీ కేవలం రెండు గంటల్లోనే పూర్తిగా అమ్ముడుపోవడం విశేషం. తొలి విడత కాఫీ 24 గంటల్లోనే అమ్ముడైంది. అత్యంత అరుదైన, స్వచ్ఛమైన కాఫీగా ఈ నానోలాట్ సిరీస్‌ను పరిచయం చేశారు. ఒక్కో రైతు తమకు కేటాయించిన చిన్న చిన్న క్షేత్రాల్లో, చాలా తక్కువ పరిమాణంలో ఈ కాఫీని పండిస్తారు. ఆ గింజలను మైక్రోబ్యాచ్‌లలో వేయించి, వాటి సహజమైన రుచి, సువాసనలు కోల్పోకుండా ప్యాక్ చేస్తారు. అందుకే దీనికి అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంతటి డిమాండ్ ఏర్పడింది. భారతీయ అరేబికా కాఫీకి ఇప్పటివరకు లభించిన అత్యధిక ధరలలో ఇది ఒకటిగా నిలిచింది.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయి అరెస్టు

వెదురుకుప్పం(చిత్తూరుజిల్లా), డిసెంబర్ 19 ప్రభాతవార్త : మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ముద్దాయిని అరెస్టు చేసినట్టు నగరి డిఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ శుక్రవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఆళ్ళమడుగు పంచాయితీ బుచ్చిరెడ్డి కండిగ వడ్డిఇండ్లకు చెందిన 14 సంవత్సరాల మైనర్ బాలిక పై అదే గ్రామంకు చెందిన మురళి(49) లైంగిక దాడిలో చేసినట్టు శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఆ మేరకు డిఎస్పీ నేతృత్వంలో విచారణ చేపట్టారు. కాగా ఆగస్టు నెల 24న మధ్యాహ్నం సుమారు 12 గంటల ప్రాంతంలో ఎవరు లేని సమయంలో బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. సంఘటన ఎవ్వరికి చెప్పకూడదని బెదిరించ డంతో బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా ఉండిపోయిందన్నారు. కాగా డిసెంబర్ 18న బాలికకు కడుపునొప్పి రావడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళడంతో వైద్యులు చికిత్స నిమిత్తం పరీక్షలు నిర్వహించి 22 వారాల గర్భవతి అని ధృవీకరించించడంతో లైంగిక దాడి సమాచారం వెలుగు చూసిందన్నారు. బాలిక చెప్పిన వివరాల మేరకు నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా నిందితుడు దేవళంపేట క్రాస్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరం అంగీకరించిన్నట్లు చెప్పారు. సంఘటనపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్వేటినగరం సర్కిల్ ఇన్స్‌ఫెక్టర్ హనుమంతప్ప, ఎస్ఐ నవీన్ బాబు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి 20 ఏళ్లు జైలుశిక్ష

**సూళ్లూరుపేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త** తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండల పరిధిలోని జంగాలగుంట గ్రామంలో 2017 మార్చి 4వ తేదీన జరిగిన హత్యకేసుకు సంబంధించి నిందితుడు పులి మునస్వామికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 2 వేల రూపాయలు జరిమానా విధిస్తూ నెల్లూరు 8వ ఎడిజె కోర్టు తీర్పునిచ్చింది. జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గుడ్‌ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థను బలోపేతం చేసి ముద్దాయిలకు కఠిన శిక్షలు అమలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రస్తుతం నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సీఐ మురళీకృష్ణ, కోర్టు హెడ్‌కానిస్టేబుల్ ఖాజాహుస్సేన్, కోర్టులైజన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు సాక్షాలను సరైన సమయంలో కోర్టులో ప్రవేశపెట్టడంతో నిందితులను ఈ శిక్ష పడినట్లు సీఐ తెలిపారు. 8వ ఎడిజె కోర్టు నెల్లూరు జడ్జి ఎం.సోమశేఖర్ ఈ కేసులో తుది తీర్పునిచ్చినట్లు ఆయన తెలిపారు. 2017వ సంవత్సరంలో అప్పటి సిఐలు విజయకృష్ణ, కిషోర్‌బాబులు ఈ కేసును సమర్థవంతంగా సాక్షులను పొందుపరచడంతో ఈ తీర్పు సాధ్యపడిందని ఆయన చెప్పారు.

## మున్సిపాలిటీలకు ఎనర్జీ కన్జర్వేషన్ -2005 అవార్డులు ప్రకటన

### తిరుపతి,భీమవరం మొదటి.రెండు అవార్డులు

**విజయవాడ.డిసెంబరు 19,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లోని మున్సిపాలిటీలకు ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు2025 లను కూటమి సర్కాం) ప్రకటించింది. తిరుపతి మున్సిపాలిటీకి గోల్డ్ అవార్డు, భీమవరం మున్సిపాలిటికి సిల్వర్ అవార్డులు దక్కాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలకు ఈ అవార్డులు ప్రకటించారు.తిరుపతి మెదటిస్థానం, భీమవరం మున్సిపాలిటీ రెండో స్థానం సొంతం చేసుకున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లో విద్యుత్ వినియోగం, ఆదా చేయడంలో కృషి చేసారు.

# డోపింగ్ ఉల్లంఘనల్లో భారత్ టాప్



**న్యూఢిల్లీ:** డోపింగ్ ఉల్లంఘనల్లో (ఉత్ప్రేరకాలు, మాదకద్రవ్యాల వాడకానికి సంబంధించి) భారత్ టాప్‌లో ఉంది. తాజాగా ప్రపంచ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (డబ్ల్యూఎడిఎ) నివేదికలో ఈ అంశం వెల్లడైంది. రన్నింగ్ నుంచి క్రికెట్, బౌలింగ్, గోల్ఫ్ క్రీడలు ఏవైనా కూడా ప్రతీ ఆటగాడు కూడా డోపింగ్ టెస్ట్‌కు సిద్ధంగా ఉండాల్సిందే. ఇది కేవలం టెస్ట్ మాత్రమే కాదు. ఆటగాళ్ల, నిజాయితీగా ఆడుతున్నారా లేదా అనేది కూడా చాలా ముఖ్యం. అందుకోసం ఆటగాళ్ల నిషేధిత డ్రగ్స్ తీసుకున్నారా అనే విషయాన్ని పసిగట్టేందుకే డోపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. అటువంటి డోపింగ్ ఉల్లంఘనల విషయంలో డబ్ల్యూఎడిఎ విడుదల చేసిన 2024 టెస్టింగ్ ఫిగర్స్ రిపోర్ట్ ప్రకారం, 5 వేలకుపైగా డోపింగ్ పరీక్షలు నిర్వహించిన దేశాల్లో భారత్‌లోనే అత్యధిక సంఖ్యలో ఉల్లంఘనలు నమోదయ్యాయి. ఈ పరిస్థితి భారత క్రీడారంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది భారత్ మొత్తం 7,113 డోపింగ్ పరీక్షలు నిర్వహించింది. ఇందులో 6,576 యూరిన్ నమూనాలు, 537 రక్త నమూనాలు ఉన్నాయి. ఈ పరీక్షల్లో 260 నమూనాలు పాజిటివ్‌గా తేలాయి. దీంతో భారత్‌లో డోపింగ్ పాజిటివిటీ రేటు 3.6 శాతంగా నమోదైంది. ఇది ప్రధాన దేశాలన్నింటిలోనూ అత్యధికంగా ఉండటం గమనార్హం. భారత్‌లో కొనసాగుతున్న డోపింగ్ సమస్య, భవిష్యత్తులో 2036 ఒలింపిక్స్ ఆతిథ్య బిడ్‌ను అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) పరిశీలించే సమయంలో కీలకంగా మారే అవకాశం ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠపై ఈ గణాంకాలు ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. అయితే, ఈ సంఖ్యలపై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ (నాడా) వివరణ ఇచ్చింది. డోపింగ్ ఉల్లంఘనలు పెరిగినట్లు కనిపిస్తున్నా, అది డోపింగ్ వినియోగం పెరిగినందుకేగాక, పరీక్షలసంఖ్యపెరగడం, గుర్తింపు వ్యవస్థలు బలోపేతం కావడమే కారణ మని స్పష్టం చేసింది. విస్తృతస్థాయిలోపరీక్షలు, కఠినమైన డిటెక్షన్ విధానాలవల్లే ఎక్కువ కేసులు బయట పడుతున్నాయనిపేర్కొంది.

ఇదే సమయంలో 2023 గణాంకాలను పరిశీలిస్తే, ఆ ఏడాది భారత్ 5,606 డోపింగ్ పరీక్షలు నిర్వహించగా, 213 పాజిటివ్ ఫలితాలు నమోదయ్యాయి. అంటే డోపింగ్ ఉల్లంఘనల శాతం స్వల్పంగా తగ్గినప్పటికీ, మొత్తం సంఖ్యలు ఇంకా ఆందోళనకరంగానే ఉన్నా యని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మొత్తంగా డోపింగ్‌పై భారత్ మరింత కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.



కేతన్ మాలిక్ | మను భాకర్ | సురుచి ఫోగట్

## ఎయిర్ పిస్టల్ ఛాంపియన్‌గా కేతన్
### మను, సురుచి ఓటమి

**న్యూఢిల్లీ:** ఎయిర్ పిస్టల్ ఫైనల్‌కు అర్హత సాధించడంలో మను భాకర్, సురుచి ఫోగట్ విఫలమయ్యారు. డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో జరుగుతున్న 68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో హర్యానాకు చెందిన కేతన్ మాలిక్ ఛాంపియన్‌గా నిలిచింది. పారిస్ ఒలింపిక్ డబుల్ పతక విజేత మను భాకర్ 137.2 పాయింట్లతో మొత్తం మీద ఏడో స్థానంలో, ఆసియా క్రీడల ఛాంపియన్ పాలక్ గులియా 179.2 పాయింట్లతో ఐదో స్థానంలో నిలిచారు. సురుచి ఫోగట్ కూడా ఫైనల్‌కు అర్హత సాధించడంలో విఫలమై 577 స్కోరుతో 14వ స్థానంలో నిలిచింది. కేతన్ 240.0 పాయింట్లతో స్వర్ణం సాధించగా, మీను పాఠక్ 238.4 పాయింట్లతో రజతం, సురభి రావు 219.5 పాయింట్లతో కాంస్యం గెలుచుకున్నారు. జూనియర్ మహిళల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వంశిక చౌదరి 0.2 పాయింట్లతో అంజలి షెకావత్‌ను ఓడించి స్వర్ణం సాధించగా, పాలక్ గులియా కాంస్యం, ఆర్మీ యూనిట్‌కు చెందిన లక్షిత బిష్ణోయ్ రష్మిక సహగల్‌పై 0.6 పాయింట్లతో విజయం సాధించి యూత్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. జూనియర్ ఈవెంట్ ఫైనల్‌లో వంశిక చౌదరి 240.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. అంజలి షెకావత్ బలమైన సవాలు విసిరినప్పటికీ 0.2 పాయింట్లతో కేవలం వెనుకబడి రజతం, పాలక్ గులియా 218.0 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. యూత్ ఈవెంట్ ఫైనల్లో, లక్షిత బిష్ణోయ్ బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఫైనల్లో రష్మిక సహగల్‌ను 0.6 తేడాతో ఓడించింది.

## ప్రపంచ టెన్నిస్ లీగ్.. ఈగల్స్‌ను గెలిపించిన సుమిత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ టెన్నిస్ లీగ్-2025లో భారతదేశపు ప్రముఖ సింగిల్స్ స్టార్ సుమిత్ నాగల్ ఎఒఎస్ ఈగల్స్‌ను గెలిపించాడు. వరల్డ్ టెన్నిస్ లీగ్ పోటీలో ఎఎస్ఒ ఈగల్స్, ఆస్ట్రేలియన్ మావెరిక్స్ కైట్స్ మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో సుమిత్ నాగల్, దక్షిణేశ్వర్ సురేష్ మధ్య పురుషుల సింగిల్స్ పోటీ జరిగింది. సెట్‌లో చివరి వరకు హోరాహోరీగా సాగిన తర్వాత, నాగల్ మరియు సురేష్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు తొలి టైబ్రేక్‌ను అందించారు. బ్రేకర్‌లో 6-6 వద్ద నిర్ణయాత్మక గోల్డెన్ పాయింట్ నియమం అమలులోకి వచ్చింది. నాగల్ పాయింట్, గేమ్‌ను గెలిచి ఈగల్స్ కోసం క్లీన్ స్వీప్‌ను పూర్తి చేసే ప్రయత్నంలో 25-13 తేడాతో విజయం సాధించారు. పౌలా బడోసా తొలి సెట్‌లో మార్తా కోస్ట్యుక్‌ను 6-1తేడాతో ఓడించి ఈగల్స్‌కు మంచిఊపునిచ్చింది. 2025 ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీఫైనలిస్ట్ అయిన బడోసా ఉక్రేనియన్ క్రీడాకారిణిపై స్ట్రోక్ మేకింగ్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసింది. కాగా మిక్స్‌డ్ డబుల్స్‌లో గేల్ మోన్‌ఫిల్స్‌తో కలిసి విజయవంతమైన సెట్‌ను సృష్టించడంతో స్పెయిన్ క్రీడాకారిణి ఆధిపత్య పరుగును కొనసాగించింది. మోన్‌ఫిల్స్ అథ్లెటిసిజం మరియు టచ్ మరియు బేస్‌లైన్ నుండి బడోసా యొక్క ఫైర్‌పవర్ సురేష్ మరియు మార్తా కోస్ట్యుక్‌ను 6-3తో అధిగమించడంలో వారికి సహాయపడింది. పురుషుల డబుల్స్‌లో, మోన్‌ఫిల్స్ నాగల్ 6-3తో సురేష్‌నిక్ కిర్గియోస్‌ను ఓడించాడు.









## పట్టుబిగించిన ఆస్ట్రేలియా
### చేతులెత్తేసి 356 రన్స్ వెనుకబడిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** యాషెస్ సిరీస్, 2025-26లో ఆస్ట్రేలియా పట్టుబిగించగా, ఇంగ్లండ్ చేతులెత్తేసింది. ఆడిలైట్ వేదికగా జరుగుతున్న ఈ సిరీస్‌లో మూడో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 356 పరుగుల వెనుకబడి ఉంది. ఇక ఈ సిరీస్‌లో ఆస్ట్రేలియా స్టార్ ఓపెనర్ ట్రావిస్ హెడ్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తన హోమ్ గ్రౌండ్ అయిన ఆడిలైట్ ఓవల్‌లో ఇంగ్లండ్ బౌలర్లను ఉతికారేశాడు. ఈ క్రమంలో 146 బంతుల్లో తన 11వ టెస్టు సెంచరీని పూర్తి చేసుకున్నాడు. హెడ్ 142 పరుగుతో ఇంకా క్రీజులో ఉన్నాడు. రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన ఆసిస్‌కు ఓపెనర్ వెథరాల్డ్ (1) ఔట్ కావడంతో ఆదిలోనే షాక్ తగిలింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన మార్నస్ లబుషేన్ (13) ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయాడు. ఈ సమయంలో హెడ్ వెటరన్ ప్లేయర్ ఉస్మాన్ ఖావాజా (40) ఇన్నిగ్స్ చక్కదిద్దే యత్నం చేసినా పెవిలియన్‌కు చేరాడు. అయితే ఒక వైపు వికెట్లు పడుతున్నా హెడ్ మాత్రం ఏ మాత్రం తడబడకుండా ఇంగ్లండ్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డు పరుగులు పెట్టించాడు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సరికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసింది. క్రీజులో హెడ్‌తో పాటు, అలెక్స్ కారీ (52) ఉన్నాడు.

## ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్‌లో రాణించిన శ్రుతి
### టీమ్ ఇండియాకు ట్రిపుల్ రజతం



**న్యూఢిల్లీ:** ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్‌లో (గుర్రపు స్వారీ) శ్రుతి వోరా రాణించడంతో టీమ్ ఇండియాకు ట్రిపుల్ రజత పతకం లభించింది. ఆసియా కాంటినెంటల్ ఛాంపియన్‌షిప్స్ 2025లో టీమ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రుతి వోరా, ఈక్వెస్ట్రియన్ డ్రెస్సేజ్‌లో మూడు రజత పతకాలను గెలుచుకుంది. అదే సమయంలో గుర్రం నెం. 209 తో మాగ్నానిమస్‌పై పోటీ పడింది. థాయిలాండ్‌లోని పట్టాయాలో శుక్రవారం జరిగిన డ్రెస్సేజ్ ఫ్రీస్టైల్ టు మ్యూజిక్ ఇండివిజువల్ ఛాంపియన్‌షిప్ ఈవెంట్‌లో, శ్రుతి వోరా బలమైన మరియు స్వరపరిచిన ప్రదర్శనను ప్రదర్శించింది. మాగ్నానిమస్‌లో 73.800 స్కోరును నమోదు చేసి రజత పతకాన్ని గెలుచుకుంది. ఇక టీమ్ డ్రెస్సేజ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ దృఢనిశ్చయంతో కూడిన ప్రదర్శనను ప్రదర్శించి, 204.059 స్కోరుతో రజత పతకాన్ని గెలుచుకుంది. భారత జట్టులో ఎలక్టర్‌లో గౌరవ్ పుండిర్ (66.059), ఇంప్రూవ్‌లో దివ్యకృతి సింగ్ (67.118), మాగ్నానిమస్‌లో భారత్‌కు చెందిన శ్రుతి వోరా (70.882) ఉన్నారు. ఇక ఇంటర్మీడియట్ డ్రెస్సేజ్ ఇండివిజువల్ ఈవెంట్‌లో భారతదేశానికి చెందిన శ్రుతి వోరా కూడా రజతం గెలుచుకుంది. అసాధారణమైన స్థిరత్వాన్ని మరియు మాగ్నానిమస్‌తో బలమైన భాగస్వామ్యాన్ని ప్రదర్శించి 70.882 స్కోరు సాధించింది.

# స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకులో రూ.80 కోట్లు మళ్లింపు
### హెచ్‌ఎన్ఐ ఖాతాలనుంచి దారిమళ్లించిన బ్యాంకు ఉద్యోగి



**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంకు తన అంతర్గత విచారణను మరింత వేగవంతం చేసింది. బెంగళూరు ప్రయారిటీ బ్యాంకింగ్ యూనిట్‌లో రూ.80 కోట్లకుపైగా అవకతవకలు జరిగాయని, ఎక్కువమంది అత్యధిక సంపన్నులు (హెచ్‌ఎన్ఐ)ల ఖాతాలనుంచి 80 కోట్లు దారిమళ్లించారన్న ఆరోపణలు సిబ్బందిపై వచ్చాయి. గత నవంబరు మధ్యకాలంలోనే ఒక కస్టమర్ తన ఖాతాలో నిధులు మిస్ అవడంపై ఫిర్యాదుచేయడంతో దర్యాప్తు షురూచేసారు. ప్రాథమికంగా రూ.2.7 కోట్లు ఫిక్సెడ్ డిపాజిట్లనుంచి దారి మళ్లించారని తర్వాత తనిఖీల్లో భారీ ఎత్తున అవకతవకలు జరిగినట్లు ధృవీకరించారు. హెచ్‌ఎన్ఐలకు సంబంధించిన ఎక్కువ ఖాతాలనుంచి సొమ్ములు బదలాయించారన్న ఫిర్యాదులు పెరిగాయి బ్యాంకు ఎంజిరోడ్డుబ్రాంచ్ లావాదేవీలు ఈ ఫిర్యాదులతో స్తంభించాయి. వీరిలో కొందరు ప్రముఖ బిజినెస్ కంపెనీలకు చెందినవారనికూడా తేలింది. బ్యాంకు ఇప్పటివరకూ ఒక ఉదోనయగిని, రిలేషన్‌షిప్‌మేనేజర్ నక్కా కిశోర్‌కుమార్‌ను కీలక నిందితుడుగా గుర్తించింది. హలసూరు గేట్ పోలీస్ ఆతడిని అరెస్టుచేసారు. బ్యాంకు సర్వీసునుంచి డిస్మిస్‌చేసింది. బ్యాంకు అవకతవకలపై పోలీసులకు ఫిర్యాదులుచేసింది. ఐదుకోట్లు దాటడంతో కర్నాటక అదికారులు బెంగళూరు సిటీ పోలీస్‌నుంచి సిఐడికి బదలాయించారు. అంతేకాకుండా బ్యాంకు ప్రైస్ వాటర్‌కూపర్స్ ఏజెన్సీతో సమగ్రఅంతర్గత ఆడిట్‌కు నిర్దేశించింది ఫోరెన్సిక్ ఆడిట్‌లోనే అవకతవకలన్నీ బయటపడ్డాయి. ఇపుడు బ్యాంకు అవకతవకలపై పోలీస్, సిఐడి, బ్యాంకు అంతర్గత దర్యాప్తుతోపాటు ప్రైస్‌వాటర్‌కూపర్స్ కూడా తనిఖీలుచేస్తోంది.

# వారాంతంలో సెన్సెక్స్, నిఫ్టీలు లాభాల్లోనే..

**ముంబయి, డిసెంబరు 19:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ లాభాలతో ముగిసాయి. నాలుగు రోజుల నష్టాలకు చెక్‌పెట్టాయి. భారీకంపెనీల షేర్లలో స్థిరమైన కొనుగోళ్లు జరగడం, రూపాయి విలువ పుంజుకోవడం వంటి అంశాలు సూచీల పెరుగుదలకు మద్దతిచ్చాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ సానుకూలంగా ఉండటంతో రోజంతా మార్కెట్లలో జోరు కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బిఎస్ఇ సెన్సెక్స్ 447.55 పాయింట్లు లాభపడి 84,929 వద్ద స్థిరపడింది. మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ నిఫ్టీ 151 పాయింట్లు పెరిగి 25,966 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 275 పాయింట్ల లాభంతో మొదలైంది. ఒక దశలో 85,067.50 గరిష్ఠ స్థాయిని కూడా తాకింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 25,993 వరకు వెళ్లింది. సెన్సెక్స్ స్టాక్స్‌లో భారత్ ఎలక్ట్రానిక్స్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ 2 శాతానికి పైగా లాభపడి టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. ఏషియన్ పెయింట్స్, లార్సెన్ అండ్ టూబ్రో, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్ షేర్లు కూడా రాణించాయి.




మరోవైపు, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేరు సుమారు 1 శాతం నష్టపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టీసీఎస్ షేర్లు కూడా నష్టాలతో ముగిశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన పనితీరు కనబరిచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు చెరొక 1.3 శాతం పెరిగాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 89.25 వద్ద ముగియడం కూడా మార్కెట్లకు అదనపు బలాన్నిచ్చింది. ఇటీవలి రికవరీని బట్టి చూస్తే, వచ్చే వారం శాంటా ర్యాలీకి అవకాశం కనిపిస్తోంది. నిఫ్టీ 26,200 స్థాయికి చేరవచ్చు. అయితే, 25,700 వద్ద కీలక మద్దతు ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. బిఎస్ఇలో 2731 కంపెనీలషేర్లుపెరిగితే 1445 షేర్ల క్షీణించాయి. 170 కంపెనీల షేర్లు యధాతథంగా కొనసాగాయి. బిఎస్ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 1.26శాతం, స్మాల్‌క్యాప్‌సూచీ 1.25శాతం చొప్పున లాభపడ్డాయి. భెల్ 2.37శాతం, రిలయన్స్ 1.34శాతం, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 0.64శాతం చొప్పున ర్యాలీతీసి లాభాలకు మద్దతిచ్చాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 89.25వద్ద బలపడింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్స్ ఫిబ్రవరి ఐదోతేదీనాటికి 0.50శాతంపెరిగి రూ.1,33,850కి చేరాయి. అమెరికా పదేళ్ల బాండ్లు 0.68శాతంపెరిగి 4.14శాతంగా వడ్డీ నిలిచింది. కమొడిటీల్లో ముడిచమురుధరలు 35 సెంట్లు క్షీణించి బ్యారెల్‌కు 59.47 డాలర్లుగా నడిచాయి.



## పదిగ్రాముల పసిడిధర రూ.1,34,180
### కిలో వెండిధర రూ.2.21 లక్షలు పైమాటే

**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** బులియన్ మార్కెట్‌లో రోజురోజుకూ ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. బంగారంతోపాటే వెండిధరలు కూడా ఈసారి చుక్కలను తాకుతుండటంతో కస్టమర్లు ఒకింత కొనుగోలుకు వెనుకంజవేస్తున్నా కొనుగోళ్లు మాత్రం ఎక్కడా ఆగడంలేదు. 24 క్యారెట్ల బంగారంధరలు పదిగ్రాములు రూ.660 తగ్గి రూ.1,34,180కిచేరింది. 22క్యారెట్ల పది గ్రాముల ధర రూ.600 తగ్గి రూ.1,23వేలవద్ద ట్రేడ్ అయింది. 18క్యారెట్ల బంగారంధరలు కూడా రూ.490 తగ్గి రూ.1,00,640వద్ద కొనుగోళ్లుజరిగాయి. వెండిదరల్లోకూడా వారాంతంలో ఉపశమనం లభించింది. వెండిపై రూ.2వేలు తగ్గింది. బులియన్ మార్కెట్‌లో కిలో వెండి రూ.2,09,000 వద్ద విక్రయించారు. హైదరాబాద్, చెన్నై మార్కెట్లలో కిలో వెండి రూ.2.21 లక్షలవద్ద అమ్ముడయితే ఢిల్లీ, ముంబయి, కోల్‌కత్తాల్లో మాత్రం కిలో వెండి ధరలు రూ.2.09 లక్షలవద్ద కొనసాగాయని బులియన్ ట్రేడర్లు పేర్కొంటూన్నారు.

## ఏవియేషన్ రంగంలో అదాని రూ.లక్షల కోట్ల పెట్టుబడులు!



**ముంబయి, డిసెంబరు 19:** భారత ఏవియేషన్ రంగంలో వృద్ధి అవకాశాలపై బలమైన విశ్వాసంతో ఉన్న అదానీ గ్రూప్, తమ విమానాశ్రయాల వ్యాపారంలో భారీ పెట్టుబడులకు సిద్ధమైంది. రాబోయే ఐదేళ్లలో ఏకంగా రూ.1 లక్ష కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు అదానీ ఎయిర్‌పోర్ట్స్ డైరెక్టర్, గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ తెలిపారు. ఈ నెల 25న నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయం వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించనున్న నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక అంశాలుతెలియజేశారు. నవీ ముంబై ఎయిర్‌పోర్ట్‌లో అదానీ గ్రూప్‌కు 74 శాతం వాటా ఉంది. రూ.19,650 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ విమానాశ్రయం మొదటి దశలో ఏటా 2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తుంది. భవిష్యత్తులో దీని సామర్థ్యాన్ని 9 కోట్ల మందికి పెంచనున్నారు. ఇది ప్రస్తుత ముంబై విమానాశ్రయంపై భారాన్ని తగ్గించనుంది. భారత ఏవియేషన్ రంగం రాబోయే పది 15 ఏళ్లపాటు ఏటా 15నుంచి16 శాతం చొప్పున స్థిరంగా వృద్ధి చెందే సత్తా ఉందని జీత్ అదానీ ధీమా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం చేపట్టబోయే తదుపరి విడత విమానాశ్రయాల ప్రైవేటీకరణలో కూడా దూకుడుగా పాల్గొంటామని, 11 ఎయిర్‌పోర్ట్‌ల కోసం బిడ్ దాఖలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం ముంబై, నవీ ముంబైతో పాటు అహ్మదాబాద్, లక్నో, గువాహటి, జైపూర్ వంటి ఆరు ఇతర విమానాశ్రయాలను అదానీ గ్రూప్ నిర్వహిస్తోంది. దేశంలోని మొత్తం ప్రయాణికులలో దాదాపు 23 శాతం మంది అదానీ గ్రూప్ విమానాశ్రయాల ద్వారానే ప్రయాణిస్తున్నారు.

## జనవరి ఒకటో తేదీనుంచి వారికి పాన్ రద్దు

**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** ఆర్థికసేవల్లో ఎలాంటి లావాదేవీలు నిర్వహించాలన్నా పాన్ తప్పని సరిచేసింది కేంద్రం. బ్యాంకులో రూ.50 వేలకు మించి డబ్బులు జమ చేసినా పాన్ నంబరు తప్పనిసరి. నకిలీ పాన్ కార్డులను నిరోధించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సిబిడిటి కీలక నిర్ణయం తీసుకుంది. పాన్ కార్డును ఆధార్ నంబర్‌తో అనుసంధానం చేయడం తప్పనిసరి చేసింది. ఎప్పుడో ఆధార్ ఎన్‌రోల్మెంట్ ఐడీ ద్వారా పాన్ కార్డు తీసుకున్న వారు తప్పనిసరిగా డిసెంబరు 31వ తేదీలోగా పాన్ ఆధార్ లింక్ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత గడువులోగా ఈ రెండింటినీ లింక్ చేయకపోతే 2026 జనవరి 1, నుంచి పాన్ కార్డులు రద్దవుతాయి. దీంతో చాలా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. దాయపు పన్ను రిటర్నులు ఫైల్ చేయడం కుదరదు. ఖాతాదారులకు రావాల్సిన ట్యాక్స్ రీఫండ్లు నిలిచిపోతాయి. బ్యాంకు ట్రాన్సాక్షన్లు, మ్యూచువల్ ఫండ్లు తదితర పెట్టుబడులపై అధిక టిడిఎస్ కట్ చేస్తారు. రూ.50 వేల కంటే ఎక్కువ విలువైన ట్రాన్సాక్షన్లు చేయడం కుదరదు. డీమ్యాట్ అకౌంట్ ప్రారంభించేందుకు కేవైసీ ప్రక్రియ సైతం పూర్తి చేయలేరు. లోన్స్ తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్లోకి వెళ్లి లింక్ ఆధార్ ఆప్షన్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒక వేళ ఇప్పటికే ఆధార్ పాన్ లింక్ చేసి ఉంటే పాన్ ఆధార్ లింక్ స్టేటస్ తెలుసుకోవచ్చు. ఇప్పుడు పాన్ ఆధార్ లింక్ కోసం రూ.1000 ఫీజుచెల్లించాలి.

## శ్రీరామ్‌ఫైనాన్స్‌లో జపాన్ బ్యాంకు భారీ పెట్టుబడి





**న్యూఢిల్లీ, డిసెంబరు 19:** ఆర్థికసేవల పరంగా దేశీయ ఫైనాన్స్ కంపెనీలోకి భారీ విదేశీ పెట్టుబడి వస్తోంది. ఆర్థికసేవల సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్‌కు చెందిన ఎంయుఎఫ్‌జి బ్యాంకు రూ.39,168 కోట్ల పెట్టుబడికి సిద్ధం అయింది. 20శాతం వాటా ఆ కంపెనీకి విక్రయించేందుకు శ్రీరామ్ బోర్డు ఆమోదించింది. ప్రాధాన్యతా ఈక్విటీ షేర్లను శ్రీరామ్ ఫైనాన్స్ జారీచేస్తుంది. ఎంయుఎఫ్‌జి బ్యాంక్‌కు 20శాతం వాటా వస్తుందని శ్రీరామ్‌ఫైనాన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. రుణ ఆర్తికసేవల భవిష్యత్ వృద్ధి సామర్థ్యంపై నమ్మకం పెరుగుదలను ఈ డీల్ తెలియచేస్తోందని శ్రీరామ్‌ఫైనాన్స్ వెల్లడించింది. శ్రీరామ్‌ఫైనాన్స్ క్యాపిటల్ బేస్‌ను మరింత బలోపేతం చేస్తుందని, వృద్ధి మరింత వేగవంతం అవుతుందని వెల్లడించింది. వాటాదారులు, నియంత్రణ సంస్థలు ఆమోదం తెలపాల్సి ఉందని కంపెనీ తెలిపింది. టెక్నాలజీ, ఇన్నొవేషన్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్ పరంగా సుస్థిర వృద్ధి సాధ్యమవుతుందని తెలిపింది. దేశీయ ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోకి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టాయి. మరికొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. ఎస్ఎంబిసి ఎస్‌బ్యాంకులో 24శాతం, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకులో వార్‌బర్గ్ పింకస్, అబూదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీలు వాటా దక్కించుకున్నాయి. ఆర్బీఎల్ బ్యాంకులో మెజార్టీ వాటా కొనుగోలుకు ఎమిరేట్స్ ఎన్బీడీ ముందుకురాగా ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్ బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99శాతంవాటా కొనుగోలుకు ఒప్పందంచేసుకుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps